

జనవరి, 2011

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 12 పేజీలు: 64 వెల: రూ. 20/-




## గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రమాణస్వీకారం

# నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...



# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 12

జనవరి, 2011



ఛీఫ్ ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

ఎడిటర్

**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**జి. గంగాధరం**

**టి. కృష్ణ**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**ప్రొ. పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**సి. వెంకటేశ్వర రావు**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**

**ఎమ్. విజయలక్ష్మి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail : krishna.chandramouli90@gmail.com


# విషయ సూచిక


సంపాదకీయం .......... 2

గ్రామీణాభివృద్ధి శాఖామంత్రిగా
గౌ. శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌రావు .......... 3

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలి .......... 4

అపార్డ్ న్యూస్ .......... 5

నాణ్యమైన వ్యక్తిగత జీవనానికి ఆడపిల్లల సాధికాత .......... 8

ఉపాధి హామీ పనులకు జి.పి.ఎస్. కో - ఆర్డినేటర్లు తప్పనిసరి .......... 9

దేశ భాషలందు తెలుగు లెస్స (వెంటాడేవాక్యం) .......... 10

రెవిన్యూ అధికారులు గుర్తుంచుకోవలసిన ముఖ్యాంశాలు .......... 11

యాదవులనే ప్రభువులుగా భావించేవారు కొమ్ములవారు .......... 13

స్థానిక సంస్థలకు 13వ ఆర్థిక సంఘం నిధులు .......... 14

ఆత్మ గౌరవానికి భంగం కలిగినప్పుడు సహనానికి తావులేదు .......... 17

తిమ్మాపూర్‌లో ప్రయోగాత్మక సోషల్ ఆడిట్ .......... 19

సూక్ష్మ ఋణం లాభమా ? భారమా ? .......... 23

రాష్ట్రంలో నూతన మంత్రివర్గం .......... 25

ఆదివాసీల అభ్యున్నతికి రాజ్యాంగంలో పలు అధికరణలు .......... 30

బాలికా ! ఓ బాలికా !! .......... 32

'అపార్డ్' శిక్షణలతో - చైతన్యమవుతున్న గ్రామ సభలు .......... 34

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పెద్దఎత్తున ఉద్యానవన
తోటల పెంపకం .......... 36

జీవధార... .......... 40

1989 నాటి ఎస్.సి. ఎస్.టి.లపై అత్యాచారాల నిరోధక చట్టం
ఏం చెప్తుంది ? .......... 41

దోమలతో సమరం .......... 45

శ్రీ రమణ పేరడీలు .......... 48

క్రీడా రంగంలో ఉరకలు వేస్తూ నూతన సంవత్సరంలోకి భారత్ .......... 51

ఉపాధి హామీ పథకాన్ని ఉత్తమోత్తమం చేసే గ్రామసభలు .......... 55

పంచాయితీరాజ్ సంస్థలలో మోడల్ ఎకౌంటింగ్ పద్ధతి .......... 56

సంక్రాంతి వేళ... ఆనందహేల .......... 57

చెట్టు - మనిషి .......... 59

మ్యాప్‌లు, వాటి వృత్తాంతం .......... 60

మొలక ధాన్యాలు-పోషక విలువలు .......... 63

ఉరి .......... 64

# సంపాదకీయం..

జనవరి, 2011

## జాతీయ బాలికా దినోత్సవానికి స్వాగతం

ప్రతిస్త్రీ, ప్రతి బాలికా అర్ధరాత్రి కూడా నిర్భయంగా సంచరించగలిగినప్పుడే దేశానికి స్వాతంత్ర్యం నిజంగా వచ్చినట్లు - అని గాంధీ మహాత్ముడనేవారు. రోడ్డుమీద నిర్భయంగా తిరగటం సంగతేమో కాని తల్లి గర్భంలోనే నిర్భయంగా నిద్రపోయే అదృష్టం అనేకమంది బాలికలకు దక్కటం లేదు. గర్భంలో ఉన్నది ఆడ పిండమని పరీక్షలో తేలగానే అక్కడే అంతమయిపోతున్నాయి లక్షలాది ఆడపిండాలు.

ఈ కారణం వల్లనే గత ఏడాది కేంద్ర ప్రభుత్వం జనవరి 24వ తేదీని జాతీయ బాలికా దినోత్సవంగా ప్రకటించింది. తద్వారా ఆడపిండాల హత్యేకాక, గృహ హింస, పోషకాహారలోపం, ఆరోగ్యం, విద్య, సమాన అవకాశాలు మొదలైన అంశాలపై దృష్టి సారించటం కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యం.

సాధారణంగా ఇటువంటి దినోత్సవాలు అంతర్జాతీయంగా ఒకే తేదీన జరగుతుంటాయి. అయితే, ఇతర దేశాలన్నిటికీ వేరువేరు రోజుల్లో బాలికా దినోత్సవాలు ఉండటంతో, మనకు కూడా విడిగా ఒక జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. బాలికా దినోత్సవాన్ని ప్రకటించడంతో ఊరుకోకుండా, స్త్రీ-పురుష సమానత్వం, బాలికల ప్రాధాన్యత మొదలైన అంశాలపై పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టింది.

మహిళలు ఎక్కువగా ఎదుర్కొంటున్న గృహహింసపై కూడా కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. అవసరమైనంత మంది రక్షణాధికారుల నియామకానికి గాను అన్ని రాష్ట్రాలకు సరిపడా నిధులను అందించటానికి ప్రాధాన్యత ఇస్తున్నది. గృహహింస నిరోధక చట్టాన్ని బడ్జెట్‌లో భాగంగానే అమలు చేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తున్నది. అంతేకాక, అంగన్‌వాడీ కార్యకర్తలకు; సమస్యలను, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొన్న మహిళలకు, ప్రతిభావంతులైన బాలికలకు అవార్డులను కూడా ఇస్తున్నది. బాలికలకు సంబంధించిన పలు అంశాలపై పెద్దఎత్తున ప్రచారాన్ని కూడా ప్రారంభించింది.

కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఒకవైపు ఇవన్నీ జరుగుతుండగా, దేశవ్యాప్తంగా స్థానిక సంస్థలకు ఎన్నికైన దాదాపు 10 లక్షల మంది మహిళా నాయకుల్లో అనేకమంది స్థానిక పరిపాలనలో కీలకపాత్ర వహిస్తున్నారు. ఆహారభద్రత, ఆరోగ్యం, విద్య, నీరు మొదలైన విషయాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకుంటూ తమ గ్రామాలను సమానత్వం వైపు, సామాజిక న్యాయంవైపు తీసుకెళుతున్నారు.

అంతేకాక, ఈ మహిళా నాయకులు తమ గ్రామాల్లోని బాలికల హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గట్టిగా సమర్థిస్తూ, ప్రతి బిడ్డ చదువుకోవాలని, ప్రత్యేకించి బాలికలు చదువుకోవాలని కృషి చేస్తున్నారు. ఆడ పిండాలను అంతం చేయటంపై, వారికి పోషకాహారం అందించకపోవటంపై కూడా వీరు పోరాడుతున్నారు.

వీరు తమతమ స్థాయిల్లో చేస్తున్న కృషి నిశ్శబ్ద విప్లవంలా పనిచేస్తోంది. విద్య విలువను తెలుసుకున్న మహిళా నాయకులు ప్రతి బాలికా విద్యావంతురాలు కావాలని తపనపడుతూ చేస్తున్న కృషి అనేక చోట్ల సత్ఫలితాలను ఇస్తోంది. వీరిని ఆదర్శంగా తీసుకుని, ఆడపిండాల అబార్షన్లు, గృహహింస, నిరక్షరాస్యత, పోషకాహారలోపం వంటి సమస్యలపై స్థానిక సంస్థలకు ఎన్నికైన మిగిలిన మహిళా నాయకులు, స్థానిక ప్రభుత్వ సంస్థల్లోని ప్రభుత్వ అధికారులు ఇతోధికంగా కృషి చేయాలని ఈ జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.

( కె. చంద్రమౌళి )





## గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా

## గౌ॥ శ్రీ డొక్కా మాణిక్య వర ప్రసాద రావు

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా గౌ. శ్రీ డొక్కా మాణిక్య వర ప్రసాద రావు తేది : 1-12-2010 శుక్రవారం నాడు పదవీ బాధ్యతలు చేపట్టారు. తేది : 5-3-1962న జన్మించిన శ్రీ డొక్కా మాణిక్య వర ప్రసాదరావు గుంటూరు జిల్లాలోని తాడికొండ నియోజకవర్గం నుండి శాసన సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బి.ఎస్సీ, ఎల్.ఎల్.ఎం. చదివిన శ్రీ మాణిక్య వరప్రసాద్ 2004, 2009లలో జరిగిన ఎన్నికలలో వరుసగా విజయం సాధించి, 2009 నుండి కీ.శే. వై.యస్. రాజశేఖర రెడ్డి, శ్రీ రోశయ్యల మంత్రి వర్గంలో ప్రాథమిక విద్యా శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాబోయే కాలంలో తన ప్రాధాన్యతలను వివరించారు. ఉపాధి హామీ పథకం క్రింద వచ్చే మూడేళ్ళలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన 24 లక్షల ఎకరాల భూమిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేయనున్నట్లు తెలియచేశారు. ఇందుకు గాను రూ. 12,000 కోట్లతో ఒక ప్రణాళికను రూపొందించటం జరిగిందన్నారు. దీనిలో భాగంగా షెడ్యూల్డు కులాలు / షెడ్యూల్డు తెగలకు చెందిన బీడు భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చటానికి వివిధ పనులను మంజూరు చేయటం, మెట్ట భూములలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించటం వంటివి చేవడతామన్నారు. 2014 నాటికి వందకోట్ల మొక్కలను నాటించనున్నట్లు ఆయన తెలియచేసారు. ఉపాధి హామీ పథకం క్రింద శ్రామికులకు చెల్లింపులు సక్రమంగా జరిగేలా, పథక నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీ తనం పెంపొందించేందుకు వీలుగా మొబైల్ ఫోన్ టెక్నాలజీ వినియోగాన్ని అతికొద్ది కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తీసుకొని రావటం జరుగుతుందన్నారు. ◆

---

## రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రిగా

## శ్రీ కె. జానారెడ్డి



రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖా మంత్రిగా శ్రీ కుందూరు జానారెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 20-6-1946న జన్మించిన శ్రీ జానారెడ్డి ప్రస్తుతం నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్ అసెంబ్లీ నియోజక వర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1983లో నల్గొండ జిల్లా చలకుర్తి నుండి శాసన సభ్యునిగా తొలిసారి ఎన్నికైన జానా రెడ్డి తదుపరి 1985, 1989, 1999, 2004లలో వరుసగా చలకుర్తి నుండే శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. సుమారు 3 దశాబ్దాల రాజకీయ అనుభవం గల శ్రీ జానారెడ్డి గతంలో రాష్ట్ర మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా, రాష్ట్ర హోంశాఖా మంత్రిగా పనిచేసారు. గతంలో పంచాయితీ రాజ్ శాఖకూ, గ్రామీణ నీటి సరఫరా శాఖకూ వేరువేరుగా మంత్రులున్నప్పటికీ, శ్రీ జానారెడ్డి గారి అనుభవం దృష్ట్యా, రెండు శాఖలూ వీరికే కేటాయించారు. ◆



SthanikaPalanaTel_January_2010_COLOUR.p10d 12/30/2010, 1:06 PM



# అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలి

## - శ్రీమతి పూనం మాలకొండయ్య

**పంచాయతీరాజ్ శాఖ ద్వారా అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రములు ప్రగతిని వేగవంతం చేయటానికి పంచాయితీరాజ్ గ్రామీణ ఉపాధి కమీషనర్ శ్రీమతి పూనం మాలకొండయ్య తరచుగా క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తు సిబ్బందిలో నూతనోత్తేజాలు తీసుకొనివస్తున్నారు.**

ఇటీవల కాలంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారులు, జిల్లా పంచాయితీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశలలో పంచాయితీరాజ్ శాఖ ద్వారా అమలవుతున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమం (BRGF), 13వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, రాజీవ్‌గాంధీ భారత నిర్మాణ సేవా కార్యక్రమం క్రింద పంచాయితీ భవనాల నిర్మాణం, జిల్లా ప్రణాళికా కమిటీల ద్వారా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, తదితర కార్యక్రమాల ప్రగతిని జిల్లాల వారిగా సమీక్షించారు. వివిధ జిల్లాలలో బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం అమలు చేయటం ద్వారా గ్రామాలలో వచ్చిన  మార్పులు, అందిన ఫలితాలను విశ్లేషిస్తూ విజయగాథలను రూపొందించి ఫొటోలతో సహా డాక్యుమెంట్ చేసి పంపవలసినదిగా పి.ఇ.ఓలకు, డి.పి.ఓలకు సూచించారు.

పంచాయతీరాజ్ సంస్థలలో ఆడిట్ అభ్యంతరాల పరిష్కారానికి సి.ఇ.ఓలు, డి.పి.ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ, పెండింగ్‌లో ఉన్న అభ్యంతరాలను పరిశీలించినట్లయితే పనుల బిల్లులలో నిలుపుదల చేసిన వ్యాట్, సేల్స్‌టాక్స్, సీనరేజి ఛార్జీలు, మొదలైన సంబంధిత శాఖలకు జమ చేయకపోవటం, చెల్లించాల్సిన మొత్తాలకన్నా ఎక్కువ సొమ్ము చెల్లించటం, ఆడిట్‌కు రికార్డులు సమర్పించకపోవటం, పథకాల నిధులపై వచ్చే వడ్డీలను పథకానికి చెందిన అక్కౌంట్లలో జమచేసి చూపకపోవటం వంటివి అధికంగా ఉంటున్నాయని కమీషనరు అన్నారు. ఈ విధమైన ఆడిట్ అభ్యంతరాలను త్వరితగతిన పరిష్కరించాలని కమీషనర్ సి.ఇ.ఓలను, డి.పి.ఓలకు సూచించారు.

13 వ ఆర్థిక సంఘం నిధులను పారిశుద్ధ్యం త్రాగునీటి రంగాలలో  నిబంధనల ప్రకారం వ్యయంచేసి మానవ అభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయితీ భవనాల నిర్మాణానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకొని త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

పంచాయితీ సెక్రటరీలు, పంచాయితీ సెక్రటరీ గ్రామ సందర్శన వివరాలతో కూడిన క్యాలండర్లను ప్రతివారం పంచాయితీ కార్యాలయాల్లో నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్నారు. పారిశుద్ధ్యం, త్రాగునీరు, ఇతర తప్పనిసరి విధులను సెక్రటరీలు విధిగా నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.




పంచాయతీరాజ్ వ్యవస్థలలో పరిపాలనా పరమైన అంశాలు చట్టబద్ధంగా నిర్వహించాల్సి వస్తుందని, సి.ఇ.ఓలు, డి.పి.ఓలు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పంచాయితీ రాజ్ చట్టంతో పాటు, అనేక ఇతర చట్టాలపై అవగాహన కల్గిఉండటం ఎంతో అవసరమని అన్నారు. ఈ -పంచాయితీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువ చేయాలని ఈ-పంచాయితీ పోర్టల్‌లోకి పంచాయితీకి సంబంధించిన సమాచారాన్ని సత్వరమే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. పంచాయితీరాజ్ సంస్థల ఆర్థిక వ్యవహాలలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించటానికి ప్రియుసాఫ్ట్ ఎంతో సహాయకారి కాగలదని, అపార్డు ద్వారా శిక్షణ పొంది అన్ని జిల్లాలలో ఈ సాఫ్ట్‌వేర్ వినియోగంలోకి తీసుకుని రావాలన్నారు. ☆




Sthanka_Jan.colo.indd 26 30/12/10 2:43 PM



వార్తల్లో 'అపార్డ్'

# ఉద్యోగుల్లా కాక పథక భాగస్వాముల్లా పనిచేయాలి

"గ్రామీణ ప్రజలకు జీవనోపాధి భద్రత కలుగచేయటానికి ప్రభుత్వం అమలు చేస్తున్న అద్భుతమైన కార్యక్రమం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమని, పథక నిర్వహణలో కేవలం ఉద్యోగస్థుల వలె కాక పథకంలో భాగస్వాముల వలె పని చేయాలని క్రొత్తగా ఎంపికైన సాంకేతిక సహాయకులకు అపార్డు కమీషనర్ శ్రీ చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. ఉద్భోదించారు. 4-12-2010 నుండి 10-12-2010 వరకు అపార్డులో జరిగిన సాంకేతిక సహాయకుల శిక్షణా కార్యక్రమమం ప్రారంభ సమావేశంలో పాల్గొన్న అపార్డు కమీషనరు మాట్లాడుతూ భారత దేశంలో ఆర్థికాభివృద్ధి రంగం గణనీయమైన రీతిలో మెరుగుపడినప్పటికీ, మానవ అభివృద్ధి రంగంలో వెనుకబాటు తనం ఇప్పటికీ అలాగే ఉన్నదని అన్నారు. దేశంలో శిశుమరణాలు ప్రతీ వెయ్యికి 53, మాతృ మరణాలు ప్రతీ లక్షకు 328 చొప్పున సంభవిస్తున్నాయని, అంతర్జాతీయంగా ఇది దేశానికి తలవంపులు తెచ్చే విషయమని అన్నారు.



విద్య, వైద్య, ఆరోగ్యం, త్రాగునీరు, గృహవసతి తదితర సామాజిక రంగాలలో గ్రామీణ ప్రజలు నేటికీ వెనుకబడి ఉండటం బాధాకరమన్నారు. సమాజంలో నెలకొని ఉన్న ఆర్థిక అసమానతల వల్ల ధనిక - పేద ప్రజల మధ్య తారతమ్యం రాను రాను పెరుగుతోందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల తీసుకొని రావటానికి దోహదకారిగా ఈ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయటం జరుగుతోందని, పథకం వల్ల జీవనోపాధుల కోసం గ్రామాల నుండి పట్టణాలకు వలసలను తగ్గించటానికి వీలవుతుందని ఆయిన అన్నారు. మహిళలలో పోషకాహార స్థాయి పెరుగుతోందన్నారు. ఈ పథకం వల్ల ఆకలి చావుల నివారణ దిశగా ఎంతో ప్రగతిని సాధించామని అన్నారు. పథక నిర్వహణలో క్షేత్ర స్థాయిలో సాంకేతిక సహాయకుల పాత్ర చాలా ప్రాధాన్యత కలిగనదని చెప్తూ, చిత్త శుద్ధితో, నిష్కళంక సేవలను అందచేయవలసిన బాధ్యత క్షేత్ర సహాయకులపై ఉన్నదని ఆయన అన్నారు. కేవలం పథకం అమలు చేసే యంత్రాంగం లా కాకుండా పథక నిర్వహణలో మేముకూడా భాగస్వాముల మని భావించాలని, ఖర్చు చేసే ప్రతీ పైసా సద్వినియోగమయ్యేలా, లబ్ది దారులకు చేరేలా శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పేద ప్రజలకు సేవ చేయాలన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ప్రతీ రోజూ ఒక్కో జిల్లాలో రోజుకు కోటి రూపాయల మేర ఖర్చు అవుతోందని, ఈ నిధులు తమ స్థాయిలో సక్రమంగా ఖర్చు అయ్యేలా చూడవలసిన బాధ్యత సాంకేతిక సహాయకులపైన కూడా ఉన్నదని, పనుల కొలతలు ఖచ్చితంగా తీసుకోవాలని అన్నారు. శిక్షణా కార్యక్రమం ద్వారా అందచేసే విషయపరిజ్ఞానాన్ని వినియోగించుకొని బాధ్యతలను ప్రశంసనీయమైన స్థాయిలో నిర్వర్తించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో సి.ఎన్. ఆర్. ఎం. సెంటర్ హెడ్ శ్రీ హెచ్. కూర్మారావు, ఫ్యాకల్టీ సభ్యుడు రమేష్, ఎస్.ఆర్.పి.లు, 12 జిల్లా నుండి క్రొత్తగా ఎంపికైన టెక్నికల్ అసిస్టెంట్లు 176 మంది పాల్గొన్నారు. ◆



SthanikaPalanaTel_January_2010_COLOUR.p6d 12/30/2010, 1:05 PM

**వార్తల్లో 'అపార్డ్'**

# అపార్డ్ వ్యూహాలు అనుసరణీయం

**అపార్డును మళ్ళీ మళ్ళీ సందర్శిస్తాం. – ఐఐఎమ్ ప్రొ. సమర్ కె దత్తా**

ప్రజా ప్రతినిధులకు శిక్షణ అందచేయటానికి అపార్డు అనుసరిస్తున్న వ్యూహాలు ప్రశంసనీయమని, దేశంలోని పలు శిక్షణా సంస్థలకు అపార్డు మార్గదర్శిగా ఉన్నదని ఐ.ఐ.ఎమ్. అహ్మదాబాద్ ప్రొఫెసర్ సమర్ దత్తా అన్నారు. ది : 10/12/2010న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రీమతి నీటా కేజ్రీవాల్ మరియు ఇతర సభ్యులతో అపార్డును సందర్శించిన ప్రొ. సమర్ దత్తా అపార్డు ఫ్యాకల్టీ సభ్యులతో చర్చిస్తూ, ప్రజా ప్రతినిధుల సామర్థ్యాలను పెంపొందించటంలో అపార్డు చేస్తున్న కృషి అమోఘమనీ, అపార్డును మళ్ళీ మళ్ళీ సందర్శించాలని ఉన్నదని అన్నారు.





మారుతున్న అవసరాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి రంగంలో వివిధ భాగస్వామ్యుల సామర్థ్యాలను పెంపొందించటంలో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు పోషించవలసిన పాత్రలను గూర్చి అధ్యయనం చేయటానికి ఏర్పాటు చేసిన బృందం ఎన్.ఐ.ఆర్.డి.లో జరిపిన చర్చలలో అపార్డులో జరుగుతున్న వినూత్న కార్యక్రమాలపై అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి వివరించారని, ఈ కార్యక్రమాల గూర్చి వ్యక్తిగతంగా తెలుసుకోవాలన్న కుతూహలంతో అపార్డును సందర్శించటం జరిగిందని ప్రొ. సమర్ దత్తా అన్నారు. అపార్డులో ఉన్న శిక్షణ వసతులను సందర్శించి సంతృప్తి వ్యక్తపరిచారు. గ్రామీణాభివృద్ధి రంగంలో పలు పంచాయితీలు, పలువురు వ్యక్తులు విశేషమైన కృషి జరుపుతున్నప్పటికీ, ఈ సమాచారం విస్తృతంగా ప్రచారానికి నోచుకోవటం ఆయన లేదని ఆయన అన్నారు.

మేనేజ్‌మెంట్ కోర్సులలో చదువులు పూర్తి చేసుకొన్న వారు గ్రామీణాభివృద్ధి రంగంలో పని చేయటానికి ఆసక్తి చూపాలని అన్నారు. ఈ సందర్భంగా అపార్డు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను కమీషనరు శ్రీ చంద్రమౌళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ శ్రీ ఆర్.కె. సింగ్, కేరళ, మహారాష్ట్ర యస్.ఐ.ఆర్.డి.ల ఫ్యాకల్టీ సభ్యులు, అపార్డు జాయింట్ డైరెక్టరు, శ్రీ గంగాధరం, డిప్యూటీ డైరెక్టర్లు శ్రీ కృష్ణ, డా.కృష్ణ మోహన్ రావు, శ్రీ కుమార రాజా మరియు ఇతర సెంటర్ హెడ్‌లు పాల్గొన్నారు. ◆

## కొండేపూడి నిర్మలకు లాడ్లీ మీడియా జాతీయ అవార్డు



అపార్డ్‌లోని సి.డబ్ల్యు.ఎన్. సెంటర్‌లో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న కొండేపూడి నిర్మల రాసిన "మృదంగం" కాలమ్స్‌కి ఈ ఏడాది లాడ్లీ మీడియా జాతీయ అవార్డు వచ్చింది. యు.ఎన్.ఎఫ్.పి.ఎ, పాపులేషన్ ఫస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ లాడ్లీ మీడియా అవార్డు తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ, హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో జెండరు దృక్పథంతో రచనలు చేసిన వారికి ఇస్తుంది. ప్రచురణ, ప్రసార. వైబ్సైట్ మాధ్యమాలు పోటీ పరిధిలోకి వస్తాయి. స్త్రీవాద దృక్పథంతో నిర్మల రాస్తున్న "మృదంగం" కాలమ్ ఉత్తమ ఎంట్రీగా ఎంపికయ్యింది. రాజకీయ, సామాజిక రంగాల్లో వున్న స్త్రీల పట్ల వున్న వివక్షను ఎండగడుతూ నిర్మల రాస్తున్న సెటైర్స్ భూమిక పత్రికలో ధారావాహికంగా వస్తున్నాయి. ◆



SthanikaPalanaTel_January_2010_COLOUR.pmd 12/30/2010, 1:06 PM

వార్తల్లో 'అపార్డ్'

## జాతి నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేయాలి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా, పారదర్శకంగా, నిజాయితీగా, బాధ్యతాయుతంగా అమలు జరిగేలా సమాజాన్ని చైతన్య పరచటంలో జాతీయ సేవా పథకం (ఎన్.యస్.యస్.) జిల్లా ప్రోగ్రామ్ యువతను ప్రోత్సహించాలని అపార్డు కమీషనరు శ్రీ కె.చంద్రమౌళి, ఐ.ఏ.యస్. అన్నారు. ఉపాధి హామీ పథకంలో సమాచార హక్కు వినియోగంపై రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ( శ్రీ పెరుంబుదూర్, తమిళనాడు), అపార్డ్‌లు కలసి 21.12.2010 నుండి 23.12.2010 వరకూ ఎన్.యస్. యస్ జిల్లా ప్రోగ్రాం అధికారులకు శిక్షణను నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అపార్డు కమీషనరు శ్రీ చంద్రమౌళి మాట్లాడుతూ, దేశ యువజనులలో నైతిక విలువలు పెంపొందించి దేశాన్ని మరింత ముందుకు నడిపించాలని అన్నారు. జాతి నిర్మాణంలో యువత భాగస్వామ్యం కీలకమని, విద్యార్థి దశ నుండే సామాజిక చింతన వారిలో కలుగ చేయాలని అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎన్.యస్.యస్. ప్రోగ్రాం ఆఫీసర్లకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై పూర్తి స్థాయి అవగాహన కలిగించటంతో పాటు, సమాచార హక్కు చట్టం, సోషల్ ఆడిట్ విధానం, జి.ఐ.ఎస్./జి.పి.ఎస్. సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, తదితర అంశాలపై శిక్షణను అందచేశారు.

ఈ కార్యక్రమాన్ని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఫ్యాకల్టీ హెడ్ శ్రీ సాహు, అపార్డ్ సి.ఎన్.ఆర్.ఎం. సెంటర్ హెడ్ శ్రీ కూర్మారావులు సమన్వయపరిచారు. డా. శ్రీనివాసరావు, శ్రీమతి పద్మజ, డేవిడ్ పాల్, ప్రొ. సూర్యనారాయణరెడ్డి తదితరులు తరగతులు నిర్వహించారు. ◆




## భావితరం నాయకులకు పంచాయితీ రాజ్ ప్రజా ప్రతినిధులు దిక్సూచిలా ఉండాలి

భావితరం నాయకులకు పంచాయితీ రాజ్ ప్రజా ప్రతినిధులు దిక్సూచిలా ఉండాలి అని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి అన్నారు. డిసెంబర్ 20 నుండి 21 తేదీ వరకు అపార్డులో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మండల పరిషత్ అధ్యక్షుల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన అపార్డు కమీషనరు ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల పరిషత్ అధ్యక్షులు గత $4^{1/2}$ సం॥లలో గడించిన అనుభవాన్ని సహచరులతో పంచుకొనేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుత పదవీకాలం కొద్ది నెలలే ఉన్నప్పటికీ, సమయం ఎంతో విలువైనదనీ, చేతిలో ఉన్న సమయాన్ని ప్రజా సంక్షేమం కోసం వినియోగించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించి, మంచి నాయకునిగా పేరు తెచ్చుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో రిసోర్సు పర్సనుగా వచ్చిన యూనిసెఫ్ ప్రతినిధి సలాత్తియేల్ నల్లి మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులలో అభివృద్ధి అంటే కేవలం రహదార్లు, భవనాలు నిర్మించటమే అన్న అపోహ నెలకొని ఉన్నదని, కానీ అభివృద్ధి నిధులను త్రాగు నీరు, పారిశుధ్యం రంగాలలో కూడా వినియోగించాలని, మారుమూల గ్రామాలు, గిరిజన తండాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఇదే కార్యక్రమంలో రిసోర్సుపర్సనుగా పాల్గొన్న మాజీ రాజ్య సభ సభ్యుడు శ్రీ సోలిపేట రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ పంచాయితీ రాజ్ వ్యవస్థను మరింత పరిపుష్టి చేయటానికి వీరప్ప మొయిలీ అధ్యక్షతన గల 2వ పరిపాలనా సంస్కరణల సంఘం పలు సిఫారసులను చేసిందని, కేంద్ర ప్రభుత్వం కూడా ఈ సిఫారసులను చాలా వరకూ ఆమోదించినదని అన్నారు. మరొక రిసోర్సుపర్సన్ డా. ప్రవీణ్ కుమార్, ఐ.పి.ఎస్. మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ప్రజా ప్రతినిధులు ఆత్మ న్యూనతా భావాన్ని అధిగమించి మంచి నాయకులుగా పరిణతి సాధించాలని అన్నారు. యస్.సి./యస్.టి. అత్యాచార నిరోధక చట్టం గూర్చి డా. ప్రవీణ్ కుమార్ వివరించారు. స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్ గూర్చి శ్రీ లక్ష్మయ్య, డైరెక్టర్ సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ వివరించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ సెబాస్టియిన్ రాజు పర్యవేక్షణలో కోర్సు డైరెక్టరు శ్రీమతి సుమమాలిని, రిసోర్సుపర్సన్ గాంధీ నిర్వహించారు. ◆





SthanikaPalanaTel_January_2010_COLOUR.p65.indd 12/30/2010, 1:06 PM

# నాణ్యమైన వ్యక్తిగత జీవనానికి ఆడపిల్లల సాధికారత

**మొత్తం జనాభా వర్గాలలో, నిస్సహాయ స్థితిలో ఉన్నటువంటి స్త్రీలు, కిశోర బాలికలకు నాణ్యమైన జీవనాన్ని అందించడానికి శిక్షణ చాలా అవసరం. ఎందుకంటే వీరు పరిపూర్ణత లోపించిన శరీరధారుడ్య స్థితిని, ఆరోగ్యస్థితిని కలిగి, అల్పమైన వనరులతో తమ శక్తి సామర్థ్యాలకు మించిన పనులలో అధిక సమయాన్ని కేటాయిస్తున్నారు. అంతేకాక చాలామంది కిశోర బాలికలు బాల్యవివాహాలు, చిన్నవయసులో గర్భధారణ వలన వారి బాల్యజీవితాన్ని కోల్పోయి బాధ్యతాయుతమైన జీవితంలోకి బలవంతంగా ప్రవేశింపబడుతున్నారు. దీనివలన వీరి శారీరక పెరుగుదల, అభివృద్ధి సామర్థ్యతకు ఆటంకం కలిగించి, స్వీయాభివృద్ధి, సామర్థ్యాభివృద్ధి, సాధికారకతను ప్రేరేపించే విద్య, ఇతర అర్హతలను పొందకుండా నివారిస్తుంది.**

కావున క్రొత్త ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నప్పటికీ, వీరిలో విద్యావిహీనత, అవిశ్వాసం, ఆత్మస్థైర్యం లోపించడం వలన వీరు వీటిని ఉపయోగించుకోలేకపోతున్నారు. అందువల్ల ఆధునిక, సాంకేతిక పద్ధతులను, క్రొత్త పరిశోధనలను, నైపుణ్యాలను పొందడానికి వీరిలో అభివృద్ధి పరమైన మార్పును, సరైన దృక్పథాన్ని, ఆలోచనా రీతిని కల్పించడానికి, నైపుణ్యతను పెంచే శిక్షణా కార్యక్రమాలతో పాటు, వీరిలో పరిపూర్ణ మూర్తిత్వ వికాసాన్ని పెంచే కార్యక్రమాలను కూడా నిర్వహించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

దేశం అభివృద్ధి మైలురాళ్ళ పురోగమనానికి, మొత్తం జనాభాలో ఎక్కువ శాతంలో ఉన్న ఈ వర్గానికి అనగా కిశోర బాలికలు, స్త్రీల జీవితంలో సామాజిక, ఆర్థిక, రాజకీయపరమైన మార్పులు తీసుకు రావడం ఎంతో అవసరం. కిశోర బాలికల సాధికారతకు - బాలికల విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వాతంత్ర్యత, నిర్ణయాధికారం, భావ వ్యక్తీకరణ, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం మొదలైన ముఖ్యమైన సాంఘిక చిహ్నాలు.

పైన పేర్కొనబడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అఖిల భారత సమన్వయ పరిశోధనా పథకం, గృహ విజ్ఞానం- శిశుసంవర్ధనా విభాగ పరిశోధనా సిబ్బంది 'కిశోరబాలికల నాణ్యమైన వ్యక్తిగత జీవనానికి సాధికారత' అనే అంశంపై పరిశోధనను నిర్వహించడం జరిగింది. ఈ ప్రాజెక్ట్‌లో తీసుకున్న ముఖ్యమైన అంశాలు - సాధారణ పరిజ్ఞానం, అవగాహనకు సంబంధించిన విషయాలు, మూర్తిత్వ లక్షణాలను పెంపొందించే కార్యక్రమాలు.

*ఈ ప్రాజెక్ట్ మూడు దశలలో జరిగింది*

**మొదటి దశ :** ఈ దశలో శంకర్‌పల్లి మండలంలోని 5 గ్రామాలను (ఎర్వగుడా, దోబీపేట్, లక్ష్మారెడ్డిగూడా, బండ్లగూడా, ఫతేపూర్) దత్తత తీసుకోవడం జరిగింది. గ్రామానికి 15 కిశోర బాలికల చొప్పున మొత్తం 75 మందిని ఎన్నుకోవడం జరిగింది. ఎన్నుకోబడినవారు స్కూలు మానివేసినవారు లేక 10వ తరగతి పూర్తి చేసినవారు.

గ్రామీణ బాలికల సాధారణ పరిజ్ఞానం, అవగాహనకు సంబంధించిన విషయాలు, మూర్తిత్వ లక్షణాలను పరీక్షించడం జరిగింది. ఈ అంశాలలో చాలామంది గ్రామీణ బాలికలకు చాలా తక్కువ పరిజ్ఞానం, మూర్తిత్వ లక్షణాలు లోపించాయని గమనించడం జరిగింది.

**రెండవ దశ :** మొదటి దశలోని ఫలితాలాధారంగా గ్రామీణ బాలికలలో సాధారణ పరిజ్ఞానం, అవగాహనకు సంబంధించిన విషయాలు, మూరిత్వ లక్షణాలను మెరుగుపరచటానికి తగిన కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

*సాధారణ పరిజ్ఞానం, అవగాహనకు సంబంధించిన విషయాలు:*

❁ సాధారణ విషయ పరిజ్ఞానం ❁ సంఖ్యా పరిజ్ఞానం ❁ పోషణ, ఆరోగ్యం ❁ పునరుత్పత్తి, పిల్లల ఆరోగ్యం ❁ పిల్లల పెంపక విధానాలు ❁ ఆర్థిక విషయాలు ❁ న్యాయసంబంధ విషయాలు ❁ ఆరోగ్య సమస్యల గురించి పరిజ్ఞానం

*మూర్తిత్వ లక్షణాలు*

❁ ఆత్మగౌరవానికి సంబంధించిన నైపుణ్యాలు ❁ భావప్రకటన, సాంఘిక నైపుణ్యాలు ❁ వ్యక్తిగత, పరస్పర సంబంధాలు ❁ నిర్ణయాధికార నైపుణ్యాలు

పైన పేర్కొనబడిన అంశాలను (సాధారణ పరిజ్ఞానం, అవగాహనకు సంబంధించిన విషయాలు, మూరిత్వ లక్షణాలను) వివిధ కార్యక్రమాలు, అనగా సామూహిక చర్చలు, ప్రత్యేక శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, పాత్రాభినయం, నిపుణులతో చర్చలు, ప్రదర్శనల ద్వారా నిర్వహించడం జరిగింది.

పరిశోధన ఫలితాలాధారంగా తెలుసుకొన్న విషయమేమంటే కిశోర బాలికలలో సరైన దృక్పథాన్ని అందిస్తూ, ఆలోచనారీతిలో, జీవన విధానంలో మార్పులు తీసుకొని రావడానికి విద్యాపరమైన పరిజ్ఞానాన్ని, మూర్తిత్వ వికాసాన్ని పెంపొందించే సాధికారత కార్యక్రమాలను రూపొందించవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

నాణ్యమైన జీవనానికి సంబంధించిన శాస్త్రీయ, ఆధునిక పరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పద్ధతులను, సామర్థ్యం నైపుణ్యాలను అవలంబించడానికి, నేర్చుకోవడానికి అనువుగా చేపట్టవలసి ఉంది.

*- డా॥ నస్రీన్ బాను (సీనియర్ శాస్త్రవేత్త),*
*- శ్రీమతి. కె.ఉషారాణి (రిసర్చ్ అసోసియేట్)*
*అఖిల భారత సమన్వయ పరిశోధనా పథకం,*
*గృహ విజ్ఞానం (శిశు సంవర్ధనా విభాగం)*



Sthanka_Jan.colo.indd 32 30/12/10 2:43 PM

# ఉపాధి హామీ పనులకు జి.పి.ఎస్. కో - ఆర్డినేట్లు తప్పనిసరి

**జా**తీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలును మరింత పారదర్శకంగా అమలు చెయ్యటానికి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, వినియోగించుకోవటానికి గ్రామీణాభివృద్ధి శాఖ పలు ఏర్పాట్లు చేసింది. జి.ఐ.ఎస్. ( భౌగోళిక సమాచార వ్యవస్థ), జి.పి.ఎస్. (భౌగోళిక ప్రాదేశిక సమాచార వ్యవస్థ)ల సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టే పనుల సమాచారాన్ని పూర్తిగా ఆన్‌లైన్‌లో ఏ విధంగా అందుబాటులో ఉంచాలన్న విషయంపై మార్గదర్శకాలను జారీ చేసింది. పనుల వివరాలను జి.ఐ.ఎస్. / జి.పి.ఎస్‌లతో అనుసంధానించటం వల్ల పనిజరిగే ప్రదేశాన్ని పనులు మంజూరు, అమలు జరిగే సమయంలో, సోషల్ ఆడిట్ జరిగే సమయంలోను ఎప్పటికప్పుడు పర్యవేక్షించటానికి, ప్రగతిని తనిఖీ చేయటానికి సులభంగా వీలవుతుంది.

జి.పి.యస్. ఉపయోగించి పనుల వివరాలు నమోదు చేయటానికి ప్రభుత్వం జారీ చేసిన మార్గనిర్దేశకాలు ఇవే :

1. ఎన్.ఆర్.ఇ.జి.యస్.తో చేపట్టే ప్రతీ పనికీ జి.పి.ఎస్. కో-ఆర్డినేట్లు అంటే పని జరిగే ప్రదేశానికి సంబంధించిన అక్షాంశ, రేఖాంశాల వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలి. అక్షాంశాలు, రేఖాంశాలు తీసుకొనే నమోదు చేసే సమయంలో పాటించాల్సిన పద్ధతులు

| వ.సం. | పని రకం | పాటించవలసిన పద్ధతి |
|---|---|---|
| 1. | భూమి ఆధారిత పనులు | పని జరిగే ప్రదేశపు మధ్య భాగం |
| 2. | కాలువలు | కాలువ మధ్య భాగంలో కాలువ పొడవును అనుసరిస్తూ |
| 3. | ఇతర పనులు | నిర్మాణం మధ్య భాగం |
| 4. | రహదారి పనులు | రహదారి పొడవును అనుసరిస్తూ రహదారి మధ్య భాగం |

2) ఒక రైతుకు సంబంధించిన భూమి అభివృద్ధి పనులకు సంబంధించి ఒక సెట్ జి.పి.ఎస్. కో-ఆర్డినేట్‌లు తీసుకుంటే సరిపోతుంది.

3) అక్షాంశాలు, రేఖాంశాలను నమోదు చేసేటప్పుడు. ఉత్తర - దక్షిణ, తూర్పు - పరమర, కోఆర్డినేట్లు నమోదు చెయ్యాలి.

4) పనులకు సాంకేతిక మంజూరు అనుమతి చేసే ముందు ప్రతీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ పని జరిగే ప్రదేశాన్ని తప్పనిసరిగా సందర్శించి సాంకేతికంగా పనిని చేపట్టటానికి వీలువుతుందీ లేనిదీ అదే విధంగా ప్రతిపాదించిన పనికి అయ్యే ఖర్చు సమంజసమేనా కాదా అన్న విషయాలు పరిశీలించాలి. పనికి సంబంధించిన జి.పి.యస్. కో-ఆర్డినేటర్లను తప్పని సరిగా నమోదు చేయాలి.

5) ఇంజనీరింగ్ కన్సల్టెంట్ తన మొబైల్ ద్వారా ప్రతీ పనికి సంబంధించిన జి.పి.ఎస్. కో-ఆర్డినేట్లను నమోదు చేసి, సంబంధిత పనులకు చెందిన ఎస్టిమేట్లపై సాంకేతిక అనుమతి మంజూరు ఇచ్చే సమయంలో ఆ వివరాలను తప్పనిసరిగా నమోదు చెయ్యాలి.

6) ఒక వేళ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సాంకేతిక మంజూరు ఇచ్చే వ్యక్తి వేరు వేరు అయినచో ఇంజనీరింగ్ కన్సల్టెంటే, జి.పి.ఎస్. కో-ఆర్డినేట్లను తన మొబైల్ ద్వారా నమోదు చేసి, సంబంధిత పనులకు చెందిన ఎస్టిమేట్లలో తప్పనిసరిగా నమోదు చేసే బాధ్యతను నిర్వర్తించాలి.

7) ఒక వేళ ఏదేని మండలంలో ఇంజనీరింగ్ కన్సల్టెంట్ పదవి ఖాళీగా ఉన్నట్లయితే, సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్ జి.పి.ఎస్. కో-ఆర్డినేట్లను నమోదు చెయ్యాలి.

8) ఒక వేళ ఏదేని ప్రదేశంలో మొబైల్ కనెక్టివిటీ లేకపోయిపోయినట్లైతే ఈ విషయాన్ని సంబంధిత ఎస్టిమేట్లలో నమోదు చెయ్యాలి.

9) జి.పి.ఎస్. కో-ఆర్డినేట్లను నమోదు చెయ్యకపోతే ఏ విధమైన చెల్లింపులు చేయరాదు.

10) ఒక వేళ ఏదైనా పనికి ఇప్పటికే సాంకేతిక అనుమతులు ఇవ్వబడినట్లయితే, ఆ పనులకు కూడా జి.పి.ఎస్. కో- ఆర్డినేట్లు సేకరించి నమోదు చెయ్యాలి. ఈ జి.పి.ఎస్. కో-ఆర్డినేట్లు - బెంచ్ మార్క్ కో-ఆర్డినేట్లతో సరిపోల్చాలి.

11) చెక్ మెజర్ చేసే ఇంజనీరింగ్ కన్సల్టెంట్, పని ప్రదేశానికి వెళ్ళి గతంలో నమోదు చేయబడిన జి.పి.ఎస్. కో-ఆర్డినేట్ల ఆధారంగా పనులను చెక్ మెజర్ చెయ్యాలి.

ప్రతీ పనికి జి.పి.ఎస్. కో-ఆర్డినేట్లు తీసుకోవటం వల్ల పనుల పర్యవేక్షణ సులభం అవటంతో పాటు పనులలో డూప్లికేషన్‌ను నివారించవచ్చు. తద్వారా పథక అమలులో పారదర్శకతను జవాబుదారీ తనంను పెంపొందించవచ్చు.

ఆధారం : కమీషనర్, గ్రామీణాభివృద్ధి వారి సర్కులర్ సంఖ్య 1192/ఇ.జి.ఎస్./పి.ఎం(టి)/2010 తేది : 27.11.2010. •



SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p9nd 12/30/2010, 4:09 PM

# దేశ భాషలందు తెలుగు లెస్స




**ఇ**ద్దరు తెల్గు వాండ్రు తమ యింటివి కష్టసుఖాలు చెప్పుకో
నద్దో మాతృభాష తగదా మరి యింకొక పెద్ద రోగమే
కద్దు వచింతు నాంగ్లము మొగంబు నెరుంగని శ్రోతమముందు
దుర్బుద్ధులు కూయుచుండ్రు పలు పోకల నెంగిలి పీసు కూతలన్

ఇద్దరు తెలుగువాళ్ళు కలిస్తే ఆంగ్లంలో మాట్లాడే దౌర్భాగ్యం ఈ నాటిది కాదనడానికి తుమ్మల సీతారామమూర్తి గారి పైపద్యమే ఉదాహరణ.

దేశభక్తి, భాషాభిమానం అనేవి స్వతః సిద్ధంగా రావాలి. ఒకవేళ అలారాకపోతే పట్టుబట్టి తెచ్చుకోవాలి. మన భాష అన్యభాషల ప్రభావంలో పడి క్షీణదశలో ఉన్నప్పుడు అందరూ కలిసికట్టుగా భాషా వైభవగీతాల్ని ఎలుగెత్తి పాడుతూ భాషాభిమానాన్ని ప్రజలలో కలిగించాలి. ఒక కన్నడ దేశాన్ని పాలిస్తూ మాతృభాష 'తుళు' అయిన రాజు, తమిళదేశ కథను వర్ణిస్తూ 'దేశభాషలందు తెలుగులెస్స' అని చెప్పాడు. ఇది మన భాష గొప్పదనానికి చిహ్నం. పుష్కలమైన పదసంపద. ఉన్నతమైన భావాలు కల సాహిత్యం; ఏ భాషనైనా తనలో ఇముడ్చుకోగల సౌలభ్యం, ఎంతటి పదాన్నైనా చక్కగా పలుకగలిగే వీలు.. మన తెలుగు 'లెస్స'దనాన్ని తెలుపుతున్నాయి.

భావ వ్యక్తీకరణలోగానీ, ఉచ్చారణ సౌలభ్యంలో కానీ ప్రపంచంలోని ఏ భాషకూ తెలుగు భాష తీసిపోదు. సామాన్య భాషగా, విద్యాభాషగా, వ్యావహారికభాషగా, అత్యంత శక్తిమంతమయిన వ్యక్తీకరణ సామర్థ్యం కల తెలుగు భాష శాస్త్ర సాంకేతిక రంగాలకూ ఉపయుక్తమైన భాష. తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అన్నా, రాయలవారు 'కలకండి' అన్నా తెలుగుభాష మాధుర్యభరితమైనదనే భావనే.

పలుకుబడుల పోహళింపులు, నుడికారాల సొబగులు, సామెతల సయ్యాటలు తెలుగుభాషకి కండపట్టిస్తున్నాయి. 'ఆంధ్రత్వమాంధ్ర భాషాచ నాల్పస్య తపసః ఫలమ్'. ఆంధ్రులుగా పుట్టడం ఆంధ్ర భాష మాట్లాడటం పూర్వజన్మల సుకృతమన్నాడు తమిళానికి చెందిన అప్పయ్య దీక్షితులు.

ఎన్నో విశిష్టతలున్న మన తెలుగుభాషపై నిర్లక్ష్యవైఖరిని విడనాడాలి. చక్కగా మాట్లాడటం, చక్కగా చదవటం, రాయటం అలవాటు చేసుకోవాలి. ఆధునిక భాషకు ఒక ప్రామాణిక వ్యాకరణం ఉండాలి. ఇది అన్ని మండలాలనూ సమన్వయ పర'చేదిగా' ఉండాలి. దీనిలో విశాల దృక్పథమూ ఉండాలి. జీవద్భాషకు వ్యాకరణం రచించటం కష్టం. అయినా చేతనైనంతలో ప్రామాణికతను సంతరింపజేయటమూ అవసరం.

చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని లక్ష్యంగా చేసుకొని 'నీతిచంద్రిక' వెలయించాడు. ఆ రచనా వైశిష్ట్యం చేత తెలుగు కావ్య భాషాధ్యయనం కొనసాగినంత కాలమూ బాలవ్యాకరణ పఠనం తప్పనిసరి అవుతుంది. అలాగే గిడుగువారి వ్యావహారిక వాదానికి కన్యాశుల్కం లక్ష్య గ్రంథం. బిడ్డ శరీరపోషణకు తల్లిపాలు ఎంత అవసరమో మాతృభాష అంతే అవసరం. శిశువు తొలిపాఠం అమ్మఒడిలోనే కాబట్టి పరభాషా వ్యామోహం విడనాడాలి. దేశభాష లందు తెలుగులెస్స.

***- డా॥ అద్దంకి శ్రీనివాస్***

## పచ్చదనం పెంపొందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదే

ఈ రోజుల్లో పట్టణాల్లోనే కాదు పల్లెల్లో కూడా ఇళ్ల దగ్గర చెట్లు పెంచడం లేదు. పచ్చదనం పరిశుభ్రత పెంచాల్సిన అవసరం ఎంతో వుంది. అది ప్రతి ప్రజా ప్రతినిధి బాధ్యత. ప్రతి ఇంటి దగ్గర 3 నుండి 4 చెట్లు పెంచాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి మీద వుంది. అలాగే ఆరోగ్యం కాపాడుకోవడానికి ఉపయోగపడే చెట్లు నాటితే చాలా మంచిది. ముఖ్యంగా మేము గమనించిన విషయం ఏమంటే, పల్లెల్లో 12/- లు పెట్టి ఏమీ పోషకాలు లేని కూల్‌డ్రింక్స్ ఎక్కువగా త్రాగుచున్నారు. కాని పోషక విలువలున్న పాలు, మజ్జిగ కాని, కొబ్బరి బోండాం కాని త్రాగడం లేదు. ఇది చాలా దారుణం.

ఈ విషయాన్ని గమనించి సర్పంచుగా నేను 125 ఇళ్ళకు 2 కొబ్బరి చెట్లు, ఒక సపోటా చెట్టు పంపిణీ చేయడం జరిగింది. ఈ రోజుల్లో పండ్లు కొని తినే పరిస్థితి లేదు. అలాగే కొబ్బరి బోండాం కొని త్రాగరు. ఈ రెండూ పెరట్లో వుంటే ఆరోగ్యం ఇంట్లో ఉన్నట్లే అనేది నా ఉద్దేశ్యం. ఆర్.డి.టి. వారి సహకారంతో కొబ్బరి చెట్టు 10/-లకు, సపోట చెట్టు రూ. 20/-లకు తక్కువ రేటుతో తీసుకొని ప్రజలకు ఇవ్వడం జరిగింది. రెండవ విడత కూడా ఇవ్వాలనుకుంటున్నాం. మాకు మొక్కలను తక్కువ రేటుతో ఇచ్చినందుకు ఆర్.టి.డి. వారికి కృతజ్ఞతలు. మా పంచాయితీలో బి.ఆర్.జి.ఎఫ్. నిధులతో అంగన్‌వాడీ బిల్డింగు నిర్మించుకున్నాము. అలాగే సి.సి. రోడ్డు కూడా వేయడం జరిగింది. ఐ.ఎస్.ఎల్. మరుగుదొడ్లు 159 మంజూరై, ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొన్న వారు : ఆర్.డి.టి. ఎ.టి.ఎల్. భాషా. అరవింద్ చౌదరి.

***ఎస్.వి.కె. చౌదరి,***

*సర్పంచి, దంపెట్ల, బత్తలపల్లి మండలం,*
*అనంతపురం 949.363065*



SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p6nd 12/30/2010, 4:09 PM

**గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ విధులు నిర్వర్తించేందుకు ఈ దిగువ అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.**

**1. కాలాలు- సీజనులు**

**2. భూముల వర్గీకరణ**

**3. భూములతో సంబంధం ఉండే వ్యక్తులు**

### 1. కాలాలు - సీజనులు

1) *ఫసలీ సంవత్సరం :* జూలై 1వ తేదీతో ప్రారంభమైన 12 నెలల కాలమునకు 'ఫసలీ' అంటారు (అనగా జూలై 1వ తేదీ నుండి మరుసటి సంవత్సరం జూన్ 30 తేదీ వరకు)

2) *ఫసలీ సంవత్సరానికి క్యాలెండరు :* ఫసలీ సంవత్సరానికి, క్యాలెండరు సంవత్సరానికి మధ్య వ్యత్యాసం అనగా ఫసలీ సంవత్సరానికి 590 సంవత్సరాలు కలిపిన ఎడల క్యాలెండరు సంవత్సరం వస్తుంది. ాదాహరణకు ప్రస్తుత 1418వ ఫసలీకి 590 సంవత్సరాలు కలిపినచో ప్రస్తుత సంవత్సరం అనగా 2008 వచ్చును.

# రెవెన్యూ అధికారులు గుర్తుంచుకోవలసిన ముఖ్యాంశాలు

3) *ఆర్థిక సంవత్సరం :* ఏప్రిల్ 1వ తేదీ నుండి మరుసటి సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు గల కాలం.

4) *ఖరీఫ్ సీజను (సార్వా) :* జూన్ 1వ తేదీ నుండి సెప్టెంబరు 30 వరకు

*5) రబీసీజను (దాళ్వా)* : అక్టోబర్ 1 నుండి - మార్చి 31 వరకు ఏప్రిల్, మే నెలలో విత్తినచో జూన్ మాసాంతరంలోగా కోస్తే రబీ పంటగా నమోదు చేయాలి. జూన్ మాసాంతానికి కోయబడినచో రాబోయే ఫసలీ ఖరీఫ్ పంటగా నమోదు చేయాలి.

*6) కిస్తీ సీజనులు :* అ) ఖరీఫ్ పంటకు డిశంబరు 1 తేదీ నుండి జనవరి 31వ తేదీ వరకు (రెండు నెలలు)

7) *ఖరీఫ్ పంటల నమోదు ఆక్రమణల సర్వేరాళ్ల తనిఖీ నమోదు :* జూలై 1 వ తేదీ నుండి ప్రారంభించాలి (అడంగలు / పహాణీలో నమోదు చేయాలి)

8) *రబీ పంటల నమోదు ఆక్రమణల నమోదు పోరంబోకులలో / గయాళు భూములలో చెట్ల తనిఖీ* : అక్టోబరు 1వ తేదీ నుండి ప్రారంభించాలి. (అడంగలు / పహాణీలో నమోదు) చెట్ల వివరాలు / ప్రభుత్వ భూముల వినియోగం 1వ నెంబరు లెక్కలో నమోదు చేయాలి.

9) *డిమాండ్ లెక్కలు 4ఎ,4బి,4సి :* 1) ఖరీఫ్ పంటకు నవంబరు నెలాఖరునకు సిద్ధపరచాలి. 2) రబీ పంటకు ఏప్రిల్ నెలాఖరునకు సిద్ధపరచాలి.

10) *అజమాయిషీ చేయవలసిన సమయం :* ప్రతినెల 20వ తేదీ నుండి 25 వరకు

### 2 భూములు వర్గీకరణ

1) *మాగాణి భూమి నంజ, తరి పల్లం :* ప్రభుత్వ నీటి వనరుల నుండి నీటి సౌకర్యం పొందే రైత్వారీ సాగుభూమి

2) *మెట్ట భూమి పుంజ, ఖుష్కి, మెరక :* ప్రభుత్వ నీటి సౌకర్యం లేనట్టి రైత్వారీ సాగు భూమి

3) *పోరంబోకు :* ప్రభుత్వం భూమి ప్రజోపయోగానికై కేటాయించబడిన భూమి (రోడ్లు, చెరువులు, స్మశానం, కాలువలు, బండిబాట, కాలిబాట, మురుగు కాలువలు వగైరా)

4) *మిగులు భూమి :* భూ గరిష్ట పరిమితి చట్ట ప్రకారం గరిష్ట పరిమితికి మించి యున్న భూకామందు నుండి ప్రభుత్వం స్వాధీనపరచుకొన్న భూమి.

5) *ఇస్తిఫా భూమి :* పట్టాదారు తనకు గల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వ పరంచేసి నట్టి భూమి.

6) *తిరిగి ప్రభుత్వ వరం :* పట్టాపై ఇచ్చిన భూమి విషయంలో లబ్దిదారు పట్టా షరతులను చేసుకున్న సదరు భూమి ఉల్లంఘించినచో తిరిగి ప్రభుత్వ పరం చేసుకున్న భూమి.

7) *సేకరణ భూమి* : ప్రజా ప్రయోజనార్థం రైత్వారీ (జిరాయితీ) భూమిని ప్రభుత్వము భూసేకరణ చట్టం ప్రకారం సేకరించిన భూమి.

8) *కేటాయించిన ప్రభుత్వ భూమి :* సాగు నిమిత్తం డి ఫారం పట్టాపై గాని, నివేశ గృహ నిర్మాణం నిమిత్తం పట్టాపై షరతులకు లోబడి అనుభవించుటకు ఇచ్చే ప్రభుత్వ భూమి.

9) *భూమి మార్పు :* ప్రభుత్వ ఆధీనంలోగల భూమిని ప్రజోపయోగం నిమిత్తం మరియొక ప్రభుత్వ శాఖకు (రాష్ట్ర/ కేంద్ర ప్రభుత్వ శాఖలు) బదలీ చేయబడిన భూమి.

10) *భూమి బదలాయింపు :* ప్రభుత్వ ఆధీనంలోగల భూమిని స్థానిక సంస్థలకు, ఫ్యాక్టరీలకు, కంపెనీలకు, రిజిష్టరు సొసైటీలకు అన్యాక్రాంత నిబంధనలకు లోబడి అనుభవించటానికి బదలాయింపు చేయబడిన భూమి.

11) *కౌలు భూమి :* షరతులకు లోబడి సాగుకు / నివసించడానికి నిర్ణీత కాలానికి కేటాయించే భూమి.



Sthanka_JanBW.indd 31 30/12/10 3:03 PM

# భారతాంధ్ర గ్రామం

*శ్వాస ప్రాణానికి*

*ఆశ జీవనానికి*

*ప్రగతి లోకానికి*

*గ్రామం ప్రపంచానికి*

ప్రపంచంలో పురోగతి సాధిస్తున్న దేశం, ఆసియా ఖండంలో అభివృద్ధి చెందుతున్న దేశం భారతదేశం. భారతదేశంలో చదువులలో, క్రీడలలో, గ్రామాల అభివృద్ధిలో ముందున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

*గ్రామాల నిలయం ఆంధ్రప్రదేశ్*
*గ్రామాల ఆలయం ఆంధ్రప్రదేశ్*
*తెలంగాణ పాట సడిలో*
*రాయలసీమ రత్నాల కదలడిలో*

కోనసీమ కొబ్బరి ఆకుల అలజడిలో వినబడుతుంది. పల్లె గొప్పతనం. కలుషితం లేని నీరు, కల్మషం లేని గాలి పల్లెకే సొంతం అని వినబడుతుంది.

*పట్టణంలో లేని అందం పల్లె సొంతం*
*నగరంలో లేని ఆహ్లాదం పల్లె సొంతం*

గ్రామాలలో అతిథులను ఆహ్వానించే అరుగులు, పలకరించే (రామభజనలు) రామమందిరాలు, స్వాగతించే పక్షులు, చెట్లు ఇలా ఎన్నెన్నో వున్నాయి.

పల్లెలలో (గ్రామాలలో) రామమందిరాల వద్ద బోధించే నీతిమాటల వలన వున్మాదులు మంచివారుగా, సాధారణ మనుషులు గొప్ప వ్యక్తులుగా మారినట్లు మన గ్రామచరిత్ర చెబుతుంది.

మా ఊరు రామమందిరం వద్ద ఒక ముసలాయన (తాతయ్య) ఎప్పుడు మూడు నీతి వ్యాఖ్యలు బోధించేవారు.

అవి :

*కటిక కూటి కోసం కోటి విద్యలు*
*మట్టిలో కలిసే దేహానికి నూటొక సోకులు*
*రెప్ప పాటు జీవనానికి రేయింబవళ్లు ఆలోచనలు*

స్వచ్ఛమైన మట్టివాసన, స్వచ్ఛమైన ప్రేమల మిశ్రమమే పల్లె...

***- గంటా రామకృష్ణ***

12) *ఆక్రమణ భూమి :* ఆక్రమించబడిన ప్రభుత్వ భూమి.

13) *వ్యవసాయేతర భూమి :* వ్యవసాయేతర పనులు అనగా, పరిశ్రమలు, వాణిజ్యం లేదా నివాసం కోసం ఉపయోగించే భూములు.

14) *గ్రామ కంఠం :* నివేశన స్థలాలుగా ఉపయోగించే ప్రదేశం (నివాస ప్రదేశం) వారసులు లేకుండా చనిపోయిన వ్యక్తి ఆస్థి ప్రభుత్వానికి చెందే ఆస్థి.

15) *బేవార్సు ఆస్థి :* (స్థిర చరాస్తులు) పన్ను బకాయిలు రాబట్టటానికి రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం బకాయి దారు.

16) *ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమి :* భూమిని వేలం వేసే సమయంలో పాటదార్లు లేనట్లయితే, ప్రభుత్వం తరపున పాట ఖాయమైనపుడు ఆ భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిగా పరిగణిస్తారు.

### 3) భూములతో సంబంధం ఉండే వ్యక్తులు

1) *పట్టాదారులు :* ఎ) సెటిల్మెంటు చేసినపుడు భూమిపై హక్కులు కలుగజేస్తూ రైత్వారీ పట్ట పొందిన వ్యక్తులు / అతని వారసులు/ చట్ట బద్ధంగా బదిలీ పొందిన వ్యక్తులు. బి) ప్రభుత్వ భూమిని సాగు నిమిత్తం కేటాయింపు పొందుతూ డి. ఫారం పట్టా పొందిన వ్యక్తి / అతని వారసులు.

2) *కౌలు లీజుదారుల :* ఎ) ప్రభుత్వ అనుమతి పొంది నిర్ణీత కాలానికి ప్రభుత్వ భూమిని అనుభవించే వ్యక్తులు. బి) పట్టాదారు అనుమతిలో నిర్ణీత కాలానికి రైత్వారీ భూమిని అనుభవించే వ్యక్తులు.

3) *అక్రమణదారులు :* ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ప్రభుత్వ భూమిలో ప్రవేశించి అనుభవించే వ్యక్తులు.

4) *శివాయి జమాదారులు :* పట్టా కోసం దరఖాస్తుచేసుకొన్న ఆక్రమణదారు ధరఖాస్తు తేదీకి ముందు ఒక సంవత్సరం కాలం పైబడి ఆక్షేపణ లేని ఆక్రమణగా పరిగణించబడే ప్రభుత్వ భూమిని అనుభవిస్తున్న వ్యక్తులు.

5) *లబ్ధిదారులు :* ప్రభుత్వం నుండి ప్రయోజనం పొందే వ్యక్తులు (భూమి/ ఋణం/ ఆర్థిక సహాయం/ నివేశన స్థలం / వృత్తిపరికరాలు వగైరా)

6) *నీటి వినియోగదారులు :* ప్రభుత్వ జలవనరుల నుండి సాగుకు నీటిని వినియోగించుకొనే వ్యవసాయదార్లు.

7) *చెట్టు పట్టాదారులు :* ప్రభుత్వ భూమిలో ఫలసాయం నిచ్చే చెట్టు పెంచుకొని, ఫలసాయాన్ని అనుభవించడానికి అనుమతి పొందిన వ్యక్తులు.

8) *భూ కబ్జాదారులు :* ప్రభుత్వ, ప్రభుత్వేతర భూములపై ఎట్టి హక్కులు లేకుండా భూ యాజమాని అనుమతి లేకుండా, దురుద్దేశం / దౌర్జన్యంగా భూమిని ఆక్రమించుకొని, సాగుచేయటం లేదా లీజుకు ఇవ్వడం, గృహ నిర్మాణంచేసి, నివశించటం లేదా అద్దెకివ్వడం వంటి నేరాలకు పాల్పడే వ్యక్తులు.

***- బి. వెంకటేశ్వరరావు,***
*కన్సల్టెంట్, ల్యాండ్ సెల్, అపార్డ్*



Sthanka_JanBW.indd 32 30/12/10 3:03 PM

# యాదవులనే ప్రభువులుగా భావించేవారు కొమ్ములవారు



**కొమ్ముగొల్లోళ్ళు మాదిగ కులానికి చెందినవారు. వీరు గొల్లలు లేక యాదవులు అనే వారికి కాటమరాజు కథ అనే వీరగాథను విన్పిస్తారు. సంప్రదాయం ప్రకారం కాటమరాజు కథాగానం చెయ్యడానికి అధికారం గలవారు వారొక్కరే. వారు 'శక్తిస్వరూపిణి'యైన గంగను కొలుస్తారు. వారు యాదవులెవరైనా చనిపోతే పదకొండోనాడు యాదవుల కథ చెబుతారు. దానిలో రెడ్డిరాజు కథ ప్రధానమైంది. పల్నాటి వీరచరిత్ర తరువాత రెండో వీరగాథ కాటమరాజు కథ.**

ఈ కథ క్రీ.శ. 1280-1297 మధ్యకాలంలో నెల్లూరు చోళరాజైన నల్లసిద్ధిరాజుకూ, యాదవరాజైన కాటమరాజుకూ మధ్య జరిగిన పంచలింగకొండ, ఎర్రగడ్డపాడు యుద్ధాల వర్ణనకు సంబంధించిన ఇతివృత్తంతో గలది.

ఆ యుద్ధంలో చర్నీడు, చెన్నప్ప వంటి యాదవవీరులు పాల్గొన్నారు. ఆ యుద్ధంలో భక్తిరన్న అనే గాయకుడు యాదవచరిత్ర పాడాడని, అతని సంతతికి చెందినవారు కొమ్ములవారని చెబుతారు. నాటి నుంచీ నేటిదాకా యాదవులనే తమ ప్రభువులుగా భావించడం కొమ్ములవారికి సంప్రదాయికంగా వస్తున్న ఆచారం. వీరు ఆంధ్రదేశంలోని దక్షిణకోస్తా ప్రాంతంలో ఎక్కువగా నివసిస్తున్నారు.




కాటమరాజు కథ చెప్పేముందు వీరు 'కొమ్ము' వాద్యాన్ని ఊదుతారు. కొమ్మును కలె, బూర, గవురు మొదలైన పేర్లతో పిలుస్తారు. ఇది ఎద్దు లేక పొట్టేలు చర్మంతో తయారుచేసిన బూరను ఇత్తడి లేక వెండి, బంగారంతో చివరి రెండంచులకు అతుకుతారు. అప్పుడు ఇది కంచులాగా పెద్దగా ధ్వనిస్తుంది.

ఈ కథ చెప్పే గాయకులు నలుగురుంటారు. వారిలో కథకుడు పొడవైన రంగుల చొక్కా వేసుకుంటాడు. ధోవతి కట్టుకుంటాడు. తలకు రుమాలు చుట్టుకొని అంగీపై వెస్టుకోటు వేసుకుంటాడు. మోకాళ్ళకు గజ్జెలు కట్టుకుంటాడు. కుడిచేతిలో దస్తీ పట్టుకొని పాట అందుకుంటాడు. మరో వంత వీరనాం మోగిస్తాడు. దాన్నే 'పంబజోడు' అని కూడా అంటారు. కథకునికి ఎడమవైపు శ్రుతి ఉంటుంది. పంబ పట్టుకున్న వాడు కథకునికి కుడివైపు ఉంటాడు.

'రిథమ్'కు అనుగుణమైన 'తాళం' పడుతూ ఉంటుంది. కథను పాడుతూ ఉంటారు. వచనాన్ని పాటలాగా ఆలపిస్తారు. చాలామందికి రాగపరిజ్ఞానం ఉండదు. బుర్రకథ, ఒగ్గుకథల్లాగానే యుద్ధసన్నివేశాల్లో ఆవేశ ప్రధానంగా చిందువేస్తారు.

గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వీరిని 'గుడారులు' అని పిలుస్తారు. గుడారం, కొమ్ము, వీరణం, బొల్లావు, వీరతాడు, బసవదేవుడు ఈ ఆరూ కొమ్మువారి ఆస్తులు. కులదైవం గంగమ్మ, కాటమరాజు చిత్రాలు గుడారంలో వేలాడదీస్తారు. వీటిని 'తెరచీరలు' అని పిలుస్తారు. వీటి కారణంగా కొమ్మువారిని 'తెరచీర భక్తులు' అని కూడా వ్యవహరిస్తుంటారు. కర్రతో తయారు చేసిన తెల్లావు యాదవ నాయకులకు సందేశం తెచ్చిన బసవదేవుని కర్ర లేక ఇత్తడి విగ్రహాలను తప్పనిసరిగా వారు ఇళ్ళల్లో పెట్టుకుంటారు. కథలో 'గంగతర్కం' పాట ఆసక్తికరంగా ఉంటుంది.

కొమ్మువారు మిక్కిలి భక్తిశ్రద్ధలతో కాటమరాజు ఇతర శక్తుల కథలను గానం చేస్తారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ, రాయలసీమలోని నెల్లూరు జిల్లాలోనూ పాడే కొమ్మువారిని 'భట్టువాళ్లు' అని కూడా వ్యవహరిస్తారు.

- ఎ.ఎమ్. ఫీచర్స్



Sthanka_JanBW.indd 14 30/12/10 3:03 PM

# స్థానిక సంస్థలకు 13వ ఆర్థిక సంఘం నిధులు

## సందేహాలు - సమాధానాలు

**రాజ్యాంగపరమైన ఆర్థిక అంశాలను కొంతమేర సరళీకరించడానికి కేంద్ర ఆర్థిక సంఘం ఏర్పాటు చేయబడినది. నిరంతరం పెరిగే పాలనా బాధ్యతలు పరిమితమైన వనరులతో ఇబ్బంది పడే రాష్ట్ర ప్రభుత్వాలకి కేంద్రం రాబట్టుకునే పన్నుల ఆదాయం నుండి కొంత శాతం రాష్ట్రాలకి కేటాయించడానికి సిఫార్సు చేస్తుంది. అంతే కాక రాష్ట్రాల ఆర్థిక పరిపుష్టికి దిశానిర్దేశం చేస్తుంది.**

కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంటులు పదవ ఆర్థిక సంఘం కాలం నుండే స్థానిక సంస్థలకి కూడా మంజూరు చేసే విధానం ప్రారంభమైనది. పదవ ఆర్థిక సంఘం ఐదేళ్ళ కాల పరిమితికి గాను రూ.4380 కోట్లు విడుదల చేసింది. 1971 జనాభా లెక్కల ఆధారంగా తలసరి రూ. 100ల లెక్కన ఈ గ్రాంటు విడుదల చేయడమైనది.

### 1. 13వ ఆర్థిక సంఘం కాల పరిమితి ఏమిటి?

13వ ఆర్థిక సంఘం కాల పరిమితి 1-4-2010 నుండి 31-3-2015 వరకు ఐదేళ్ళ కాలమునకు విస్తరించినది. దీనిని ఆర్థిక సంఘం అవార్డ్ పీరియడ్ అని అంటారు,

### 2. స్థానిక సంస్థల పరంగా 13వ ఆర్థిక సంఘం ప్రధాన కర్తవ్యం ఏమిటి?

రాష్ట్ర ఆర్థిక సంఘాల (యస్.ఎఫ్.సి) సిఫార్సుల మేరకు స్థానిక సంస్థల వనరులను తగు రీతిగా పెంపొందించడానికి గాను రాష్ట్ర ప్రభుత్వాల సంఘటిత నిధి పటిష్ఠతకి సిఫార్సు చేయడం.

### 3. 13వ ఆర్థిక సంఘం నిధులతో స్థానిక సంస్థలు ఏఏ కీలకమైన సేవలను అందించాలి?

13వ ఆర్థిక సంఘం నిధులతో స్థానిక సంస్థలు ఈ క్రింది అంశాలకి సంబంధించిన సేవలు అందించాలి.

1. ప్రాథమిక విద్య
2. ఆరోగ్యం
3. పారిశుద్ధ్యం
4. త్రాగునీరు
5. వీధిలైట్లు

### 4. పంచాయితీ రాజ్ సంస్థలకి మున్సిపాలిటీలకి ఏ ప్రాతిపదిక మీద నిధులు విడుదల చేస్తారు?

గతంలోని ఆర్థిక సంఘాలకి భిన్నంగా 2001 జనాభా లెక్కలు ప్రామాణికంగా 13వ ఆర్థిక సంఘం నిధులు పంచాయితీ రాజ్ సంస్థలకి మున్సిపాలిటీలకి కేటాయించబడతాయి.

### 5. 13వ ఆర్థిక సంఘం అవార్డు పీరియడ్‌లో స్థానిక సంస్థలకి లభించే నిధులు, అందులో పంచాయితీ రాజ్ సంస్థల వాటా వివరాలేమిటి?

13వ ఆర్థిక సంఘం కాల పరిధిలో (2010-15) స్థానిక సంస్థలకి ఈ క్రింది విధంగా నిధులు విడుదల చేయబడతాయి.

1. గ్రామీణ పట్టణ స్థానిక సంస్థలకి గాను ఐదేళ్ళలో ( 2010-15) రూ. 87519 కోట్లు విడుదల చేస్తారు.
2. దీనిలో పంచాయితీ రాజ్ సంస్థలకి వాటాగా రూ. 63,050 కోట్లు అందజేయబడతాయి.
3. మున్సిపాలిటీలకి రూ. 23,111 కోట్లు విడుదల చేయబడతాయి.
4. ప్రత్యేక ప్రాంతాల గ్రాంటు క్రింద రూ. 1357 కోట్లు కేటాయించబడుతుంది.

### 6. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 13వ ఆర్థిక సంఘం నిధులు ఎంత మేరకు వస్తాయి?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 13వ ఆర్థిక సంఘం నిధులు ఈ క్రింది విధంగా వస్తాయి.

1. రాష్ట్రానికి మొత్తంగా ఐదేళ్ళ కాల పరిమితితో రూ. 7,195 కోట్లు వస్తాయి.
2. దీనిలో రూ.5,226 కోట్లు పంచాయితీ రాజ్ సంస్థలకి వస్తాయి.
3. మున్సిపాలిటీలకి రూ. 1,919 కోట్లు వస్తాయి.
4. ప్రత్యేక గ్రాంటు క్రింద రూ. 50 కోట్లు వస్తాయి.

### 7. 13వ ఆర్థిక సంఘం గ్రాంటులో అంతర్భాగాలేమిటి?

13వ ఆర్థిక సంఘం గ్రాంటును రెండు రకాలుగా వర్గీకరించవచ్చు అవి :

1. సాధారణ మౌలిక గ్రాంటు
2. పనితీరు ఆధారంగా ఇచ్చే గ్రాంటు

సాధారణ మౌలిక గ్రాంటును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకి జనాభా, ప్రాంతము, తలసరి ఆదాయాలలో వ్యత్యాసాలు , జనాభాలో యస్.సి./ యస్.టి. జనాభా నిష్పత్తి, అధికారాల బదలాయింపు సూచి, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల వినియోగం సరళి తదితర అంశాలు ఆధారంగా విడుదల చేస్తుంది.

కేంద్ర ప్రభుత్వ పన్నుల ఆదాయంలో గత సంవత్సరం పంపిణీకి కేటాయించిన ( డివిజిబుల్ పూల్) మొత్తంలో 1.5% మౌలిక గ్రాంటుగా లభిస్తుంది. అన్ని రాష్ట్రాలకి ఈ గ్రాంటును పొందే అర్హత ఉంటుంది.

అయితే ప్రతిభ ఆధారంగా పొందే గ్రాంటును ( పర్ఫామెన్స్ గ్రాంటు)



SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p11d 12/30/2010, 4:09 PM

కొన్ని షరతులకి లోబడి విడుదల చేస్తారు. అవి 1) పన్నులు విధింపు - వసూలు 2) రాష్ట్ర ఆర్థిక సంఘం పనితీరు, పటిష్టత, 3) లెక్కల నిర్వహణ ; ఆడిట్, 4) అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఏర్పాటు.

### 8. కేంద్ర ప్రభుత్వ పన్నుల ఆదాయంలో పంపిణీకి కేటాయించిన ( డివిజిబుల్ పూల్) విషయంలో 13వ ఆర్థిక సంఘం సిఫార్సులలో ప్రత్యేకత ఏమిటి?

మొదటి సారిగా కేంద్ర ప్రభుత్వపు పన్నుల ఆదాయంలో నుండి స్థానిక సంస్థలకి కేటాయింపు చేయాలని 13వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. ఈ డివిజిబుల్ పూల్‌లో కనిష్టంగా 1.5% నుండి గరిష్టంగా 2.5% స్థానిక సంస్థకలకి కేటాయించు అవకాశం ఉంది.

### 9. పని తీరు ఆధారంగా యిచ్చే గ్రాంటు కేటాయింపు 13వ ఆర్థిక సంఘం కాల పరిమితిలో ఎప్పటి నుండి ప్రారంభమౌతుంది?

పని తీరు ఆధారంగా యిచ్చే గ్రాంటు, గ్రాంటు కేటాయింపు ప్రారంభంలో 2011-12 సంవత్సరానికి గ్రాంటులో 0.5 శాతంగాను తదుపరి అవార్డు కాలపరిమితి మూడు సంవత్సరాలకి గాను 1 శాతంగాను ఉంటుంది.

### 10. రాష్ట్ర ఆర్థిక సంఘానికి సంబంధించినంత వరకు 13వ ఆర్థిక సంఘం సూచనలేమిటి?

13వ ఆర్థిక సంఘం రాష్ట్ర ఆర్థిక సంఘాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్దిష్టమైన సూచనలు చేసింది - అవి :

1. రాష్ట్ర ఆర్థిక సంఘాల కాల పరిమితి కేంద్ర ఆర్థిక సంఘం కాల పరిమితితో సమాంతరంగా ఉండాలి.
2. రాష్ట్ర ఆర్థిక సంఘాలలో స్థానిక సంస్థల ఆర్థిక వ్యవహారాలలో నిష్ణాతులైన అనుభవజ్ఞులై ఉండాలి.

### 11. రాష్ట్ర ఆర్థిక సంఘాల నియామకం గురించి 13వ ఆర్థిక సంఘం రాజ్యాంగంలోని 243 ఐ ప్రకారం సూచించిన సవరణ ఏమిటి?

రాష్ట్ర ఆర్థిక సంఘం కాల పరిమితి 5 సంవత్సరాలు. కాలపరిమితి తర్వాత తదుపరి ఆర్థిక సంఘాన్ని నియమించాలి. దీనివలన ఆర్థిక సంఘం నియమించడానికి కొంత కాల వ్యవధి పట్టవచ్చు. దానిని నివారించడానికి గాను రాజ్యాంగంలోని 243 ఐ అధికరణానికి వర్తమాన ఆర్థిక సంఘం పదవీ కాలం ముగిసే లోపలే రాబోయే ఆర్థిక సంఘాన్ని నియమించేందుకు అనువుగా సేకరించమని సూచన చేసింది.

### 12. రాష్ట్ర ఆర్థిక సంఘాల నివేదికలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలకి సంబంధించి 13వ ఆర్థిక సంఘం సూచనలేమిటి?

రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత రాష్ట్ర ఆర్థిక సంఘాలు సకాలంలో నివేదిక యిచ్చేటట్లు చూడాలి. కాలయాపన లేకుండా రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులపై చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులపై తీసుకున్న చర్యలను సకాలంలో రాష్ట్ర శాసన సభలో ప్రవేశ పెట్టాలి.

### 13. స్థానిక సంస్థలలో లెక్కల నిర్వహణ, ఆడిట్ అంశాలను మెరుగు పరచడం కోసం 13వ ఆర్థిక సంఘం చేసిన సూచన లేమిటి?

స్థానిక సంస్థలలో లెక్కల నిర్వహణ, ఆడిట్‌కి సంబంధించి 13వ ఆర్థిక సంఘం స్పష్టమైన సూచనలు చేసింది. అవి :

1. అన్ని స్థాయిలోని స్థానిక సంస్థలకి క్రమ, తప్పకుండా ఆడిట్ జరగాలి.
2. కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి&ఎజి) వారికి అన్ని స్థానిక సంస్థలకి సంబంధించిన గణాంక ఆడిట్ వ్యవహారాలపై పర్యవేక్షణ అధికారం ఉండాలి.
3. కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి&ఎజి) మరియు రాష్ట్ర ఆడిట్ విభాగానికి సంబంధించిన సాంవత్సరిక నివేదికలు సంబంధిత శాసన సభకి సమర్పించాలి.
4. స్థానిక సంస్థల ఆడిట్‌ను నిర్వహించే రాష్ట్ర ఆడిట్ శాఖను మెరుగుపరచి తగు రీతిలో సిబ్బంది సామర్థ్యాలను పెంచాలి.

### 14. స్థానిక సంస్థలలో నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఏ సూచన చేయబడినది?

13వ ఆర్థిక సంఘం స్థానిక సంస్థలలో ప్రతినిధులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే సత్వర నిష్పక్ష పాత విచారణ జరిపి చర్యలు తీసుకొనడానికి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అంబుడ్స్‌మెన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది.

### 15. ఆస్థి పన్ను విధింపు వసూలు గురించి 13వ ఆర్థిక సంఘం ఎటువంటి సూచనలు చేసింది?

స్థానిక సంస్థలు ఆస్థిపన్ను వసూలు చెయ్యాల్సిన విధిని మౌలిక బాధ్యతగా నిర్దేశించింది. అన్ని నివాస గృహాలు, వ్యాపార సంస్థల మీద పన్ను విధించి వసూలు చేసేందుకుగాను దిశలో స్థానిక సంస్థలకి తగు వెసులు బాటు కల్పించాలి. పన్నుల వసూలు ఆధారంగా ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలి.

### 16. 13వ ఆర్థిక సంఘం నిధులలో పనితీరు ఆధారంగా యిచ్చే గ్రాంటును పొందటానికి పాటించవలసిన నియమాలేమిటి?

స్థానిక సంస్థల పనితీరు ఆధారంగా 13వ ఆర్థిక సంఘం నిధులలో పని తీరు ఆధారంగా గ్రాంటు ఇచ్చే విధానం 2011-12 ఆర్థిక సంవత్సరం నుండి మొదలౌతుంది. ఈ గ్రాంటు పొందాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు ఈ క్రింది నియమాలను పాటించాలి.

1. రాష్ట్ర బడ్జెట్‌లో స్థానిక సంస్థల అనుబంధం ప్రత్యేకంగా



SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p15d 12/30/2010, 4:09 PM

రూపొందించాలి.

2. నిర్దేశించిన ఎకౌంటింగ్ విధానం స్థానిక సంస్థలలో ప్రవేశ పెట్టి ఆచరించాలి.

3. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకి సంబంధించిన ఆడిట్ విధానాన్ని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ధృవీకరించాలి.

4. స్వయం ప్రతిపత్తి కలిగిన స్థానిక సంస్థల అంబుడ్స్‌మన్‌ను నియమించాలి.

5. కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు 5 రోజులలోగా ఎలక్ట్రానిక్ పద్ధతి ద్వారా స్థానిక సంస్థల ఖాతాలకి జమ చేయాలి.

6. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుల నియామకానికి స్పష్టమైన అర్హతలు చట్టంలో పొందుపరచాలి.

7. ఆస్థి పన్ను విధింపు వసూలుకి సంబంధించి చట్ట బద్ధమైన అధికారాలుండాలి.

8. పంచాయితీలు, మున్సిపాలిటీలలో ఆస్థిపన్ను మధింపు కోసం రాష్ట్ర స్థాయి ఆస్థిపన్ను బోర్డును ఏర్పాటు చేయాలి.

9. ప్రజలకి అందించు ప్రధాన సేవలైన మంచినీటి సరఫరా,మురికి నీటి పారుదల, ద్రవ, ఘన పదార్థాల వ్యర్థాల నిర్వహణల విషయంలో ప్రమాణాలు రూపొందించాలి.

### 17. స్థానిక సంస్థలకి నిధులు కేటాయించడానికి 13వ ఆర్థిక సంఘం నిర్దేశించిన ప్రాతిపదికలు ఏమిటి?

పంచాయితీ రాజ్ సంస్థలకి, మున్సిపాలిటీలకి నిధులు కేటాయించడానికి 13వ ఆర్థిక సంఘం ఈ క్రింది ప్రమాణాలు నిర్దేశించింది.

### 18. 13వ ఆర్థిక సంఘం నిధులు ఎన్ని వాయిదాలలో రాష్ట్రాలకి విడుదల చేస్తారు. అందుకు పాటించవలసిన నిబంధనలేమిటి?

13వ ఆర్థిక సంఘం నిధులు రెండు విడుతలుగా రాష్ట్రాలకి విడుదల చేయబడతాయి. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీన జులై నెల 1వ తేదీన విడుదల చేయబడుతుంది. గతంలో విడుదల చేసిన గ్రాంటుకు వినియోగ పత్రం సమర్పిస్తేనే తదుపరి వాయిదా కేటాయింపు విడుదల చేయబడుతుంది.

అయితే 2010-11 సంవత్సరానికి చెందిన మొదటి వాయిదా గ్రాంటు విడుదలకి ఎటువంటి వినియోగ పత్రం అవసరం లేదు.

### 19. పనితీరు ఆధారంగా కేటాయించే గ్రాంటు (పర్ఫామెన్స్ గ్రాంటు) రాష్ట్రాలు కోల్పోతే అటువంటి కోల్పోయిన గ్రాంటును (ఫోర్‌ఫీటెడ్ గ్రాంట్) ను ఇతర రాష్ట్రాలకి ఎలా కేటాయిస్తారు?

కోల్పోయిన గ్రాంటులో (ఫోర్‌ఫీటెడ్ గ్రాంట్) 50% గ్రాంటును చక్కని ప్రతిభ చూపిన రాష్ట్రాలకి (పర్ఫామింగ్ స్టేట్స్) ప్రగతిలో వెనుకబడిన రాష్ట్రాలకి (నాన్ - పర్ఫామింగ్ స్టేట్స్) పంచుతారు.

మిగిలిన 50% శాతం గ్రాంటును కేవలం 13వ ఆర్థిక సంఘం నియమాలను సమర్ధవంతంగా అమలు జరిపిన రాష్ట్రాలకి మాత్రమే పంచుతారు.

ఈ విధంగా 13వ ఆర్థిక సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు పాటించడంలో విఫలమైన రాష్ట్రాలు ఈ గ్రాంటును గణనీయంగా కోల్పోయే ప్రమాదం ఉన్నది.

***సి. వెంకటేశ్వర రావు,*** సీనియర్ కన్సల్టెంట్, అపార్డ్

| ప్రాతిపదిక అంశం | పంచాయితీ రాజ్ సంస్థలు శాతం | మున్సిపాలిటీలు శాతం |
|---|---|---|
| జనాభా 50 | 50 | |
| విస్తీర్ణం 10 | 10 | |
| తలసరి ఆదాయాల్లో వ్యత్యాసాలు | 10 | 10 |
| అధికారాల బదలాయింపు సూచి | 15 | 20 |
| జనాభాలో యస్.సి./యస్.టి జనాభా నిష్పత్తి | 10 | - |
| గత ఆర్థిక సంఘంనిధుల వినియోగం సూచి | 5 | 5 |
| | 100 | 100 |



SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p16d 12/30/2010, 4:09 PM

# ఆత్మగౌరవానికి భంగం కలిగినప్పుడు సహనానికి తావులేదు... - మహాత్మా గాంధీ

**భారతజాతికే కాదు ప్రపంచానికే ఆయన పేరు ఓ శాంతిమంత్రం... సత్యాగ్రహ ఆయుధంతో అహింసాయుత పోరాటం సల్పిన కర్తవ్య దీక్షాదక్షుడు.. 'మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ..'. అఖండ భారతావనికి స్వేచ్ఛావాయువులు అందించడమే ప్రధాన అజెండాగా మువ్వన్నెల జెండా సాక్షిగా జాతిని ఏకతాటిపై నడిపించిన బాపూజీ ఎందరికో స్ఫూర్తి... తిరుగులేని శక్తి...!**



నేటి భారతీయులకు మేటి ఐకాన్ ఆయన. నిరాడంబరతకు నిలువుటద్దమై నిలిచి కర్మభూమికి ఊపిరి అందించిన మహాత్ముడు. మనకు నిత్య స్మరణీయుడు... జనవరి 30 ఆయన వర్ధంతి సందర్భంగా పాఠకుల కోసం 1920 ఆగస్టు 31 న 'ఆంధ్రపత్రిక' ప్రతినిధి మహాత్మగాంధీతో జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూను యధాతథంగా అందిస్తున్నాం...

బ్రిటిష్ వారి ఆధ్వర్యంలో నడిచే శాసనసభలకు ఆ ప్రతినిధులు గైరాజరవడంతో పాలకుల అక్రమమార్గాన్ని ఎండగట్టవచ్చని మహాత్మగాంధీజీ వ్యక్తీకరించిన అభిప్రాయం ఉపయుక్తమైంది . . . మరెంతో అమూల్యమైనది.. ఆత్మగౌరవానికి భంగం కలిగినప్పుడు సహనానికి తావులేదని అధర్మాన్ని నిగ్రహించే ప్రయత్నంలో వచ్చే శక్తితో కష్టాలను నివారించుకోవచ్చని పిలుపునిచ్చిన మహాత్మగాంధీ నాటి ఇంటర్వ్యూ సారాంశాన్ని మనం మళ్ళీ ఒకసారి మననం చేసుకుందాం...

***విలేఖరి :*** మహాత్మాజీ... శాసనసభల బహిష్కారం కంటే బ్రిటిష్ వస్తువుల ను బహిష్కరించడం ఎక్కువ ప్రయోజనకారి కాదా...?

***గాంధీ :*** బ్రిటిష్ వర్తకులకు నష్టం కలిగిస్తే ప్రభుత్వం వారు మనం చెప్పినట్లు నడుచుకొంటారని మీ అభిప్రాయం. అది నిజమే కావచ్చు.. కాని బ్రిటిష్ వస్తువులను వెంటనే నిరాకరించడం కాని పని... అదీకాక బ్రిటిష్ వస్తువులను దిగుమతి చేసే కోటీశ్వరులను ఇందుకు ఒప్పించడం కూడా కఠినమైన పనే. వారందుకు ఒప్పుకునేటట్లు చేయడానికి వారిని మరొక విధంగా సంతృప్తి పరచవలసి ఉంటుంది. వారు బ్రిటిష్ వస్తువులను దిగుమతి చేయకుండా ఉండటానికి ఒప్పకోకపోతే మనం వారిని భయపెట్టవలసి ఉంటుంది. వారి గిడ్డంగులను తగలబెట్ట వలసిఉంటుంది. మనమంతా దౌర్జన్యానికి దిగితే గాని కోటీశ్వరులు దిగుమతి వ్యాపారం మానరు. అప్పుడు గాని బ్రిటిష్ వ్యాపారానికి తగినంత నష్టం వాటిల్లదు. కాబట్టి బ్రిటిష్ వస్తు బహిష్కారం దౌర్జన్యానికి దారి తీసి తీరుతుంది. వంగదేశపు విభజన సందర్భంలో విదేశ వస్తు బహిష్కారం జయం పొందలేదు. రౌలట్ చట్టాన్ని మూడు నెలల్లో రద్దు చేయకపోతే తాము బ్రిటిష్ దిగుమతులను ఆపివేస్తామని దేశపాండ్య, బాప్టిస్టాగార్లు దొరతనం వారికి చివరి సందేశం పంపినారు. మూడు నెలలు గతించాయి.. ప్రభుత్వం వారు ఆ చట్టం రద్దు చేయలేదు. బాప్టిస్టా, దేశపాండ్య గార్లు బహిష్కారం అమలు జరపడానికి సర్వవిధాల ప్రయత్నించి పూర్తిగా విఫలులైనారు. ఆ విషయం వారంగీకరిస్తున్నారు కూడా. దౌర్జన్యంలో విశ్వాసం కలవారు బ్రిటిష్ సరుకుల దిగుమతిని బహిష్కరించడానికి పూనుకోవచ్చు కానీ నేను మాత్రం ఆదరికి పోలేను...

***విలేఖరి :*** శాసనసభలకు పోకూడదని మీరు బోధిస్తున్నారు. దానికంటే శాసనసభలకు పోయి ప్రభుత్వం వారి చర్యలను ఆటంకపరచడం ఎక్కువ ప్రయోజనకారి కాదా...?

***గాంధీ :*** కాదు... ముమ్మాటికి కాదు.. ఆత్మగౌరవం కలవారు శాసనసభలకు పోయినట్లయితే వాటికి గౌరవం వస్తుంది. అది లేనివారు పోయినా శాసనసభలకు ఏమీ గౌరవం ఉండదు. ప్రస్తుతం శాసనసభలు కల్లు దుకాణాల వంటివి. ప్రస్తుతం నేను వాటిలోకి పోయినట్లయితే వాటికి గౌరవం వస్తుంది. ప్రజలకు వాటిపట్ల గౌరవం పెరుగుతుంది కూడా.. కాబట్టే మనమే ఉద్దేశ్యంతో శాసనసభలకు పోయినా వాటి గౌరవం పెరిగే మాట వాస్తవం. ప్రస్తుతం పరిపాలకులు అక్రమ మార్గాలను అవలంబిస్తూండడం చేత వారేర్పరచిన శాసనసభలకు పోక మనం మన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవలె...! పండిత మాలవ్యాజీ పట్ల నాకు ఎంతో పూజ్యభావం ఉన్నది కాని నేనెవ్వరిని అంధప్రాయంగా పూజించను. వారు రౌలట్ చట్టం సందర్భంలో శాసన సభ్యత్వాన్ని ఒకసారి వదలి వేసి తిరిగి శాసన సభ్యులయినారు. అందువల్ల వారికి కలిగిన ఫలితమేమిటి...? పంజాబ్ విషయమై శాసనసభలో ఒక మహోపన్యాసం చేసి థాంసన్ గారి దూషణలకు గురి అయినారు. వారే శాసనసభకు పోక బయట నుంచే ఉపన్యాసం చేసి పంజాబ్ అత్యాచారాలను వెల్లడించి ఉండినట్లయితే థాంసన్ గారి దూషణలకు గురియై ఉండేవారు కారు.. మాలవ్యా గారు ఆ సభలో మహోపకారం చేసినట్లు మనం వారిని శ్లాఘిస్తున్నాం. అది వట్టి పొరపాటు. వారు బయటనే ఎక్కువ ఉపకారం చేయగలిగి ఉండేవారు. లోకమాన్య తిలక్ గారు శాసనసభలకు పోకుండా చేసిన మహోపకారాలలో శాసనసభ్యులు చేసిన సేవ ఎన్నో వంతు...? నీవు శాసనసభకు పోతావా.. లేక కల్లు అంగడికి పోతావా అని నన్నెవరయినా అడిగితే నేను కల్లు అంగడికి పోవడానికే ఇష్టపడతానని చెబుతాను.



Sthanka_JanBW.indd 29 30/12/10 3:03 PM

ఆత్మగౌరవం లేనివారు శాసనసభలకు పోతే పోనీయండి.. ప్రతి గ్రామంలోని వోటర్ల సభ చేసి ఆ సభ్యులు తమ ప్రతినిధులు కారని తీర్మానించి ప్రకటిస్తారు. అప్పుడు ఏ మొగం పెట్టుకుని వారు ప్రజాప్రతినిధులమని అంటారో చూడవలసి ఉంది. అప్పుడు శాసనసభలకు ఏమి గౌరవముంటుంది..! పంజాబ్ విషయంలో 'ఖిలాఫత్' సందర్భంలో మీ హృదయాలు నిజంగా పరితపిస్తున్నట్లయితే మీ దేశభక్తి యదార్థమైనట్లయితే మీకు ఆత్మగౌరవమున్నట్లయితే మీరు శాసనసభలను బహిష్కరించి తీరవలే. జాతీయవాదుల్లోను, మితవాదుల్లోను మంచివారు, చెడ్డవారు కూడా ఉన్నారు. స్వార్థ పూరితులైనవారు స్వప్రయోజనాలు పొందనీయండి. సదుద్దేశం ఉన్న మితవాదులు మొదట శాసనసభకు పోయినప్పటికీ కొంతకాలంకైనా తాము మోసపోతిమని తెలుసుకుని పశ్చాత్తాప పడతారు...

***విలేఖరి :*** ఓటర్లకు మీరు చెప్పినంత విచక్షణ ఉంటుందా...?

***గాంధీ :*** ఓటర్లు తెలివితక్కువవారు కారు... వారెక్కువ వివేకం కలవారు. వారిపైన నాకు చాలా విశ్వాసమున్నది. విద్యార్థికుల కంటే వారెక్కువ వివేకం కలవారు. గ్రామాలకు పోయి మనం సరిగా బోధిస్తే వారు ఎన్నికలకు పోరు. ఏ స్వల్ప సంఖ్యాకుల కోసమో ఎన్నుకొనబడిన వారు. తమ ప్రతినిధులు కారిన పెద్దసభలు చేసి తీర్మానించి వారి సభ్యత్వం వదులుకొనేటట్లు చేయగలరు. ఈ పని చేయడానికి ఒక మాసం చాలు.. మీరందుకై కృషి చేయవలె.

***విలేఖరి :*** పరిపాలకులు అక్రమమార్గం అవలంబిస్తున్నారని మీరిప్పుడైనా తెలుసుకొన్నారు... మొదటి నుంచి వారు మనకు అన్యాయం చేయడం లేదా...?

***గాంధీ :*** మనకు అన్యాయం జరుగుతున్న మాట నిజమే.. అందుకై మన అసమ్మతిని తెలుపుతూనే ఉన్నాము.. కాని మన నాయకులు పంజాబ్‌లో అగౌరవింపబడినప్పుడు, సోదర దేశీయులు పొట్టల పై పాకింపబడినప్పుడు, మహ్మదీయుల మతవిశ్వాసానికే భంగం వాటిల్లినప్పుడు నా సహనం మేర దాటింది.. 'ఆత్మగౌరవానికి భంగం కలిగినప్పుడు సహనానికి తావు లేదు...' అధర్మాన్ని నిగ్రహించడానికి ప్రయత్నించేటప్పుడు మనకపూర్వమైన బలం కలుగుతుంది. ఆ బలంతో తక్కిన కష్టాలను కూడా నివారించుకోగలుగుతాము.

***విలేఖరి :*** మీరు దక్షిణ దేశమంతా తిరిగి వచ్చినారు.. మీ ఉద్యమానికి ఎటువంటి ప్రోత్సాహం వచ్చింది...?

***గాంధీ :*** నాకు నిరుత్సాహం కలగలేదు. బిరుదులను, గౌరవ పదవులను విడిచి పెట్టడానికి కొందరు తయారుగా ఉన్నారు. కొందరు న్యాయవాదులు కూడా తమ వృత్తిని వదలి వేయడానికి సంకల్పించుకొన్నారు. త్వరలో వారి పేర్లు ప్రకటించగలము.

***విలేఖరి :*** రేపు కలకత్తా కాంగ్రెస్ మీ ఉద్యమం అంగీకరించనట్లయితే మీరు ఏమి చేయదలచుకొన్నారు...?

***గాంధీ :*** "నా అంతర్వాణికి తప్ప నేను దేనికి లోబడను..." కాంగ్రెస్ ఉద్దేశ్యం ప్రజా బాహుళ్యం ఉద్దేశంను ఏటేటా వ్యక్తీకరించడమే కాని దేశీయుల భావస్వాతంత్ర్యాన్ని నిరోధించడం కాదు.. ఈయేటి కాంగ్రెస్ నా ఉద్యమాన్ని అంగీకరించనట్లయితే ప్రజలలో దానినింకా వ్యాపింపజేసి ప్రతిపక్షాలను నావైపుకు త్రిప్పుకునేటందుకు ప్రయత్నిస్తాను. పై సంవత్సరమైనా నా కార్యక్రమం కాంగ్రెస్‌చే అంగీకరించేటట్లు చేయగలను. కాంగ్రెస్ తీర్మానం అంటే ఆ ఏడు సమావేశమైన ప్రతినిధులలో ఎక్కువమంది అభిప్రాయమని.. . కాని భిన్నాభిప్రాయాలు ఉన్న వారు కాంగ్రెస్‌లో ఉండకూడదని కాదు. నేను కాంగ్రెస్ అభిమానిని అయినా నా వాదం నాదే. నా వాదం కాంగ్రెస్ అంగీకరించేటట్లు చేయడమే నా కర్తవ్యం.. లోకమాన్యుని అభిప్రాయాలను మొదట కాంగ్రెస్ అంగీకరించలేదు. తరువాత అవి సర్వజనాంగీకారాలైనాయి.. అట్లాగే నా పక్షం రేపు కాంగ్రెస్‌లో గెలవకపోయినా భయం లేదు.. పై సంవత్సరమైనా గెలిచి తీరుతుందని నా నమ్మకం.. కాంగ్రెస్‌లో అధిక సంఖ్యాకులు అంగీకరించిన తీర్మానానికి విరుద్ధంగా కాంగ్రెస్ అభిమానులెవ్వరు ప్రవర్తించకూడదనే వాదం కంటే వెర్రివాదం ఇంకొకటిలేదు నిమ్న జాతులను ఉద్ధరింపవలెననే తీర్మానం కాంగ్రెస్ రెండు సంవత్సరాల కిందటే ఆమోదించింది. అంతకు పూర్వం ఎవ్వరూ ఆ ఉద్యమంలో పాల్గొనకూడదని ఎవరయినా చెప్పడానికి సాహసించినారా...? కాంగ్రెస్ ఉద్దేశమెప్పుడూ ఆత్మ స్వాతంత్ర్యానికి ప్రతికూలమయింది కాదు...

***విలేఖరి :*** శాసన సభ్యత్వం మాదిరి బోర్డులు, మున్సిపాలిటి సభ్యత్వం కూడా వదిలి వేయవలెనని మీ అభిప్రాయమా...?

***గాంధీ :*** నేను కేవలం ఆచరణ సాధ్యం కాని ఆదర్శాలను వాదించే వాణ్ణి కాను.. ఆదర్శం ఎంతవరకు ఆచరణయోగ్యమో ఆలోచించే ఈ కార్యవిధానాన్ని నిశ్చయించినాను.. బోర్డులు, మున్సిపాలిటిలోని సభ్యత్వాలను వదిలి వేయకూడదు.. అందువల్ల మన గ్రామాల, పట్టణాల ఆరోగ్య రక్షణకు భంగం కలుగుతుంది.. ఆ సంఘాలకు ప్రజలు ఎన్నుకొన్న వారు కాక ప్రభుత్వం నియమించిన వారు మాత్రమే సభ్యత్వము వదిలి వేయవలె...

***విలేఖరి :*** ఈ కార్య విధానం నిశ్చయించడంలో మీ ప్రధాన లక్ష్యమేమిటి...?

***గాంధీ :*** భారతదేశానికి ప్రత్యేక జాతీయ దృష్టి ఉందని నా అభిప్రాయము.. మనము చేసే ప్రతి పని దాని కనుగుణంగా ఉండవలె. నా కార్యక్రమం వల్ల ఆత్మశక్తి బాహుబలం కంటే బలవత్తరమయినదని రుజువు కాగలదు.. దేశీయులలో నిద్రాణమయి వాన్న సంకల్పశక్తి వజ్ర కాఠిన్యం పొందగలదు. కోర్టులను బహిష్కరించడం వలన పంచాయతీ వ్యవస్థలు వృద్ధి పొందగలవు. ప్రభుత్వ పాఠశాలలను విడనాడడం వల్ల జాతీయ విశ్వవిద్యాలయాలు పెంపొందగలవు.. జనంలో ఆత్మగౌరవం వర్ధిల్లగలదు.. హిందూ, మహ్మదీయ సఖ్యత విలసిల్లగలదు.. వేయేల స్వరాజ్యలక్ష్మికి అధికారులం కాగలము..

***విలేఖరి :*** బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కక్షల గురించి మీరేమనుకొంటున్నారు...?

***గాంధీ :*** హిందూ, మహ్మదీయ సఖ్యత కుదురుతున్నప్పుడు హిందూవులలోని అంతర్భేదాలు వాటంతటవే తొలగిపోగలవు.. ఒక జాతి ఆధిపత్యాన్ని గాని ఒక వర్ణం వారి ఆధిపత్యాన్ని నేను అంగీకరించను.. బ్రాహ్మణులు శాసన సభ్యత్వ పదవులనన్నిటిని బ్రాహ్మణేతరుల కెందుకు వదలి వేయకూడదు. నా ఉద్యమానికి సంబంధించినంత వరకు శాసనసభలకు పోయి మతిహీనులు కాకూడదని నా ప్రార్థన...

***విలేఖరి :*** మహాత్మాజీ... మీకీ కార్యవిధానం తప్ప ఏ ఇతర పథకం కనపడలేదా...?

***గాంధీ :*** కనపడక పోవటమే కాదు.. కనుక్కోవడానికి ప్రయత్నించాను కూడా. కాని నాకు గోచరం కాలేదు...

*- సేకరణ : ప్రభాకర్ ఆరిపాక*



Sthanka_JanBW.indd 30 30/12/10 3:03 PM

# తిమ్మాపూర్‌లో ప్రయోగాత్మక సోషల్ ఆడిట్

**ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి 3 వ బ్యాచ్ ఎమ్.పి.డి.ఒ., ఎ.పి.ఒ.ల శిక్షణ ముగింపు సమావేశంలో, తేది : 21-08-2010వ శ్రీ ఎస్.ఎస్. రావత్, కమీషనర్, గ్రామీణ అభివృద్ధి, శ్రీ మురళి, డైరెక్టర్ ఇ.జి.యస్., శ్రీమతి సౌమ్య, డైరెక్టర్ (సాట్) గారం సమక్షంలో జరిగిన చర్చలోని సూచనల మేరకు ప్రయోగాత్మకంగా సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలంలో చేపట్టడం జరిగింది.**

### అవశ్యకత

1. కార్యక్రమ అమలు తీరు విశ్లేషణ ప్రజల సమక్షంలోనే జరిగితే, ప్రజలు చైతన్యవంతులై, అమలు ప్రక్రియ మెరుగు పడుతుంది.
2. సామాజిక తనిఖీ 'ఫోభియా' అధికారుల్లో, సిబ్బందిలో పోవాలి.
3. ఇది ప్రజల కార్యక్రమం, ప్రజలే న్యాయ నిర్ణేతలు అనే భావన పెంపొందాలి.
4. తరచుగా ప్రజల మధ్య - యూజర్స్ చెంత సామాజిక తనిఖీ జరగడం వల్ల, తమకు తాము చేస్తున్న పని నాణ్యత, కొలతలు, హాజరు, వేతనం, తదితర విషయాల పట్ల సంపూర్ణ అవగాహన పొంద గలుగుతారు.
5. ఏవేని సమస్యలు ఉదా: వేతనాలలో వ్యత్యాసాలు, కొలతలలో తేడాలు, మెడికల్ బిల్లులు, పని స్థలంలో సౌకర్యాలు మొదలగు వాటి పట్ల ఎప్పటికప్పుడు తగు నిర్ణయాలు, చర్యలు చేపట్టడానికి అవకాశం ఏర్పడుతుంది.

### ఎంపిక చేసిన గ్రామం : పోరండ్ల

*ఈ గ్రామాన్ని ఎంపిక చేయడానికి కారణాలు*

* గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ చురుగ్గా లేకపోవడం వల్ల చాలా సమస్యలు తలెత్తున్నట్లు దృష్టికి రావడం.
* ఇతర గ్రామాల్లో మాదిరిగా ఈ గ్రామంలో మేట్‌ల వ్యవస్థ సక్రమంగా పని చేయకపోవడం
* పలుసార్లు ఫిర్యాదులు రావడం.

*ఉద్దేశ్యం*

* ఉపాధి హామీ పథకానికి 'గుండెకాయ' అయిన రాజీలేని అంశాల అమలును సమీక్షించటానికి.
* పనిచేసిన ప్రతి వ్యక్తికీ వేతనం అందాలి.
* చేసిన పని పరిమాణానికి తగిన ఫలితం అందాలి.
* పని చేయని వారెవరికీ (బోగస్) వేతనం అందరాదు.
* పనులు ప్రజోపయోగంగా, నాణ్యత, ప్రమాణాలతో ఉండాలి.
* వివిధ స్థాయిలలో పారదర్శకత పెంపొందాలి

*సామాజిక తనిఖీ కార్యకర్తల రాజీలేని సూత్రాలు*

* ఎటువంటి రాజకీయాలకు చోటు ఉండరాదు.
* ఎటువంటి వ్యక్తిగత అభిప్రాయాలకు తావు ఇవ్వరాదు.
* వాస్తవాలు మాత్రమే నిక్కచ్చిగా రాయాలి.
* ఏవైనా లోటుపాట్లు ఉంటే అధారాలతో సహా బయట పెట్టాలి.
* ప్రజలందరితో/కూలీలతో మాట్లాడి, నిర్ణయానికి రావాలి.
* నిస్పక్షపాతంగా వ్యవహరిస్తూ, ప్రలోభాలకు గురి కాకూడదు.
* సభ్యులందరూ శాఖాహారమే తీసుకోవాలి.
* గ్రామపంచాయితీ/ప్రభుత్వ భవనాలలోనే తనిఖీ సమయంలో బస చేయాలి.

*చేయవలసిన పనులు*

* మస్టర్/వే ఆర్డర్ ప్రకారం ఇల్లిల్లూ తిరిగి కూలీలకు చెల్లింపులు జరిగినవా/లేదా
* పని చేయకున్నను 'ఎవరైన' కూలీ వచ్చినట్లు గుర్తించారా
* పని చేసిన పరిమాణానికి అనుగుణంగా కూలీ వచ్చిందా/లేదా
* పనులు చేశారా లేదా, నాణ్యత, కొలతలు గమనించాలి, కొలతల పుస్తకంతో సరిచూసుకోవాలి.:

*నివేదిక తయారు*

* మాస్టర్/ వే అర్డర్ ప్రకారం చెల్లింపులు జరిగినవా లేదా
* పనిచేసినా వేతనాలు రాని వారి లిఖిత ఫిర్యాదులు
* పని చేయకున్నా వేతనాలు వచ్చిన వారి వివరాలు- ఆధారాలతో సహా
* కూలీల "రాజీ లేని అంశాల" పై ఫిర్యాదులు, నీడ, నీరు, వైద్య సదుపాయం ఏర్పాటు,
* మెడికల్ బిల్లుల చెల్లింపులు - మొదలైనవి
* పనులు అడిగిన సమయంలో ఇవ్వలేదా
* పనులు కావలసిన వారు ఎవరైన ఉన్నారా
* కొలతలలో తేడాలు
* వేతనాలలో తేడాలు
* నిధులు దుర్వినియోగం
* జాబ్ కార్డులకు సంబంధించిన సమస్యలు (ఒకటి కంటే ఎక్కువ,



Sthanka_JanBW.indd 15 30/12/10 3:03 PM

## సామాజిక తనిఖీ నివేదిక

*(2-9-2010 నుండి 10-9-2010 వరకు)*

### సామాజిక సభకు హాజరయిన అధికారులు

వి.యస్.ఎ : 06
డి.ఆర్.పి : 02
యస్.ఆర్. పి : 01

1. అసిస్టెంట్ పి.డి. మానకొండూర్
2. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి
3. అదనపు ప్రోగ్రాం అధికారి

*గ్రామ పంచాయితి : పోరండ్ల* *మండలం : తిమ్మాపూర్* *జిల్లా : కరీంనగర్*

| క్రమ సంఖ్య | అంశం | బాధ్యులు | మొత్తం రూ.లు | రికవరీ అయిన మొత్తం | రికవరీ చేయవలసిన మొత్తం | తీసుకున్ననిర్ణయం |
|---|---|---|---|---|---|---|
| **1.** | **పని చేసిన వారికి వేతనాలు రాలేదు** | | | | | |
| 1 | జాబ్ కార్డు నెం, 10391 సదిరె సంపత్ 2 రోజులు పనికి వెళ్ళినా డబ్బులు రాలేదు | మేట్ మరియు క్షేత్ర సహాయకుడు | | | | స్లీపింగ్ మేట్‌గా మాత్రమే పనిచేశారు. కూలీ చెల్లించటానికి వీలులేదు. |
| 2. | జాబ్ కార్డు నెం, 10527 పార్నంది లక్ష్మీ 5 రోజుల డబ్బులు రాలేదు. (మన్నెపు కుంట) | మేట్ మరియు క్షేత్ర సహాయకుడు | | | | స్లీపింగ్ మేట్‌గా మాత్రమే పనిచేశారు కూలీ చెల్లించటానికి వీలులేదు. |
| 3. | జాబ్ కార్డు నెం, 10535 ఆరెల్లి స్వప్న 6 రోజుల డబ్బులు రాలేదు (పులి చెరువు కుంట) | మేట్ మరియు క్షేత్ర సహాయకుడు | | | | స్లీపింగ్ మేట్‌గా మాత్రమే పనిచేశారు కూలీ చెల్లించటానికి వీలులేదు. |
| 4. | జాబ్ కార్డు నెం, 10159 కొంద్ర రమ 3 రోజుల డబ్బులు రాలేదు. | మేట్ మరియు క్షేత్ర సహాయకుడు | | | | స్లీపింగ్ మేట్‌గా మాత్రమే పనిచేశారు కూలీ చెల్లించటానికి వీలులేదు. |
| 5. | జాబ్ కార్డు నెం, 10330 పార్నంది శాంతవ్వ 23 రోజుల కూలీ డబ్బులు రాలేదు (పాన్ చెరువు, మన్నెవు కుంట) | మేట్ మరియు క్షేత్ర సహాయకుడు | | | | స్లీపింగ్ మేట్‌గా మాత్రమే పనిచేశారు కూలీ చెల్లించటానికి వీలులేదు. |
| **2.** | **పని చేసినంత డబ్బులు రాలేదు** | | | | | |
| 1. | మేట్ల అవగాహన లోపం వలన కొలతలు సరిగా లేకపోవడం వలన, తక్కువ డబ్బులు వచ్చాయి. | ఫీల్డ్ అసిస్టెంట్ మరియు సాంకేతిక సహాయకులు | | | | మెజర్ మెంట్ ప్రకారం చెల్లింపులు చేయడం జరిగినది. |
| **3.** | **పని చేయకున్నను వేతనాలు తీసుకున్న వారు** | | | | | |
| 1. | తొడెంగ ఐలయ్య | | 1343.00 | | | బి.సి. నుండి రికవరి చేయవలసి ఉంది |
| 2. | గొల్ల లక్ష్మయ్య | | 130.00 | | | బి.సి. దగ్గర ఉంది |
| 3. | చింతల సమత | బి.సి మరియు క్షేత్ర సహాయకుడు | 626.00 | | | విచారణలో గ్రామంలో ఉండి పని చేసినట్లు తేలింది. |
| 4. | పిల్లి అనిల్ | | 500.00 | | | స్లిపింగ్ మేట్‌గా పని చేశారు |



Sthanka_JanBW.indd 16 30/12/10 3:03 PM

| | | | |
|---|---|---|---|
| 5. కూన శ్రీనివాస్ | | 470.00 | బొజ్జ పరుషరాములు బావిలో పనిచేశారు. |
| 6. కీసర శ్రీనివాస్ | | 600.00 | స్లీపింగ్‌మేట్‌గా పనిచేశారు |
| **4. నిబంధనలకు విరుద్ధంగా, పని చేయకుండా మేట్‌గా వ్యవహరించినవారు** | | | |
| 1. సదిరె శ్రీనివాస్ | | 771.00 | వర్కింగ్ మేట్‌గా |
| 2. పిల్లి రమేష్ | | | కాకుండా స్లీపింగ్ |
| 3. కీసర శ్రీనివాస్ | క్షేత్ర | | మేట్‌గా పనిచేసిన |
| 4. పిల్లి అనిల్ | సహాయకుడు | | సంబంధితులకు |
| 5. బొజ్జ అనిల్ | | | రికవరీకి ఆదేశాలు |
| 6. ఎల్లాల నిరక్షణ | | | ఇవ్వటమైనది. |
| **5. నూతన బావుల చెల్లింపులు** | | | |
| 1. పార్నంది లక్ష్మీకి చెల్లించాల్సిన డబ్బులు ఆసోద రామ్టులుకు చెల్లించటం జరిగింది. | బి.సి. మరియు క్షేత్ర సహాయకుడు | 10812.00 | పే ఆర్డర్/ వేతన స్లిప్పుల ప్రకారం, సంబంధితులకు చెల్లింపులు చేయటానికి సూచించదమైనది. |
| **6. పనుల నాణ్యత** | | | |
| 1. కొత్త బావులు ఉపయోగకరంగా ఉన్నాయి. | | | |
| 2. భూమి అభివృద్ధి పనులు నాణ్యతతో ఉన్నాయి. | | | |
| 3. నల్ల మట్టి (పొలాలకు) తరలింపు ఉపయోగకరంగా ఉంది. | | | |
| 4. సమగ్ర నీటి పారుదల చెరువు పునరుద్ధరణ పనులలో నాణ్యత లేదు మరియు ఎ.ఇ. | ఫీల్డ్ అసిస్టెంట్, సాంకేతిక సహాయకులు | | మెమోలు జారీ చేయటానికి సూచించదమైనది. |
| **7. మెడికల్ బిల్స్** | | | |
| 1. సదిరె చంద్రయ్య | క్షేత్ర సహాయకుడు | | వెంటనే బిల్లులు |
| 2. మామిడిపల్లి లక్ష్మయ్య | మరియు | | చెల్లించటానికి ఎ.పి.ఒ.కు |
| 3. వద్లూరి వెంకటమ్మ | అదనపు ప్రోగ్రాం అధికారి | | సూచించదమైంది |
| **8. మెటిరియల్** | | | |
| 1. మెటీరియల్ (ట్రాక్టర్స్)కు సంబంధించి బిల్లులు వేరొకరికి ఇవ్వటం. సంబంధించిన వాటికి ఫీల్డు అసిస్టెంట్ లాగ్ బుక్ నిర్వహించకపోవటం. | ఫీల్డ్ అసిస్టెంట్ మరియు సాంకేతిక సహాయకులు | | ఇక ముందు నిబంధనల మేరకు మాత్రమే బిల్లులు చెల్లించటానికి సూచించదమైనది. తేది: 13-9-2010 న 'లెక్క' ప్రకారం చెల్లింపులు చేయటానికి సూచించదమైనది. |
| **9. రికార్డులు** | | | |
| 1. జాబ్ కార్డులు పూర్తిగా వ్రాయలేదు. | ఫీల్డు అసిస్టెంట్, సాంకేతిక సహాయకులు మరియు అదనపు ప్రోగ్రాం అధికారి | | ఫీల్డ్ అసిస్టెంట్, సాంకేతిక సహాయకులు మరియు ఎ.పి.ఒ.లకు మెమోలు జారీ మెమోలు జారీ చేయటానికి సూచించదమైనది. |
| 2. రికార్డులు నిర్వహించలేదు | | | |
| **10. స్మార్ట్ కార్డు** | | | |
| 1. స్మార్ట్ కార్డు కోసం డబ్బులు అడగటం | | | సంబంధిత 'బి.సి' |
| 2. కూలీలకు స్లిప్ మీద ఉన్న డబ్బులు చెల్లించకపోవటం. | | | పై చర్యకు సిఫారసు చేయదమైనది. |



Sthanka_JanBW.indd 17 30/12/10 3:03 PM

బోగస్, అసలే రానివారు మొదలైనవి)

* సకాలంలో చెల్లింపులు కాకపోవడం

*గ్రామ సభ నిర్వహణ*

10-09-2010 ఉదయం 10.00 గంటలకు గ్రామ పంచాయితీ ఆవరణలో నిర్వహించడమైనది.

*ఎజెండా అంశాలు*

29-8-2010 నుండి 7-9-2010 కాలానికి అయిన వ్యయం, వేతనాలు 18.12 లక్షలు, మెటిరియల్ 7.10 లక్షలకు సామాజిక తనిఖీ నిర్వహించటమైనది.

### సామాజిక సభకు హాజరయిన అధికారులు

వి.యస్.ఎ : 04 1. ఎ.పి.డి. డబ్ల్యు. ఎమ్.ఎ, కరీంనగర్

డి.ఆర్.పి : 02 2. మండల పరిషత్ అభివృద్ధి అధికారి

యస్.ఆర్.పి : 01 3. అదనపు ప్రోగ్రాం అధికారి

ముఖ్య అతిథులుగా గ్రామసర్పంచ్, ఎమ్.పి.టి.సి., ఎమ్.పి.డి.ఒ. కాటారం పాల్గొన్నారు.

### కూలీల నుండి అభిప్రాయ సేకరణ

1. గ్రామంలో చేపట్టిన వ్యవసాయ బావులు, భూమి అభివృద్ధి పనులు, చెరువు మట్టి తరలింపు పనులు సంతృప్తికరంగా ఉన్నాయి.
2. చెరువు పనులు నాణ్యతగా లేవు.
3. కూలీలకు ఆపద సమయంలో ఉపాధి హమీ పనులు చేదోడుగా నిలిచాయి.

### అభియోగాలు, ఆరోపణలు

1. పని చేసిన ఆరుగురికి 39 రోజులకు వేతనాలు చెల్లింపబడలేదు.
2. పని చేయని ఆరుగురికి వేతనాలు చెల్లింపబడ్డాయి.
3. స్మార్ట్ కార్డు ద్వారా చెల్లింపులు సక్రమంగా జరుపబడలేదు.
4. మెడికల్ బిల్లులు ముగ్గురికి చెల్లించవలసి ఉంది.
5. ట్రాక్టర్ ట్రిప్పులకు సంబంధించి బిల్లుల చెల్లింపు గందరగోళంగా ఉంది.
6. మంజూరి కాని వారికి చెరువు మట్టి వేయడం జరిగింది.

### తుది నివేదిక రూపకల్పన- కన్సాలిడేషన్

1. గ్రామంలో 708 జాబ్ కార్డులు ఉన్నాయి. 878 మంది కూలీలు పనులకు రావడం జరిగింది. ఇందులో కేవలం ఆరుగురికి మాత్రమే వివిధ కారణాలతో వేతనం చెల్లించబడలేదు.
2. స్లీపింగ్ మేట్‌గా పని చేసిన వారికి వేతనాలు చెల్లించడం జరిగింది.
3. లేబర్ డిమాండ్ బట్టి మంజూరికై ప్రతిపాదించిన పనిలో మట్టి వేయడం జరిగింది.
4. జాబ్ కార్డుల అప్ డేషన్ జరగలేదు.
5. ఫీల్డు అసిస్టెంట్ తన విధులు సక్రమంగా నిర్వహించలేదు.
6. క్షేత్ర స్థాయి పర్యవేక్షణ లోపం కనిపించింది.
7. స్మార్ట్ కార్డు ద్వారా వేతనాలు చెల్లింపులలో నియమ నిబంధనలు పాటించలేదు.

*- కె. కిషన్ స్వామి, ఎంపిడివో, తిమ్మాపూర్, కరీంనగర్ జిల్లా*

## చిగురించని చెట్టు

విశ్వమానవుడికి జి-మెయిల్, యాహూ రెండూ - రెండు కళ్ళు
గూగుల్ 'గాగుల్స్' లేకుంటే లోకం చీకటి
ఇప్పుడు జీవితాలన్నీ సాలెగూట్లో వేళ్ళాడుతున్నాయి
కళ్ళు - సోడాబుడ్ల గోళీలయినా
బొజ్జ -సంచిలా కాళ్ళసందులోంచి వేళ్ళాడినా
వెన్నుపూస పాములా మెలికలు తిరిగిపోయినా
వీర్యకణాల సంఖ్య పడిపోయినా
పాలడబ్బా నుంచి చావుకుండ వరకూ
పెళ్ళి దగ్గర్నుంచి పెటాకుల వరకూ
బ్రెడ్డూ బెడ్డూ అన్నింటినీ ఆన్ లైన్లో డౌన్ లోడ్ చేసుకోవలసిందే...
ముఖాన్ని నలుచదరంగా సాగదీసి మోనిటర్‌కి అతికించాల్సిందే...
మన మానవసంబంధాల నాడుల్ని మనమే తెంపుకొని
మమతానురాగాల్ని హృదయం నుంచి మనమే ఒలక బోసుకొని
మన జీవనమాధుర్యాన్ని మౌస్ పిసికినట్లు
మనమే పిసికేసుకోవడం అనివార్యమిప్పుడు!
వికసించిన విజ్ఞానం వెదజల్లుతున్న సౌకర్యాల గుబాళింపుల్లో పడి
మితిమీరిన బ్లాగుబంధాల్లో కాలిపోతున్న పేగుబంధాల
మాడువాసనల్ని మనసు పసిగట్టలేదు
సిటిజన్ కన్నా 'నెటిజన్' హోదానే విలువైనదిప్పుడు
గుడుగుడు గుంచాల్నీ కోతికొమ్మచ్చుల్నీ
గతంలోకి జార్చుకొన్న పిల్లల ఆకుపచ్చని బాల్యం
కంప్యూటర్ స్క్రీన్లపై ఎడారి ఒంటె అవుతుంది
ఆత్మీయతలకి పట్టిన వైరస్ బతుకును బుట్టదాఖలు చేస్తుంది
ఆన్‌లైన్‌లోకి వచ్చిన అతిథికి చాట్ పళ్ళెంలో హారతిపట్టి
పలకరించే వేలిస్పర్శలకి సంప్రదాయం నీరు కారిపోతుంది
ఇప్పుడు కంప్యుటరంటే సూటు వేసుకొచ్చిన సురధేనువనీ
ఇంటర్నెట్ అంటే ఆ ధేనువు కురిపించే
క్షీరామృతధారలేననుకొనే లోకంలో
వ్యక్తికో ప్రపంచం నీడై కాటేస్తుంది
ఆ ప్రపంచంలో నువ్వూ నేనూ చిగురించని చెట్టు మీద
వెనక్కి తిరిగిన ప్రగతిపాదాలను చీకట్లో కొమ్మలకి తగిలించి
తలక్రిందులుగా వేళ్ళాడుతుంటాం.

*- డాక్టర్ అద్దంకి శ్రీనివాస్*



Sthanka_JanBW.indd 18 30/12/10 3:03 PM

# సూక్ష్మఋణం లాభమా ? భారమా ?

గత రెండు నెలలుగా మన రాష్ట్రంలో ముమ్మరంగా చర్చించుకొంటున్న విషయం సూక్ష్మఋణాలు, ఆత్మహత్యలు. ఏ వార్తా పత్రికలు చూసినా, ఏ టీవీ ఛానెల్ పెట్టినా, ఏ ఇద్దరు ముగ్గురు కలసినా చర్చించుకుంటున్న విషయం సూక్ష్మ ఋణాలు, ఆత్మహత్యలు. అసలు సూక్ష్మఋణాలు అంటే ఏమిటి? వీటిని ఎవరు ఎవరికి ఇస్తున్నారు? ఋణగ్రహీతలు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఋణ గ్రహీతలు ఆత్మహత్యలు చేసుకోకుండా ఉండాలి అంటే ఏమి చేయాలి అనే విషయాలను కూలంకషంగా ఈ శీర్షికలో తెలుసుకుందాము.

"అప్పు తప్పు కాదు" అప్పు చేయని వారు ఎవరూ ఉండరు. ఏదో ఒక సందర్భంలో ప్రతి ఒక్కరు ఎవరో ఒకరి దగ్గర అప్పు తీసుకుంటుంటాము. మళ్ళీ వాటిని తిరిగి ఇస్తూ ఉంటాము. కాని ఆ తీసుకున్న అప్పు ఎలాంటి పరిస్థితులలో తీసుకున్నాము. దాని వలన మన కుటుంబానికి ఏమైనా మేలు జరిగిందా లేదా ఆ అప్పును తిరిగి చెల్లించామా లేదా అనేది ముఖ్యం.

అయితే సూక్ష్మ ఋణాలు పేదరిక నిర్మూలనకు ఒక సాధనం వంటిది. మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశం మరియు ఇప్పటికీ 68% ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. అయితే పేదరిక నిర్మూలనకు మన కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు వివిధ రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటకీ అర్హులైన పేదవారికి ఆ పథకాలు అందక, వలసలు పోతూ దుర్భరమైన జీవితాలను గడుపుతున్న వారు చాలామంది లేకపోలేదు ఈ సమాజంలో.

ఇలాంటి పరిస్థితులలో, ముఖ్యంగా మన రాష్ట్రంలో పేదరిక నిర్మూలన చేయాలని, మహిళా సాధికారత పెంచాలనే ఉద్దేశ్యంతో, మహిళలను సంఘాలుగా చేసి (యస్.హెచ్.జి) వారి స్థోమతను బట్టి పొదుపు చేసుకోవటం, ఆ పొదుపును గ్రూపు సభ్యులు అవసరానికి అనుగుణంగా రుణంగా తీసుకోవటం ఆ అప్పును వడ్డీతో సహా తిరిగి గ్రూపునకు చెల్లించటం ఆ వివరాలను పుస్తకాలలో వ్రాసుకోవటం నెలలో ఒకటి రెండు మారులు గ్రూపు సభ్యులందరూ కలిసి చర్చించుకొని సంఘ సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ దేశంలోనే అగ్రగామిగా నిలిచారు. అయితే ఈ మహిళా సంఘాలను ప్రోత్సహించాలి. వారి కాళ్ళపై వారు నిలబడి వారి కుటుంబాన్ని ముందుకు తీసుకుపోవాలనే ఉద్దేశ్యంతో బ్యాంకులు, రాష్ట్ర ప్రభుత్వం వారికి ఋణాలను మంజూరు చేయసాగాయి. ఈ తీసుకున్న ఋణాలతో కొంతమంది మాత్రమే చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ, తాము తీసుకున్న అప్పును తిరిగి చెల్లిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోగలిగారు.

ఇలాంటి చక్కటి పరిస్థితులను గమనించిన సూక్ష్మ ఋణ సంస్థలు, ప్రైవేటు బ్యాంకుల నుండి తక్కువ వడ్డీకి అప్పులు తీసుకొచ్చి, స్వయం సహాయక సంఘ సభ్యులను మళ్ళీ వారికి అనుకూలంగా ప్రతి ఐదు మందిని ఒక గ్రూపుగా చేసి వారిలో తీసుకున్న అప్పు ఎవరు చెల్లించకపోయినా మిగిలిన వారు చెల్లించే విధంగా ఒప్పందము కుదుర్చుకొని ప్రతి సభ్యురాలికి 25000/- తగ్గకుండా ఋణాలను





SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p2nd 12/30/2010, 4:09 PM

అందించడం జరిగింది. అయితే, ఈ సూక్ష్మ ఋణసంస్థలు చేయబోయే మోసాన్ని ఈ అమాయక ప్రజలు తెలుసుకోలేక పోవటం వలన (పిల్లపెళ్ళి, ఇల్లు, కట్టుకొనుట, విలాసవంతమైన వస్తువులు కొనుట, ఆరోగ్యపరమైన విద్య వంటివి), ఋణము భారమై కొంతమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ఈ మోసాన్ని గమనించిన కొంతమంది అధికారులు సూక్ష్మ ఋణాల సంస్థల కార్యాలయాలపై దాడులు చేసి వారి రికార్డులను సీజ్ చేయటం జరిగింది. అప్పుడు మన రాష్ట్రంలో ఉన్న సూక్ష్మ ఋణ సంస్థలు అప్పటి రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌ని కలిసి ఢిల్లీలో ఒక సదస్సును నిర్వహించటం జరిగినది. ఆ సదస్సుకు అప్పటి ఆర్థిక శాఖామాత్యులు ముఖ్య అతిథిగా, రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్, వివిధ బ్యాంకు అధికారులు సూక్ష్మ ఋణ సంస్థల ప్రతినిధులు హాజరుకావటం జరిగింది. ఈ సదస్సులో ప్రతినిధులు తెలియజేసిన సారాంశం ఏమిటంటే, బ్యాంక్ నుండి ఋణాలు పొందాలి అంటె ఎంత కష్టమో ఎవరికీ తెలియంది కాదని, బ్యాంక్ నుండి ఋణము పొందుకోరు మనిషి ఎన్ని పనిదినాలను పోగొట్టుకొని బ్యాంకుల చుట్టూ తిరగాలో మరియు ప్రభుత్వ ఉద్యోగుల హామీ పత్రము ఎంతకష్టమో మనకు తెలుసని, ఇలాంటి పరిస్థితులలో సూక్ష్మ ఋణ సంస్థలు ఋణాలను అందించటంలో తప్పులేదని, వాటిని తెలుసుకొని పేదరికం నుండి బయటికు రావాలని చెప్పటం జరిగినది.

దాంతో అప్పటి నుండి వారి కార్యక్రమాలు ఇంకా అభివృద్ధి చెందటం మొదలైనది. అంతే కాకుండా రోజు వారీ వ్యాపారం చేసుకొనే వారు వడ్డీ వ్యాపారస్తుల నుండి ఉదయం 100 రూ. తీసుకుంటే సాయంత్రానికి 110/- రూ. తిరిగి చెల్లిస్తున్నారు. అంటే అది ఎంత పెద్ద వడ్డీనో మనందరికీ తెలుసు. ఇప్పటికీ కొన్ని చిన్న చిన్న పట్టణాలలో ఈవిధమైన లావాదేవీలు నడుస్తూనే ఉన్నాయి. క్రెడిట్ కార్డు ఉండటం అనేది ఈరోజున సంఘములో ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అయితే ఎంతోమంది విద్యావంతులు, మేధావులు, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగస్తులు ఇచ్చిన ప్రతి బ్యాంక్ నుండి క్రెడిట్‌కార్డును తీసుకుని ఎడాపెడా వాటిని వాడి వారు చేసిన బారువ వడ్డీ, చక్రవడ్డీలు తిరిగి చెల్లించలేక సమాజంలో అభాసుపాలై క్రెడిట్ కార్డు అంటే ఎంత మోసమో తెలుసుకొని నలుగురికి చెప్పగలుగుతున్నారు. అయితే అప్పు ఇవ్వటము తీసుకోవటము తప్పుకాదు. కాని వాటిని ఎలా వాడాలి, ఎలాంటి వాటికి ఖర్చుపెట్టాలి అనేది ముఖ్యము.

అలాగే గ్రామాలలో సూక్ష్మఋణాలు తీసుకున్న మహిళలు ఆలోచించి ఋణాలను తీసుకోవాలి. ఆ ఋణాలను ఎలాంటి జీవనోపాధి కార్యక్రమానికి ఉపయోగించాలి తీసుకున్న ఋణంతో నా కుటుంబాన్ని ఎలా పేదరికం నుండి బయటకు తీసుకురావాలి? సంఘంలో మంచి వ్యక్తులుగా జీవించాలి అంటే ఏ కార్యక్రమాన్ని చేపట్టాలి, దానికి కావలసిన కారకాలు ఏమిటి అని తెలుసుకొని మొదలు పెడితే మీరు సుస్థిరమైన జీవనోపాధిని పొందుతూ పేదరికము నుండి బయట పడటమే కాకుండా నలుగురికి ఆదర్శప్రాయంగా నిలిచిన వారవుతారు. సుస్థిరమైన జీవనోపాధిని ప్రారంభించటానికి కావలసిన ముఖ్యమైన కారకాలు 1) పెట్టుబడి 2) నైపుణ్యము 3) ముడిసరుకు లభ్యత 4) అనుసంఘిక సేవలు 5) మార్కెట్

### 1. పెట్టుబడి (ఫైనాన్సు)

మనము చేపట్టబోయే కార్యక్రమము ఏమిటి? దానికి ఎంత పెట్టుబడి అవసరం ఉంటుంది. మన దగ్గర ఎంత ఉంది? మిగిలిన ఎంత పెట్టుబడిని ఎవరి దగ్గర నుండి ఎంత వడ్డీ మేరకు పొందాలి. తిరిగి చెల్లించే విధానం వారం వారం తిరిగి చెల్లించేటటువంటి కార్యక్రమమా లేక పక్షానికొకసారి లేక నెలకొకసారి తిరిగి చెల్లించేదా అనే విషయాలను కూలంకషంగా చర్చించి, ఋణాలను పొందాలి. లేదంటే మనము అప్పుల పాలవటమే కాకుండా చాలా కష్టాలను ఎదుర్కొనవలసి వస్తుంది.

### 2. నైపుణ్యం (స్కిల్)

మరి ఈ చేపట్టబోయే కార్యక్రమంలో మనకు ఎటువంటి నైపుణ్యం వుంది. మనకై మనము చేయగలమా లేక ఎవరి పైనైనా ఆధారపడి చేయగలుగుతున్నామా అని తెలుసుకొని మనకు పూర్తి నైపుణ్యము ఉన్న కార్యక్రమాన్ని చేయగలిగితే ఎక్కువ లాభాన్ని పొందటమే కాకుండా కార్యక్రమానికి ఎలాంటి ఆటంకం కలుగదు.

### 3. ముడిసరుకు లభ్యత

మరి మనము చేపట్టబోయే కార్యక్రమానికి కావలసిన ముడిసరుకు మన గ్రామం లేదా మన దగ్గరలో లభిస్తుందా? అని తెలుసుకొని, మరి ఆ ముడి సరుకులతో తయారైన వస్తువులకు గిరాకి ఉంటుందా లేదా అని తెలుసుకొని కార్యక్రమాన్ని చేపట్టటం మంచిది.

### 4. అనుసంఘిక సేవలు (సపోర్టు సర్వీసులు)

మనము చేపట్టబోయే కార్యక్రమానికి కావలసిన అనుసంఘిక సేవలు ఏమిటి? అవి ఎక్కడ నుండి పొందబడతాయి అని తెలుసుకొని కార్యక్రమాన్ని చేపట్టవలెను. ఉదా: పాడి పరిశ్రమకు కావలసిన అనుసాంఘిక సేవలు, పశువుల డాక్టరు లేదా గోపాలమిత్ర ఉన్నారా లేదా, మరియు పాలు కొనటానికి పాల కేంద్రము ఉన్నదా లేదా అని తెలుసుకొని కార్యక్రమాన్ని చేపట్టటం మంచిది.

### 5. మార్కెట్

మార్కెట్ అనేది చాలా ముఖ్యమైనది. మనం ఏ కార్యక్రమము చేసినా మనం ఉత్పత్తి చేసిన వస్తువులు అమ్ముడు పోకపోతే చేసిన పని అంతా వృధా అవుతుంది. మార్కెట్ బాగా ఉండి వస్తువులను అమ్ముకొనగలిగితే ఆదియును మన గ్రామములో గాని చుట్టు ప్రక్కల గ్రామాలలో గాని చేయగలిగితే ఎక్కువ లాభాలు పొందటమే కాకుండా, అందరితో పరిచయాలు పెరిగి మనము చేపట్టిన పని శాశ్వతంగా మనగలుగుతుంది.

ఎందరో వీర నారీమణులు పుట్టిన మన తెలుగు గడ్డపై ఎదిరించాలే గాని భయపడి ఆత్మహత్యలు చేసుకోరాదని, ఋణాలను పొందే ముందే వారితో అన్ని విషయాలను చర్చించి వారం వారం కాకుండా పక్షానికి ఒకసారి లేదా నెలకొకసారి తిరిగి చెల్లించే విధంగా మాట్లాడి, మంచిగా ఆదాయం ఇచ్చే కార్యక్రమాలను చేపట్టి మీమీ కుటుంబాలను పేదరికం నుండి బయటకు తెస్తూ, పేదలు లేని దేశంగా చేస్తారని మా ప్రగాఢ విశ్వాసం.

***- పి. రమేష్, సి.యన్.ఆర్.యమ్***



SthanikaPalanaTel_January_2010_B&W_CrF.pmd 12/30/2010, 4:09 PM

# రాష్ట్రంలో నూతన మంత్రివర్గం

### శ్రీ ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ రామనారాయణరెడ్డి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. ఆయన కుటుంబం అయిదు దశాబ్దాల నుంచి రాజకీయాలలో ఉంది. గతంలో ఆర్అండ్‌బి మంత్రిగాను, సమాచారశాఖ మంత్రిగా, టూరిజంశాఖ మంత్రిగా, పురపాలకశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఆర్థికశాఖను నిర్వహిస్తున్నారు. పుట్టిన తేదీ: 10.07.1952 చదువు: బీకాం, బీఎల్ రాజకీయ నేపథ్యం: రాజకీయ కుటుంబం. 1985లో తెలుగుదేశం తరపున రాపూరు నుంచి గెలుపు. ఎన్‌టీఆర్ మంత్రివర్గంలో పనిచేశారు. 1999, 2004లలో రాపూరు నుంచి, 2009లో ఆత్మకూరు నుంచి ఎన్నిక.

### శ్రీమతి డి.కె. అరుణ



ఇంటర్ వరకూ విద్యనభ్యసించిన శ్రీమతి డి.కె. అరుణ రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. రెండుసార్లు శాసనసభకు ఎన్నికైన ఈమె ప్రస్తుతం సమాచారశాఖ మంత్రిగా ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పుట్టిన తేదీ: 04.05.1960 చదువు: ఇంటర్మీడియట్ రాజకీయ నేపథ్యం: 1996 మార్చిలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి, 2004లో సమాజ్‌వాదీ పార్టీ తరపున, 2009లో కాంగ్రెస్ తరపున శాసనసభకు ఎన్నిక. చక్కెర, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారు.

### శ్రీమతి గల్లా అరుణకుమారి



చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నుంచి శాసనసభకు రెండుసార్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీమతి అరుణకుమారి గతంలో వైద్య, విద్యాశాఖా మంత్రిగా పనిచేశారు. రహదారులు, భవనాలశాఖా మంత్రిగా పనిచేసి, ప్రస్తుతం గనులు, భూగర్భశాఖను నిర్వహిస్తున్నారు. పుట్టిన తేదీ: 20.09.1943 చదువు: డిగ్రీ రాజకీయ నేపథ్యం: 1989, 1999, 2004, 2009లలో శాసనసభకు ఎన్నికయ్యారు. 2007-09 మధ్య వైద్యవిద్యశాఖ మంత్రిగా, 2009 నుంచి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

### శ్రీ పి. బాలరాజు



విశాఖపట్నం జిల్లా పాడేరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ బాలరాజు ఎం.ఏ (సోషియాలజీ) పట్టభద్రులు. రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గతంలో గిరిజన సంక్షేమ శాఖామంత్రిగా పనిచేశారు. పుట్టిన తేదీ: 12.06.1962 చదువు: ఎస్ఎస్ఎల్‌సీ రాజకీయ నేపథ్యం: 1989, 2009ల్లో పాడేరు నుంచి ఎన్నిక. గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

### శ్రీ బస్వరాజు సారయ్య



వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సారయ్య ఎస్ఎస్‌సి వరకూ విద్యనభ్యసించారు. మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గతంలో బిసి వెల్ఫేర్‌పై హౌస్‌కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. పుట్టిన తేదీ: 05.12.1955 చదువు: ఐటీఐ రాజకీయ నేపథ్యం: 1999, 2004, 2009లలో వరంగల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1981లో మున్సిపల్ కౌన్సిలర్‌గా, 1987, 1988లలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. 1991 నుంచి 1997 వరకు ఆరేళ్లపాటు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు.

### శ్రీ బొత్స సత్యనారాయణ



విజయనగరం జిల్లా చీపురుపల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సత్యనారాయణ గతంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. 2004లో తొలిసారి మంత్రి పదవి చేపట్టి, ప్రస్తుతం రవాణాశాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. పుట్టిన తేదీ: 09.07.1958 చదువు: డిగ్రీ రాజకీయ నేపథ్యం: రెండుసార్లు డీసీసీబీ అధ్యక్షుడు. 1999లో బొబ్బిలి ఎంపీ. 2004, 2009ల్లో చీపురుపల్లి నుంచి ఎమ్మెల్యే. 2004 నుంచి రాష్ట్రమంత్రి. భారీపరిశ్రమలు, మార్కెటింగ్, గృహనిర్మాణం, పంచాయతీరాజ్ శాఖలు చూశారు.

### శ్రీ డి.ఎల్. రవీంద్రారెడ్డి



కడప జిల్లా మైదుకూరు శాసనసభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ రవీంద్రారెడ్డి ఆరుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ఎంబిబిఎస్ పట్టభద్రులైన ఈయన గతంలో రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖలను నిర్వహించారు. ప్రస్తుతం వైద్యఆరోగ్య శాఖను నిర్వహిస్తున్నారు.



SthanikaPalanaTel_January_2010_COLOUR.pmd 12/30/2010, 1:06 PM

## శ్రీ దామోదర్ రాజనరసింహ



ఇంజనీరింగ్ పట్టభద్రులైన శ్రీ రాజనరసింహ మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పుట్టిన తేదీ: 05.12.1958 చదువు: బీఈ రాజకీయ నేపథ్యం: 1989, 2004, 2009లలో ఆందోల్ నుంచి గెలుపొందారు. పాఠశాలవిద్య, మార్కెటింగ్ శాఖల మంత్రిగా పని చేశారు.

## శ్రీ దానం నాగేందర్



ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకూ నాలుగుసార్లు శాసనసభకు ఎన్నికైనారు. 1994లో తొలిసారిగా శాసనసభకు ఎన్నికయిన శ్రీ నాగేందర్ గతంలో వైద్యశాఖా మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం కార్మిక శాఖను నిర్వహిస్తున్నారు.

పుట్టిన తేదీ: 24.09.1963 చదువు: ఎంఏ రాజకీయ నేపథ్యం: 1994, 1999ల్లో ఆసిఫ్‌నగర్ నుంచి ఎన్నిక. 2004లో తెదేపా నుంచి గెలుపు. తరువాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2009లో ఖైరతాబాద్ నుంచి గెలుపు. ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు.

## శ్రీ ధర్మాన ప్రసాదరావు



సామాజిక సేవా కార్యక్రమాల్లో పేరు గడించిన శ్రీ ప్రసాదరావు ఇప్పటివరకూ నాలుగుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గ్రామపంచాయితీ అధ్యక్షుడిగా పనిచేసిన ఈయన గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖామంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రహదారులు భవనాల శాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 21.05.1958 చదువు: ఇంటర్మీడియట్ రాజకీయ నేపథ్యం: 1989, 1999లలో నరసన్నపేట, 2004, 2009ల్లో శ్రీకాకుళం నుంచి ఎన్నిక. యువజన సర్వీసులు, క్రీడలు, మధ్యతరహా నీటిపారుదల, పోర్టులు, రెవెన్యూశాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

## శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్



గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిఎస్సీ, ఎల్ఎల్ఎం పట్టభద్రుడైన శ్రీ మాణిక్య వరప్రసాద్ రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 05.03.1962 చదువు: బీఎస్సీ, ఎల్ఎల్ఎం రాజకీయ నేపథ్యం: 2004, 2009లలో గుంటూరు జిల్లాలోని తాడికొండ నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

## శ్రీ ఏరాసు ప్రతాప్‌రెడ్డి



కర్నూలు జిల్లా శ్రీశైలం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ ప్రతాప్‌రెడ్డి బిఎస్సీ, ఎల్ఎల్‌బిలో పట్టభద్రులు. మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ఈయన తండ్రి అయ్యపురెడ్డి ప్రముఖ న్యాయవాది. ప్రస్తుతం ప్రతాప్‌రెడ్డి న్యాయశాఖను నిర్వహిస్తున్నారు.

పుట్టిన తేదీ: 15.10.1949 చదువు: బీఎస్సీ, ఎల్ ఎల్ బీ రాజకీయ నేపథ్యం: తండ్రి అయ్యపురెడ్డి కేంద్ర మాజీమంత్రి. 1994, 2004, 2009లలో ఆత్మకూరు, శ్రీశైలంల నుంచి ఎన్నిక. సీఎల్‌పీ కార్యదర్శిగా వ్యవహరించారు.

## శ్రీమతి జె. గీతారెడ్డి



మెదక్ జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీమతి గీతారెడ్డి ఎంబిబిఎస్ డాక్టర్‌గా సుపరిచితులు. వైద్య వృత్తి నుంచి వచ్చిన ఈమె సామాజిక సేవలో పేరు ప్రఖ్యాతులు గడించారు. 1989-91లోను, 1992-94లోను రెండు సార్లు మంత్రిగా పనిచేసిన ఈమె 2004 నుంచి మంత్రివర్గంలో సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం భారీపరిశ్రమల శాఖాను నిర్వహిస్తున్నారు. చదువు: ఎంబీబీఎస్ రాజకీయ నేపథ్యం: 1985లో కాంగ్రెస్‌లో చేరారు. 1989, 2004లో గజ్వేల్ నుంచి, 2009లో జహీరాబాద్ నుంచి ఎన్నిక. 1989-1994, 2004-2009 మధ్య సమాచార, సాంస్కృతిక, క్రీడలు, పర్యాటక, భారీ పరిశ్రమలు, చక్కెరశాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

## శ్రీ కుందూరు జానారెడ్డి



ఆరుసార్లు శాసనసభకు ఎన్నికైన ఈయన నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వ్యవసాయ ప్రధానమైన కుటుంబం నుంచి వచ్చినా, రాజకీయాలే వృత్తిగా పనిచేస్తున్నారు. రవాణా, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, పంచాయితీరాజ్ శాఖలను నిర్వహించిన శ్రీ జానారెడ్డి హోంమంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం పంచాయితీరాజ్ శాఖామంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 20.06.1946 చదువు: ఇంటర్ రాజకీయ నేపథ్యం: 1983, 1985, 1989, 1999, 2004ల్లో చలకుర్తి నుంచి, 2009లో నాగార్జున సాగర్ నుంచి ఎన్నిక. జనతాపార్టీతో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1983లో తెలుగుదేశం పార్టీలో చేరిక. 1987లో తెలుగునాడు పార్టీ స్థాపన. తర్వాత కాంగ్రెస్‌లోకి వచ్చారు. వ్యవసాయం నుంచి హోం వరకు పలు మంత్రిత్వశాఖల నిర్వహణ.

## శ్రీ జూపల్లి కృష్ణారావు



మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ కృష్ణారావు బి.ఏ. వరకూ విద్య నభ్యసించారు. మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గతంలో పౌరసరఫరాల శాఖకు ప్రాతినిధ్యం వహించిన శ్రీ జూపల్లి కృష్ణారావు ప్రస్తుతం దేవాదాయశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 10.08.1955

చదువు: బీకాం రాజకీయ నేపథ్యం: 1999, 2009లలో కాంగ్రెస్ తరపున, 2004లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపు. పౌరసరఫరాలశాఖ మంత్రిగా పని చేశారు.



SthanikaPalanaTel_January_2010_COLOUR.p12d 12/30/2010, 1:06 PM

## శ్రీ కన్నా లక్ష్మీ నారాయణ



గుంటూరు జిల్లా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ లక్ష్మీనారాయణ బి.కాం. పట్టభద్రులు. అయిదుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గతంలో ఏపిసి చైర్మన్‌గాను, సహకారశాఖా మంత్రిగా పనిచేశారు.

పుట్టిన తేదీ: 13.08.1955

చదువు: బీకాం

రాజకీయ నేపథ్యం: 1989, 1994, 1999, 2004ల్లో పెదకూరపాడు నుంచి, 2009లో గుంటూరు పశ్చిమ నుంచి ఎన్నిక. 1989-1994 మధ్యకాలం, 2004 నుంచి మంత్రిగా బాధ్యతలు. సహకారం, రవాణా, భారీ పరిశ్రమల శాఖలు.

## శ్రీ మోపిదేవి వెంకటరమణరావు



గుంటూరు జిల్లా రేపల్లె నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ వెంకటరమణరావు మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. బి.ఏలో పట్టభద్రులైన ఈయన గతంలో ఓడరేవులు, పౌర విమానాశ్రయాలు, ఇన్‌వెస్ట్‌మెంట్ శాఖా మంత్రిగా పనిచేశారు.

పుట్టిన తేదీ: 20.08.1964 చదువు: బీఏ రాజకీయ నేపథ్యం: 1989, 1994లలో కూచినపూడి నుంచి పోటీచేసి ఓడిపోయారు. 1999, 2004లలో కూచినపూడి, 2009లో రేపల్లె నుంచి వరుసగా విజయం సాధించారు. 2007-09 మధ్య విమానాశ్రయాలు, ఓడరేవులు, మౌలిక సదుపాయాల శాఖ, 2009లో సాంకేతికవిద్య, న్యాయశాఖ.

## శ్రీ కాసు వెంకటకృష్ణారెడ్డి



గుంటూరు జిల్లా నర్సారావుపేట నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ కృష్ణారెడ్డి బిఎస్సీలో పట్టభద్రులు. మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గతంలో పౌరసరఫరాలశాఖా మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం సహకారశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 28.09.1947

చదువు: బీఎస్సీ

రాజకీయ నేపథ్యం: 1989, 1991లలో నరసారావుపేట నుంచి ఎంపీగా, 1978, 2004, 2009ల్లో ఎమ్మెల్యేగా ఎన్నిక. 2007లో పౌరసరఫరాల మంత్రిగా బాధ్యతల నిర్వహణ.

## శ్రీ ఎమ్. ముఖేష్ గౌడ్



హైదరాబాద్‌లోని ఘోషామహల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ ఎమ్. ముఖేష్‌గౌడ్ మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గత ప్రభుత్వంలో బిసి సంక్షేమ శాఖామంత్రిగా పనిచేశారు.

పుట్టిన తేదీ: 01.07.1958

చదువు: బీఏ, ఎల్ ఎల్ బీ

రాజకీయ నేపథ్యం: 1986లో జాంబాగ్ కార్పొరేటర్‌గా, 1989, 2004, 2009ల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పని చేశారు.

## శ్రీ కె. పార్థసారథి



కృష్ణాజిల్లా పెనమలూరు నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. బి.టెక్ పట్టభద్రులైన శ్రీ కె. పార్థసారథి పశుసంవర్ధకశాఖా మంత్రిగా పనిచేశారు.

పుట్టిన తేదీ: 18.04.1965

చదువు: బీఈ రాజకీయ నేపథ్యం: 2001లో ఉయ్యూరు ఉప ఎన్నికల్లో ఓటమిపాలైన ఆయన, అక్కడే 2004లో విజయం సాధించారు. 2009లో పెనమలూరు నుంచి గెలుపొందారు. 2009లో పశుసంవర్ధక శాఖ మంత్రిగా నియమితులయ్యారు. తాజాగా మాధ్యమిక విద్యాశాఖ మంత్రిగా నియమితులయ్యారు.

## శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ఇంజనీరింగ్ పట్టభద్రుడైన శ్రీ వెంకటరెడ్డి మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. నల్గొండ నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం పోర్టులు, ఇన్‌వెస్ట్‌మెంట్ శాఖను నిర్వహిస్తున్నారు.

పుట్టిన తేదీ: 23.05.1963

చదువు: ఇంజనీరింగ్

రాజకీయ నేపథ్యం: 1999, 2004, 2009లలో నల్గొండ నుంచి శాసనసభకు ఎన్నిక. ఐటీ, క్రీడలశాఖ మంత్రిగా బాధ్యతల నిర్వహణ.

## శ్రీ మానుగుండ మహీధర్ రెడ్డి



ప్రకాశం జిల్లా కందుకూరు శాసనసభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ మహీధర్‌రెడ్డి బి.కాం., ఎల్ఎల్‌బి చేశారు. మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం పురపాలకశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 21.06.1957 చదువు: బీకాం, ఎల్ ఎల్ బీ

రాజకీయ నేపథ్యం: తండ్రి ఆదినారాయణరెడ్డి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చారు. 1989, 2004, 2009ల్లో కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

## శ్రీ పితాని సత్యనారాయణ



పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సత్యనారాయణ బి.కాం పట్టభద్రులు. రెండుసార్లు శాసనసభకు ఎన్నికైన ఈయన ప్రస్తుతం సాంఘిక సంక్షేమశాఖను నిర్వహిస్తున్నారు.

పుట్టిన తేదీ: 09.12.1954 చదువు: బీకాం రాజకీయ నేపథ్యం: 1990లో పాలకొల్లు షుగర్స్ యాజమాన్య కమిటీ ఉపాధ్యక్షుడిగా, 1991 నుంచి 1994 వరకు రాష్ట్ర స్పిన్‌ఫెడ్ చైర్మన్‌గా పని చేశారు. 2004లో పెనుగొండ, 2009లో ఆచంట నుంచి గెలుపు. ఆరోగ్యశ్రీశాఖ మంత్రిగా వ్యవహరించారు.



SthanikaPalanaTel_January_2010_COLOUR.p18d 12/30/2010, 1:06 PM

## శ్రీ పొన్నాల లక్ష్మయ్య



శ్రీ పొన్నాల లక్ష్మయ్య: ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన శ్రీ లక్ష్మయ్య వరంగల్ జిల్లా జనగాం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1991-92లో ఒకసారి మంత్రిగా పనిచేశారు. 2004 నుంచి భారీ నీటిపారుదల శాఖామంత్రిగా పనిచేసి ప్రస్తుతం ఐటి శాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 15.02.1944 చదువు: ఎం.ఎస్. (అమెరికా)

రాజకీయ నేపథ్యం: 1989, 1999, 2004, 2009 ఎన్నికల్లో గెలుపొందారు. కీలకమైన భారీనీటిపారుదల శాఖ మంత్రిగా పని చేశారు. ఉన్నత విద్యావంతుడు.

## డాక్టర్. సాకె శైలజానాథ్



అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డాక్టర్. శైలజానాథ్ ఎంబిబిఎస్ పట్టభద్రులు. రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గతంలో ప్రభుత్వవిప్‌గా పనిచేశారు. ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 28.03.1964 చదువు: ఎంబీబీఎస్, ఎండీ

రాజకీయ నేపథ్యం: శింగనమల నుంచి 2004, 2009ల్లో శాసనసభ్యునిగా ఎన్నిక.

## శ్రీ నీలకంఠాపురం రఘువీరారెడ్డి



అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ రఘువీరారెడ్డి నాలుగుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. వ్యవసాయశాఖా మంత్రిగా గతంలో పనిచేశారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖామంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 12.02.1957 చదువు: బీఎస్సీ, బీఎల్

రాజకీయ నేపథ్యం: 1989, 1999, 2004లలో మడకశిర నుంచి గెలుపు. 2009లో కళ్యాణదుర్గం నుంచి ఎన్నిక. 1989-1994 మధ్య, 2004 నుంచి ఇప్పటివరకు మంత్రిగా పనిచేశారు. పశుసంవర్ధక, వ్యవసాయ శాఖలు నిర్వర్తించారు.

## శ్రీ శత్రుచర్ల విజయరామరాజు



శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1978 నుంచి శాసనసభకు ఆరుసార్లు ఎన్నికయ్యారు. గతంలో అటవీశాఖా మంత్రిగాను, రవాణాశాఖా మంత్రిగాను పనిచేశారు. ప్రస్తుతం అటవీశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 04.08.1948

చదువు: పీయూసీ

రాజకీయ నేపథ్యం: 1978లో జనతా, 1983, 1985లలో కాంగ్రెస్ తరఫున నాగూరు నుంచి ఎమ్మెల్యేగా, 1989, 1991లలో పార్వతీపురం నుంచి ఎంపీగా, 1998లో తెదేపా ఎంపీగా, 2004లో పార్వతీపురం నుంచి, 2009లో పాతపట్నం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక. అటవీ, పర్యావరణ, రవాణా మంత్రిగా పనిచేశారు.

## శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డి



వ్యవసాయం ప్రధానమైన వృత్తిగా ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వెంకటరెడ్డి నాలుగుసార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బి.ఏ. పట్టభద్రుడైన ఈయన గతంలో కార్మిక శాఖామంత్రిగా పనిచేశారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పుట్టిన తేదీ: 22.05.1944 చదువు: బీఏ

రాజకీయ నేపథ్యం: 1996 ఉప ఎన్నికలు, 1999, 2004లలో సుజాతానగర్ నుంచి విజయం. 2009లో పాలేరు నుంచి గెలుపు. సహకారశాఖ మంత్రిగా పనిచేశారు.

## డాక్టర్. పి. శంకరరావు



ప్రస్తుత శాసనసభలోని సీనియర్ శాసనసభ సభ్యులలో ఈయన ఒకరు. అయిదుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. 1992లో మైనర్ ఇరిగేషన్ శాఖా మంత్రిగా పనిచేసిన డాక్టర్. శంకరరావు సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం చేనేత శాఖామంత్రిగా పనిచేస్తున్నారు.

పుట్టిన తేదీ: 20.04.1948 చదువు: ఎంబీబీఎస్

రాజకీయ నేపథ్యం: 1983, 1989, 1999, 2004లలో షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో కంటోన్మెంట్ నుంచి ఎన్నిక. 1991-1994 మధ్య రాష్ట్ర మంత్రిగా పని చేశారు.

## శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి



మాజీమంత్రి శ్రీ ఇంద్రారెడ్డి సతీమణి అయిన సబితారెడ్డి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిఎస్సీ విద్యాభ్యాసం చేసిన ఆమె గతంలో చేవెళ్ళ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించి గనులు, భూగర్భశాఖా మంత్రిగా పనిచేసి 2009 నుంచి హోంశాఖా మంత్రిగా బాధ్యత వహిస్తున్నారు.

పుట్టిన తేదీ: 05.05.1963 చదువు: బీఎస్సీ

రాజకీయ నేపథ్యం: భర్త ఇంద్రారెడ్డి మరణంతో రాజకీయాల్లోకి ప్రవేశం. 2000, 2004లలో చేవెళ్ల నుంచి 2009లో మహేశ్వరం నుంచి ఎన్నిక. 2004 నుంచి మంత్రిగా గనులు, ఐటీ, జౌళి, చేనేత, హోంశాఖల నిర్వహణ

## శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



మాజీ స్పీకర్ శ్రీ దుద్దిళ్ళ శ్రీపాదరావు కుమారుడు శ్రీ శ్రీధర్‌బాబు కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శాసనసభకు మూడుసార్లు ఎన్నికయ్యారు. గతంలో ప్రభుత్వ విప్‌గాను, ఉన్నత విద్యాశాఖా మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం పౌరసరఫరాలు, శాసనసభ వ్యవహారాలు శాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 30.05.1969 చదువు: ఎంఏ, ఎల్ ఎల్ బీ

రాజకీయ నేపథ్యం: తండ్రి మరణానంతరం 1999లో రాజకీయాల్లోకి వచ్చారు. 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు.



SthanikaPalanaTel_January_2010_COLOUR.pmd 14 12/30/2010, 1:06 PM

## శ్రీ పి. సుదర్శన్ రెడ్డి



నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పటివరకూ మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన శ్రీ సుదర్శన్‌రెడ్డి బి.ఏ వరకూ విద్యనభ్యసించారు. గతంలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రిగా పనిచేసి, ప్రస్తుతం నీటిపారుదల శాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 02.08.1950 రాజకీయ నేపథ్యం: 1999, 2004, 2009ల్లో బోధన్ నుంచి ఎన్నిక. 2009 నుంచి ఇప్పటివరకు వైద్యవిద్యాశాఖ మంత్రిగా పనిచేశారు.

## శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి



మెదక్ జిల్లా నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి బిఎస్సీలో పట్టభద్రులు. మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 05.04.1968 చదువు: బీఎస్సీ

రాజకీయ నేపథ్యం: 1999, 2004, 2009ల్లో వరుసగా శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించారు. చిన్న నీటిపారుదలశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

## శ్రీ సయ్యద్ అహ్మదుల్లా



కడప జిల్లా కడప శాసనసభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సయ్యద్ అహ్మదుల్లా రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. మైనారిటీశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 15.06.1951

చదువు: ఎస్ఎల్ఎల్సీ రాజకీయ నేపథ్యం: 1977లో జిల్లా కాంగ్రెస్ కోశాధికారి. 2000లో కడప మున్సిపల్ ఛైర్మన్. 2004, 2009లలో కడప నుంచి శాసనసభకు ఎన్నిక. మైనారిటీ సంక్షేమశాఖ మంత్రిగా వ్యవహరించారు.

## శ్రీ టి. జి. వెంకటేష్



కర్నూలు జిల్లా కర్నూలు శాసనసభా నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన శ్రీ టి.జి. వెంకటేష్ రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం చిన్న నీటిపారుదల శాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 16.05.1950

చదువు: బీకాం రాజకీయ నేపథ్యం: 1999లో తెలుగుదేశం తరపున, 2009లో కాంగ్రెస్ తరపున కర్నూలు నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ఎస్‌టీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

## శ్రీ తోట నరసింహం



తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గం నుంచి ఎన్నికైన శ్రీ నరసింహం రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. బి.కాం పట్టభద్రుడైన శ్రీ నరసింహం తొలిసారిగా మంత్రి పదవి చేపట్టి స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖను నిర్వహిస్తున్నారు.

పుట్టిన తేదీ: 06.07.1962

చదువు: ఐసీడబ్ల్యూఏ

రాజకీయ నేపథ్యం: 2004, 2009 ఎన్నికల్లో గెలిచారు.

## శ్రీ వట్టి వసంత్‌కుమార్



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన శ్రీ వసంత్‌కుమార్ పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం నుంచి రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. గతంలో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా పనిచేశారు. బిఎస్సీలో పట్టభద్రుడైన ఈయన ఎంబిఏ కూడా చేశారు. ప్రస్తుతం టూరిజంశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 10.06.1953

చదువు: బీఎస్సీ, ఎంబీఏ రాజకీయ నేపథ్యం: 2004, 2009 ఎన్నికల్లో ఉంగుటూరు నుంచి ఎన్నిక. గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

## శ్రీ పి. విశ్వరూప్



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన శ్రీ విశ్వరూప్ అమలాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో గ్రామీణ నీటిసరఫరా శాఖామంత్రిగా పనిచేశారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారు. పాడి పశుసంవర్ధక శాఖామంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 02.10.1962 చదువు: బీఎస్సీ, బీఈడీ

రాజకీయ నేపథ్యం: పీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్‌గా పనిచేశారు. 2004లో ముమ్మిడివరం, 2009లో అమలాపురం నుంచి ఎన్నిక. గ్రామీణ నీటిసరఫరాశాఖ మంత్రిగా పనిచేశారు.

## శ్రీ వై.ఎస్. వివేకానందరెడ్డి



కడప జిల్లాకు చెందిన శ్రీ వై.ఎస్. వివేకానందరెడ్డి ఎమ్మెల్సీ. గతంలో కడప పార్లమెంటు సభ్యుడిగా ఉన్నారు. ప్రస్తుతం వ్యవసాయశాఖా మంత్రిగా ఉన్నారు.

పుట్టిన తేదీ: 01.04.1950

చదువు: బీఎస్సీ

రాజకీయ నేపథ్యం: 1989, 1994లలో రెండుసార్లు పులివెందుల నుంచి ఎమ్మెల్యేగా, 1999, 2004లలో కడప నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు.

*- టి. సురేష్ కుమార్*



SthanikaPalanaTel_January_2010_COLOUR.p65 12/30/2010, 1:06 PM



# ఆదివాసీల అభ్యున్నతికి రాజ్యాంగంలో పలు అధికరణలు

**శతాబ్దాల తరబడి తమ ఆహారం, నిలవనీడ, ఇంధనాల కోసం అడవులతో అనుబంధం కలిగి, కీకారణ్యాలలో నివసిస్తూ, వాటిని రక్షించుకుంటూ, పెంచుతున్న అదివాసీలు అనబడే గిరిజనులు, భారతీయ జీవన వ్యవస్థల పెంపుదలకు మూల పురుషులు అన్న సత్యం చాలామందికి తెలియదు. వీరు ఆది భారతీయ సంతతికి చెందినవారే!**

**ఈ ఆదివాసీలు ద్వాపర యుగంలో కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవ సేనలో వున్నట్లు ఆధారాలు ఉన్నాయి. భీముడికి భార్య, ఘటోద్కజునికి తల్లి అయిన హిడింబి ఒక గిరిజన యువతే!**

వ్యవసాయ రూపకల్పనకు మూలపురుషులు ఈ ఆదివాసీలే అన్న విషయం నేటి వ్యవసాయ శాస్త్రవేత్తలకు తెలుసా అన్న విషయం అనుమానమే! కొండకోనలలో, లోతులలో గిరిజనులు చేసే వ్యవసాయాన్ని పోడు వ్యవసాయం అంటారు. పౌరాణికంగాను లేదా చరిత్ర పరంగాను సంస్కృతీ, సంస్కారం కలిగిన ఈ గిరిజనుల ఉనికి నేడు ప్రశ్నార్ధకమైంది.

ముండా, నాగా, సహానియా, సంతాల్, భాల్లు, గోండు, సవర, కొండ సవర, జాతాపు, కొండరెడ్డి కోలాం, కోయ, చెంచు, యానాది, ఎరుకల మొదలైన 33 తెగలను ఈ ఆదివాసీలు కలిగివున్నారు.

'ది పీపుల్సు ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో, గ్రంథకర్త హెర్బర్టు రిస్లే ప్రభువులు గుర్తించిన ఆరు భారతీయ జాతులలో ఆదివాసీలను జాతులుగా గుర్తించక, కేవలం తెగలుగానే పేర్కొనడం జరిగింది.

దేశం మొత్తంలో వున్న అడవీ ప్రాంతంలో 74 శాతం అరణ్య ప్రాంతంలో అనగా 50 మిలియన్ హెక్టార్ల అరణ్య ప్రాంతంలో నివసిస్తున్న 80 మిలియన్ గిరిజనులకు సంబంధించిన 20 మిలియన్ కుటుంబాలకు, ఒక్కొక్క కుటుంబానికి బ్రతకడానికి 2.5 హెక్టార్ల అరణ్య భూమి కలిగివుండే అవకాశముంది.

భారతదేశ విస్తీర్ణంలో 20 శాతం ప్రాంతంలో గిరిజనులు నివసిస్తుంటే, ఆ 20 శాతం ప్రాంతంలోనే, దేశంలోని 70 శాతం ప్రకృతి వనరులు నిక్షిప్తమై వున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఖమ్మం, వరంగల్, కర్నూలు, ప్రకాశం, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాలలోని అడవీ ప్రాంతాలు, అరణ్య ప్రాంతాలలో గిరిజనులు నివసిస్తున్నారు.

గిరిజనుల సంక్షేమం, రక్షణ కోసం రూపొందించబడ్డ బయోడైవర్సిటీ ఆక్టు 2000 పూర్తిగా విఫలమైంది. పైగా, వన్యప్రాణి రక్షణ చట్టం-1972 (వైల్డు లైఫ్ ప్రొటెక్షన్ ఆక్టు-1972), అడవి సంరక్షణ చట్టం-1980 (ఫారెస్టు కన్‌సర్వేషన్ ఆక్టు -1980) ఈ రెండు చట్టాలు కూడా గిరిజనులకు అన్వయిస్తాయని, పై చట్టాలను అతిక్రమించిన వారికి 5000 రూపాయల జరిమానా, 30 రోజుల కారాగార శిక్షకు అర్హులవుతారు. ఇందుకు కారణం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం లోపించడమే!

గిరిజనులు నివసించే ప్రత్యేక ప్రాంతాలనబడే షెడ్యూల్డు ప్రాంతాల రక్షణకు చట్టాలు 1874, 1919, 1935 సంవత్సరాలలో రూపొందించబడ్డాయి. తత్సంబంధిత రాష్ట్ర గవర్నర్ ద్వారా గిరిజన భూములను భారత రాష్ట్రపతి కాపాడాలని భారత రాజ్యాంగం నిర్దేశించింది.

73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా అభివృద్ధి విధానాల అమలు కోసం దారాదత్తం చేయబడగా, పంచాయతీస్ ఎక్స్‌టెన్షన్ టుడే షెడ్యూల్డు ఏరియాస్ ఆక్టు -1996 (పి.ఇ.యస్.ఏ-1996) ద్వారా గ్రామ పంచాయతీలకు కేటాయిస్తున్న విధులు, సౌకర్యాలను గిరిజనులు నివసించే ప్రాంతాలకు కూడా విస్తరింపజేయడం జరిగింది.

1-70 చట్టం ప్రకారం గిరిజనుల భూములను ఆక్రమించిన భూస్వాముల కబ్జా నుండి ప్రత్యేక న్యాయ స్థానాల ద్వారా తిరిగి ఆ భూములను తత్సంబంధిత షెడ్యూల్డు తెగలకు ప్రభుత్వం ఇప్పించకపోగా, కబ్జా చేసిన భూస్వాముల కొమ్ము కాయడం జరిగింది.

గిరిజనుల అభ్యున్నతి కోసం పాటుపడిన గ్రామ వికాస్ అనే స్వచ్ఛంద సంస్థ తమ పరిధిలోని 60 గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసీలతో, 1980 దశకంలో ఉద్యమించి, ప్రజా కోర్టులను నిర్వహించి, కబ్జాలను ప్రోత్సహించిన ఫలితంగా, గిరిజనేతరులు, వర్తకులు, వడ్డీవ్యాపారస్తులు, మద్యం వ్యాపారస్తుల కబంద హస్తాల నుండి గిరిజనుల భూమిని విడిపించడంలో కొంతమేరకు విజయం సాధించడం జరిగింది.



Sthanka_Jan.colo.indd 24 30/12/10 2:43 PM

ఈ ఆదివాసీల సమస్యలను పరిష్కరించడానికి, వారి అభ్యున్నతికి చేయూతనివ్వడం కోసం భారత రాజ్యాంగంలో 20 కి పైగా అధికరణలు చోటు చేసుకున్నాయి.

**14వ అధికరణ :** అందరికీ సమానత్వం, సమాన అవకాశాలను కల్పించడం

**15వ అధికరణ :** సెక్సు, మతం, జాతి, కులం మొదలైన వాటి పరంగా ఏ పౌరుని ఎడల వివక్షత వుండరాదు.

**15(4) వ అధికరణ :** సామాజికంగాను, విద్యా పరంగాను వెనుకబడిన వారికి చేయూతనివ్వడం, (4) రాష్ట్ర ఉద్యోగ నియామకాలలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం.

**19(5)వ అధికరణ :** గిరిజనుల ఆస్థి పరిరక్షణా హక్కు కల్పన.

**23వ అధికరణ :** షెడ్యూల్డు ఏరియాలోని గిరిజన భూముల క్రయ విక్రయాలు, వెట్టి చాకిరి నిషేధం విధింపు.

**29వ అధికరణ :** సాంస్కృతిక, విద్యా, వైజ్ఞానిక హక్కుల కల్పన

**46వ అధికరణ :** సామాజిక అన్యాయాల నుంచి, అన్ని రకాల దోపిడీలను నుంచి రక్షణను కల్పించడం

**275(1)వ అధికరణ :** షెడ్యూలు ప్రాంతాల పరిపాలనా పరువు, అభ్యున్నతికి గ్రాంట్స్-ఇన్-ఎయిడ్‌ను అందించడం.



**330, 335వ అధికరణలు :** లోక్‌సభ, శాసన సభలలో షెడ్యూల్డు తరగతుల వారికి రిజర్వేషన్ కల్పించడం.

**340వ అధికరణ :** సామాజికంగాను, విద్యా పరంగాను వెనుకబడిన గిరిజనుల స్థితిగతులను తెలుసు కొనడానికి, కమీషన్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్రాలకు అధికారమివ్వడం.

**342వ అధికరణ :** పైన పేర్కొన్న కమీషన్‌చే గుర్తించ బడిన అట్టి తెగలను లేదా అట్టి గిరిజన కులాలను షెడ్యూల్డు ట్రైబులుగా గుర్తించడం.

భారతదేశం మొత్తం జనాభాలో షెడ్యూల్డు తెగల జనాభా 8.6 శాతం వుంటుంది. ఆంధ్రప్రదేశ్ భూభాగంలోని 11 శాతం విస్తీర్ణంలో నివసిస్తున్న గిరిజనులలో 70 శాతం మంది కొండకోనలలోను, 30 శాతం మంది మైదాన ప్రాంతాలలోను నివసిస్తున్నారు.

వారి అభ్యున్నతి కోసం గత 10 పంచవర్ష ప్రణాళికల్లో ఈ క్రింద పేర్కొన్న విధంగా చర్యలు చేపట్టడం జరిగింది.

**1వ పంచవర్ష ప్రణాళిక (1951-56) :** సాధారణ అభివృద్ధి కార్యక్రమాలు

**2వ పంచవర్ష ప్రణాళిక (1956-61) :** ఆర్థికాభివృద్ధి, ఆర్థిక అసమానతల తొలగింపు 43 ట్రైబల్ డెవలప్‌మెంటు బ్లాకుల (టి.డి.బి) రూపకల్పన. బహుళార్థ కార్యక్రమాలతో టి.డి.బి.ల అనుసంధానం

**3వ పంచవర్ష ప్రణాళిక 1961-66) :** టి.డి.బి లను కొనసాగిస్తూ, ఆర్థిక అసమానతలను వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా తొలగిస్తూ, గిరిజనులకు సమాన అవకాశాల కల్పన.

**4వ పంచవర్ష ప్రణాళిక (1969-74) :** జీవన స్థాయిని పెంపుదల చేస్తూ, సమానత్వం, సామాజిక న్యాయ కల్పన.

ఆంధ్రప్రదేశ్‌తో కలుపుకుని ఆరు రాష్ట్రాలలో ఆరు ప్రత్యేక పైలట్ ప్రాజెక్టులకు 1971-72లో రూపకల్పన జరిగింది. ఈ ప్రాజెక్టులకు ట్రైబల్ డెవలప్‌మెంటు ఏజన్సీల అనుసంధానం చేయడం.

**5వ పంచవర్ష ప్రణాళిక ( 1974-78) :** గిరిజనులు సరాసరిని లబ్ధిపొందడానికి, ట్రయిబల్ సబ్‌ప్లాన్ (టి.యస్.పి) ల జీవన సామర్థ్యం పెంపుదలకు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, పరిపాలనా పరమైన రక్షణతో గిరిజనుల హక్కుల ను కాపాడడం.

**6వ పంచవర్ష ప్రణాళిక (1980-85) :** దారిద్ర్య నిర్మూలనకు 50 శాతం యస్.టి. కుటుంబాలకు ఆర్థిక సహాయానికి నిధుల కేటాయింపు.

**7వ పంచవర్ష ప్రణాళిక (1985-90) :**

అధిక నిధుల కేటాయింపు ద్వారా మౌలిక వసతుల పెంపుదల. గిరిజనుల అభివృద్ధికి 1987వ సంవత్సరంలో నేషనల్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్, 1989వ సంవత్సరంలో నేషనల్ షెడ్యూల్డు తెగల, షెడ్యూల్డు కులాల ఫైనాన్సు కో ఆపరేటివ్ కార్పొరేషన్‌లు రూపొందించబడ్డాయి.

**8వ పంచవర్ష ప్రణాళిక (1992-97) :** సమాజంలో ఇతర వర్గాలకు, గిరిజనులకు మధ్యన వున్న అంతరాన్ని తొలగించడానికి ప్రయత్నం.

**9వ పంచవర్ష ప్రణాళిక (1997-2002) :** గిరిజనులు తమ హక్కులను అనుభవించడంలో సామాజిక సాధికారత, ఆర్థిక సాధికారత, సామాజిక న్యాయ సాధికారతల కల్పన.

**10వ పంచవర్ష ప్రణాళిక (2002-07) :** పరిష్కరింప బడని సమస్యల పరిష్కార మార్గాల అన్వేషణ.

1991 జనాభా లెక్కల ప్రకారం గిరిజనుల అక్షరాస్యత 17.16 శాతం కాగా, 2001 జనాభా లెక్కల ప్రకారం 37-04 శాతమైంది. ప్రభుత్వ ఋణ పథకాలలో 13-36 లక్షల మంది షెడ్యూల్డు తెగల లబ్ధిదారులు తీసుకున్న ఋణం 145 కోట్ల రూపాయలను ఋణ మాఫీ పథకం క్రింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాఫీ చేసింది.

భారతీయ ఆదివాసీలను జాతీయ సంపదగా భావిస్తూ, వారి పేదరిక నిర్మూలన, ఆత్మాగౌరవ స్థిరీకరణ, మనోస్థైర్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ ప్యాకేజీలను రూపొందించాలి. వారికి విద్యా, వైద్య, సాంస్కృతిక, పారిశుద్ధ్య, మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. గిరిజనేతరుల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలి. వడ్డీవ్యాపారుల కబంధ హస్తాల నుండి గిరిజనులకు విముక్తి కలిగించాలి. గిరిజనుల ఋణాలను మొత్తంగా మాఫీ చేయాలి. గిరిజన ఉత్పత్తులను లాభదాయకమైన మార్కెటు సౌకర్యాలు కల్పించాలి.

నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలను పారద్రోలాలి. వారికి రక్షిత నీటి సౌకర్యం, పౌష్టికాహారం సరఫరా నీటి పారుదల సౌకర్యం, వాటర్‌షెడ్ పథకాల ఏర్పాటు జరగాలి.

గిరిజనుల్లా నేస్తం కట్టేవారి కన్నా నిష్కటప్రాణమిత్రులు ప్రపంచంలో మరొకరుండరు అని అనడంలో అతిశయోక్తి లేదు! ప్రభుత్వోద్యోగులు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పక్షాలు, ప్రతి ఒక్క పౌరుడు దీక్షబూని, భారతీయ జాతుల సమైక్యతకు, సమగ్రతకు చిత్తశుద్ధి కలిగి వుండడం సర్వదా అభిలషణీయం.

*- ఎ.వి. రాజా, ఆంధ్రప్రదేశ్ భూగర్భజల శాఖ*



Sthanka_Jan.colo.indd 25 30/12/10 2:43 PM

# బాలికా ! ఓ బాలికా !!





**బాలికలు, మహిళలు లేని ప్రపంచాన్ని ఒక్కసారి ఊహించుకోండి - ఎట్లా ఉంటుందో! అమ్మాయి, అమ్మ లేని ఇల్లు, బాలికలు లేని స్కూలు, మహిళలు లేని ఆఫీసు, రోడ్డు, మార్కెట్.... ఏదైనా సరే ఎలా ఉంటుందో ఆలోచించండి.**

మరి మనమెందుకు ఆడశిశువులను వెలుగు రేఖలు కూడా చూడకుండానే గర్భంలోనే అంతమొందిస్తున్నాం? బాలికలకు పోషకాహారం సరిగా ఎందుకివ్వటం లేదు? ఎందుకు వారిని మాడ్చి చంపుతున్నాం? బాలికలను బడికెందుకు పంపటం లేదు? మగ పిల్లాడ్ని బడికి పంపి, ఆడపిల్లతో ఇంటెడు చాకిరీ ఎందుకు చేయిస్తున్నాం? ఆమె చేస్తున్న ఇంటి పనికి, వంటపనికి ఎందుకు సరైన గుర్తింపు ఇవ్వటం లేదు? సృష్టికే ప్రతి సృష్టి చేయగలిగిన అమ్మాయిల నుంచి అనాగరికమైన వరకట్నాలు ఎందుకు ఆశిస్తున్నాం? వాటి కోసం ఎందుకు పీడిస్తున్నాం? ఎందుకు హింసిస్తున్నాం? ఎందుకు చంపుతున్నాం?

ఈ ప్రశ్నలకు, మరెన్నో ప్రశ్నలకు మనమంతా జవాబు చెప్పుకోవలసిన అవసరం ఉంది. సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంది. చెంపలు వాయించుకోవలసిన అవసరం ఉంది.

మన దేశ జనాభా నుంచి ఎంతమంది మహిళలు, బాలికలు 'తప్పిపోయారో' తెలుసా? దాదాపు 4 కోట్ల మంది. అన్నీ సవ్యంగా ఉంటే, అందరూ సక్రమంగా ఉంటే, అన్ని పరిస్థితులు బాగుంటే, వీళ్లంతా మన మధ్యే ఉండేవారు. కొందరు తల్లి కడుపులో ఉండగానే 'తప్పిపోగా', మరికొందరు సరైన ఆహారం, సమయానికి వైద్యం అందక 'తప్పిపోయారు'. మరికొందరు అత్యాచారాలకు, అకృత్యాలకు, హింసకు బలైపోయి ప్రపంచం నుంచే 'తప్పిపోయారు'.

గత 20 సంవత్సరాలలో మన దేశంలో దాదాపు కోటి గర్భస్థ ఆడ పిండాలు అర్ధాంతరంగా అంతమైపోయాయి. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం, మనదేశంలో ప్రతి ఏటా 7,50,00 గర్భస్థ ఆడపిండాలు అబార్షన్ అయిపోతున్నాయి. ప్రతి ఏటా ఈ సంఖ్య పెరుగుతోంది. గర్భంలో ఉన్నప్పుడే ఆడపిండమో, మగపిండమో, తెలుసుకునే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తరువాత ఆడపిల్ల పుడితే ఈ క్రూర ప్రపంచంలో పెంచలేమోననే భయంతో, లేక మగపిల్లవాడిపై ఉండే మోజు, ఆకర్షణలతో మన దేశంలో ఊపిరి ఆపివేసిన కోట్లాది ఆడపిండాలలో ఇదొక భాగం మాత్రమే. మన దేశం నుంచి తప్పిపోయిన మహిళలు, బాలికలు ఏదో ఒక శ్మశానంలో శాశ్వత విశ్రాంతి తీసుకుంటూ ఉండి ఉంటారు.

ఇంత అనాగరికమైన వివక్ష గూడుకట్టుకున్నందు వల్లనే, మన దేశంలో ఇప్పుడు ప్రతి 1000 బాలురకు 927 మంది బాలికలే ఉన్నారు. జనాభాలో ప్రమాదకరమైన అసమతుల్యత ఏర్పడి, తీవ్రతర మవుతోంది. ఇదెన్ని విపరీతాలకు దారి తీస్తుందోనని, సామాజిక శాస్త్రవేత్తలు భయపడుతున్నారు.

మన దేశంలోని బాలికల సమస్యల్లో గర్భస్థ ఆడపిండాలను, ఆడ శిశువులను హతమార్చట మొక్కటే లేదు. ప్రతి దశలో ఆమె దారుణమైన వివక్షకు గురవుతూనే ఉంది. పుట్టుకతో పాటు, పెరిగే దశలో సరైన ఆహారం, ఆరోగ్యం, విద్య ఆమెకు అందటం లేదు. బాల్య వివాహాలు కూడా బాలికల ప్రగతికి గొడ్డలి పెట్టుగానే ఉన్నాయి. చిన్న వయస్సులో ప్రసవాలు ఆమె ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించాయి.

1974లో పిండంలోని లోపాలను గుర్తించడానికి అమ్నియో సెంటిసిస్‌ను అభివృద్ధి చేశారు. 1979లో మొదటిసారి ఈ పరీక్షను పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో గర్భస్థ పిండం ఆడో, మగో, తెలుసుకోవటానికి వాడారు. దాంతో, భారతీయ వైద్య పరిశోధ్య మండలి ఈ పరీక్షను నిషేధించింది. అయితే, అప్పటికే ఆలస్యమైపోయింది. అమ్నియోసెంటిసిస్ ద్వారా గర్భస్థ పిండం ఆడో, మగో తెలుసుకోవచ్చనే విషయం పాకిపోయింది. ఆడ పిండాలను అంతమొందించడానికి ఈ పరీక్షలను ప్రజలు విస్తృతంగా వాడటం ప్రారంభించారు. ఆడ పిండాలు అంతమవటం ఎక్కువైంది.



ప్రపంచంలో ఏడాదికి 5 లక్షల నుంచి 20 లక్షల మంది అక్రమ రవాణాకు గురవు తుండగా, వీరిలో అధికులు







మహిళలు, బాలికలే. బడిలో లేని పిల్లల్లో అధికులు ఆడపిల్లలే. బాలికలను బలవంతంగా బడిమాన్పించి, ఇంటిపని, ఇతర పిల్లల పని, కూలి పని చేయిస్తున్నారు.

భారతదేశం ఒక పక్క అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. ఆర్థిక వ్యవస్థ జిడిపి పెరుగుదల ఊపందుకున్నాయి. మౌలిక సదుపాయాలు పెరుగుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందింది. కాని, బాలికలు, మహిళల పట్ల , వివక్ష మాత్రం అంతం కాలేదు.

బాలికల హక్కుల కోసం పోరాడటమంటే అది కేవలం సమానత్వం కోసం జరిపే పోరాటం మాత్రమే కాదు. అది పేదరికంపై చేసే పోరాటం. హింసపై చేసే యుద్ధం. నిరక్షరాస్యతపై జరిగే ఆందోళన. అందరు మహిళలు, పురుషులు, పిల్లల సంక్షేమం కోసం జరిగే మహా ప్రయత్నం. ఇవి సఫలీకృతం కావాలంటే, ఈ కింది చర్యలు తీసుకోవాల్సి ఉంది.

* కుటుంబం లోపల, బయట బాలికలు, మహిళల పట్ల కనబరిచే అన్ని రకాల వివక్షను నిర్మూలించాలి. వారి హక్కులను అతిక్రమించడాన్ని ఆపాలి.
* గర్భస్థ పిండాలపై జరిగే లైంగిక పరీక్షలను, ఆడపిండాల అబార్షన్‌లను , ఆడశిశువుల హత్యలను, బాల్యవివాహాలను, బాల్య వ్యభిచారాన్ని, పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థను అరికట్టే అన్ని చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.
* జీవించడానికి, చదువుకోవడానికి, పోషకాహారం పొందటానికి, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి, అభివృద్ధి చెందటానికి బాలికలను ఉన్న హక్కులను పరిరక్షించాలి.
* వివక్షా పూరితమైన నిర్లక్ష్యం నుంచి, లైంగిక అత్యాచారాలతో సహా అన్ని రూపాల్లో ఉన్న అకృత్యాల నుంచి బాలికలను కాపాడాలి.
* బాలికల గొప్పదనాన్ని గురించి బాలికల్లో, బాలురు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అసలు సమాజం మొత్తంలోనే ప్రాచుర్యం కల్పించాలి.
* వారికి అన్ని రకాల విద్య, వ్యాపార, ఆర్థిక సంబంధమైన అవకాశాలను, క్రీడావకాశాలను, శిక్షణలను కల్పించాలి.
* బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన పెంచాలి.

బాలుర మాదిరిగానే బాలికలకు అన్ని రకాల అవకాశాలు ఉన్నట్లయితే, బాలికల అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. కళాశాలల పరీక్షల విషయంలో మనం దీన్ని గమనిస్తూనే ఉన్నాం. విద్యా రంగంలో సరైన అవకాశాలున్నప్పుడు బాలుర కంటే ఎక్కువ ప్రావీణ్యతను బాలికలే కనబరుస్తున్నారు.

అందువల్ల బాలికలను గురిచేస్తున్న అన్ని రకాల వివక్షలను అంతమొందిద్దాం. వారికి బంగారు భవిష్యత్తును అందిద్దాం. తద్వారా భారతదేశం ఇంతకు రెండింతలు అభివృద్ధి చెందటం తథ్యం.

**- గొట్టిపాటి సుజాత**











# 'అపార్డ్' శిక్షణలతో - చైతన్యమవుతున్న గ్రామ సభలు

**గాంధీజీ కలలుకన్న స్వరాజ్యం, గ్రామాల సంపూర్ణ అభివృద్ధి 60 ఏండ్లు నిండిన స్వతంత్ర దేశంలో ఇంకా సాధ్యం కాలేదన్న ప్రశ్నలు తలెత్తున్న ఈ తరుణంలో 'పల్లెలే దేశానికి పట్టు కొమ్మలు' అన్న గాంధీజీ నినాదం నీటి మాటగానే మిగిలిపోయింది.**

అయితే ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి, ప్రజల చైతన్యానికి అనేక పథకాలు చేపట్టినా, గ్రామస్థాయిలో వీటి అమలు అంతంత మాత్రం కావటంతో పల్లె పాలనలో అభివృద్ధి కానరావటం లేదు. అందుకే, 'India is rich country But Indians are Poor' (భారతదేశం సమృద్ధి చెందిన దేశం. కానీ, భారతీయులు పేదవారు) అనే ఆంగ్ల సామెత వెంటాడుతూనే ఉంది.

ఈ పరిస్థితులను మార్పు చేసి సుపరిపాలనకు మార్గ దర్శకాలు అందించాలనే సంకల్పంతో 'అపార్డ్' సంస్థను ప్రభుత్వం ప్రోత్సహించింది. ఈ ప్రోత్సాహంతో అపార్డ్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగి, కార్యదర్శి, బిల్ కలెక్టర్ నుంచి గ్రామ స్థాయిలో కీలక ప్రజాప్రతినిధులయిన వార్డు మెంబర్ల నుంచి పై స్థాయి అధికార్లు, ప్రజాప్రతినిధుల వరకు శిక్షణలు ఇవ్వటం వంటి కార్యక్రమాలను అపార్డ్ కమీషనర్ శ్రీ ఫణికుమార్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టారు. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా, 'అపార్డ్' ఫ్యాకల్టీ సెంటర్ హెడ్, ఫేస్ టు ఫేస్ శిక్షణల ద్వారా, ఇ.టి.సి. స్థాయి రెవ్యూ మీటింగ్‌లు, ప్రణాళికలు రూపకల్పనలో ప్రిన్సిపాల్ ద్వారా జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ సి.ఇ.ఓ., పర్యవేక్షణా ట్రైనింగ్ సెల్ డి.ఆర్.పి.ల ద్వారా, మోనిటరింగ్, మండల స్థాయిలో మండల ప్రజాపరిషత్ అధికారుల, గ్రామ స్థాయిలో కార్యదర్శుల ద్వారా చేపట్టిన శిక్షణా కార్యక్రమాలు విస్తృతంగా ప్రజా చైతన్యాన్ని కల్గించేవిగా ఉన్నాయి.

అంతేగాకుండా మన టి.వి. ద్వారా ప్రతి గురువారం రిలే కార్యక్రమంలో 'ప్రజాప్రతినిధులకు వారి హక్కులు, విధుల' తో పాటు నూతన అంశాలతో కూడిన శిక్షణను నిపుణుల చేత ఇప్పించటం, చర్చా గోష్ఠి ద్వారా ప్రశ్నలకు అవకాశం కల్పించటం వంటి దూరమాధ్యమ శిక్షణలను ప్రభుత్వం ప్రజలకు కల్పించటం విశేషం.

అంతేగాకుండా పంచాయితీ రాజ్ మినిస్టీరియల్ సిబ్బందికి సైతం, ఈ దూరమాధ్యమం ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన శిక్షణలను ఇప్పించటం. ఇ.టి.సి.ల ద్వారా కంప్యూటర్ ట్రైనింగ్స్, న్యూ





Sthanka_Jan.colo.indd 22 30/12/10 2:43 PM

అకౌంటింగ్ సిస్టమ్‌పై సిబ్బంది అందరికీ పంచాయితీ కార్యదర్శి, సూపరిండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ తదితరులందరికీ, వివిధ విషయాలు, నిబంధనలు పట్ల సంపూర్ణ అవగాహన కల్పించటం వంటి శిక్షణ కార్యక్రమాల ను అపార్డ్ సంస్థ అందించింది. జిల్లాలోని కార్యదర్శులు, సిబ్బంది ఈ శిక్షణల ద్వారా వృత్తి నైపుణ్యాలు మెరగుపరచుకోవడం, తద్వారా ప్రజలకు సంవరిపాలన అందించేందుకు సిబ్బందికి, మంచి నాయకత్వ లక్షణాలు పెంపొందేందుకు ప్రజాప్రతినిధులకు ఈ శిక్షణలు ఎంతగానో దోహదపడుతున్నాయి. మంచి పౌరులను తయారుచేసి గ్రామాల అభివృద్ధిలో ప్రజల ను భాగస్వామ్యం చేసేందుకు ఈ శిక్షణలు ఉపయోగంగా ఉన్నాయి.




ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో 46 మండలాల్లో గత 3 సంవత్సరాలుగా జిల్లా ట్రైనింగ్ సెల్ ద్వారా విస్తృతంగా శిక్షణ చేపట్టడం జరిగింది. ముఖ్యంగా గ్రామస్థాయి ప్రజాప్రతినిధిగా కీలక నేతగానున్న వార్డు మెంబర్లను, ప్రజా పాలనలో భాగస్వాముల ను చేసేందుకు ఈ శిక్షణలు ఎంతగానో దోహదపడుతున్నాయి. తాను కూడా ప్రజాప్రతినిధినేనని సమస్యలపై తన పరిధిలో పనిచేస్తే మంచి నాయకత్వంతో పాటు నాయకుడిగా ఎదిగేందుకు వార్డు మెంబర్ పదవి తొలిమెట్టు అన్న సత్యాన్ని తెలుసుకుంటూ వారు చైతన్యవంతం అవుతున్నారు.

ఇటీవల సెప్టెంబర్ నెలలో జిల్లాలో మౌఖిక రక్షణా కార్యక్రమంలో మొత్తం 9040 మంది వార్డు సభ్యులకు గాను 7778 మందినే పిలవగా 2884 మంది శిక్షణలకు హాజరు కాగా, మిగిలినవారికి 6 మండలాల్లో వెంటనే శిక్షణలు ఇవ్వటం జరిగింది.

ఈ విధంగా 961 మంది సర్పంచ్‌లకు గాను 774; 559 మండల ప్రజాప్రతినిధులకు 409; 46 మంది జిల్లా ప్రతినిధులకు, 46 మండల ప్రజాప్రతినిధులు, అలాగే సర్పంచ్‌లకు మహారాష్ట్ర మిత్ర బజారు, విహార, అధ్యయన యాత్రలను అపార్డు పర్యవేక్షణలో దిగ్విజయంగా నిర్వహించటం జరిగింది.

ఈ విధంగా గ్రామస్థాయిలోని ప్రజాప్రతినిధులను ప్రోత్సహిస్తూ చైతన్య పరస్తున్న 'అపార్డు' సంస్థ ద్వారా గ్రామాల్లో ప్రజలు చైతన్యమవుతున్నారు. వారి వారి గ్రామసభలు, పంచాయితీ సభలు జరుపుకునేందుకు చైతన్యమవ్వాలి. నేడు అనేక గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారంటే అది అపార్డు శిక్షణ ద్వారా జరిగిన వార్డు మెంబర్ల చైతన్యంగా చెప్పవచ్చు. అంతేగాకుండా, ప్రచార రథం ద్వారా కూడా నెల్లూరు జిల్లాలో సర్కారు 87 గ్రామ షోలు, నాటికలు ద్వారా, గ్రామసభలపై ప్రజలను చైతన్యం చేయటంతో నేడు గ్రామాలు అభివృద్ధి బాటలు ఏర్పరచుకుంటున్నాయి.

గ్రామ ప్రణాళికల తయారీలో సభ్యులతో పాటు ప్రజలు భాగస్వామ్యం వహిస్తున్నారు. 'సమాచార హక్కు' చట్టాన్ని ప్రజలు విరివిగా ఉపయోగిస్తున్నారు. తద్వారా పారదర్శకతకు మార్గం సుగమనం చేస్తూ, గ్రామపాలనలో కీలకమైన వార్డు మెంబర్లు, ప్రజలు గ్రామసభల ను చైతన్యవంతంగా నిర్వహిస్తున్నారు.

ముఖ్యంగా అక్టోబర్ 2 (గాంధీజీ పుట్టిన రోజు) ఏప్రిల్ 14 (డా॥ అంబేద్కర్ పుట్టిన రోజు) ఖచ్చితంగా జరగాల్సిన గ్రామసభలు నేడు పంచాయితీలలో జరుపుతున్నారంటే శిక్షణలే ముఖ్య కారణమనే భావన ప్రజల్లో నెలకొన్నది.

అంతేగాకుండా, ఈ మధ్యకాలంలో అపార్డు ద్వారా శిక్షణ తేదీలతో కూడిన సమాచారం వార్తల రూపంలో టివీ స్క్రోల ద్వారా అందించటం ద్వారా సభ్యులు ఈ సమాచారాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రజా పరిషత్, జిల్లా పంచాయితీ, అధికార్లు సంయుక్తంగా 46 మండలాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలకు ప్రణాళికలు తయారు చేస్తారు. మండల స్థాయిలో మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో విస్తరణాధికారి పర్యవేక్షకులుగా మండలస్థాయి శిక్షణలు నిర్వహిస్తారు.

గ్రామ పంచాయితీల స్థాయిలో పంచాయితీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు శిక్షణకు హాజరయ్యే విధంగా పూర్తి చర్యలు చేపడతారు. ఈ విధంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి ఆ తర్వాత, ఐ.టి.సి, రాష్ట్ర-స్థాయి అపార్డ్, శిక్షణలకు జిల్లా ట్రైనింగ్ సెల్ విభాగం ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. డి.ఆర్.పి.ల మోనిటరింగ్ ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడతాయి.

ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో మినిస్ట్రీరియల్ సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు విడతలు వారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి చైతన్యం చేయటం జరిగింది. జిల్లా స్థాయిలో గాంధీ జయంతి సందర్భంగా అధిక పంచాయతీలలో గ్రామసభలు జరగటం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

*- డి.ఆర్.డి., నెల్లూరు*



Sthanka_Jan.colo.indd 23 30/12/10 2:43 PM

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున ఉద్యానవన తోటల పెంపకం

అన్ని వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు జీవనోపాధి భద్రతను పెంచే లక్ష్యంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2007-08 సంవత్సరం నుంచి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ పెద్ద ఎత్తున ఉద్యానవన తోటల పెంపకాన్ని చేపట్టింది.

ఎన్ హెచ్ ఎం, ఎపి ఎంఐపిలతో కలసి ఉద్యానవన పంటలను ప్రోత్సహించడానికి 100 శాతం ఆర్థిక సహాయాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ అందిస్తోంది.

### ముఖ్యాంశాలు

- మూడు సంవత్సరాల పాటు నిర్వహణతో పాటు, 100 శాతం ఆర్థిక సహాయం
- లబ్ధిదారులు : ఎస్సి, ఎస్టి వర్గాలకు చెందినవారు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న చిన్న, సన్నకారు రైతులు
- క్లస్టర్ ఆధారిత విధానం
- ఎస్ హెచ్ ఎం, ఎపి ఎంటిపిలతో అనుసంధానం
- సి ఎల్ డిపి, ఇజిఎస్, ఎల్డిసి, బ్లాక్‌లకు ప్రాధాన్యత (2010 - 11 నుంచి)

### పండ్లతోటలు

- మామిడి (మెట్ట భూములకు అనుకూలమైన వాటితో సహా)
- బత్తాయి
- జీడి మామిడి
- సపోటా
- జామ
- కొబ్బరి
- నిమ్మ
- సీతాఫలం
- ఆయిల్ పామ్

### అమలు విధానం

- గ్రామసభలు నిర్వహించి, ఆ సభల్లోనే ఎస్సి, ఎస్టి వర్గాలకు చెందిన రైతులను, చిన్న, సన్నకారు రైతులను, అసైన్డ్ భూముల రైతులను ఎంపిక చేసి, గ్రామసభల ఆమోదం పొందటం.
- నమ్మకమైన నీటిపారుదల సౌకర్యాలు ఉన్న భూములకు ప్రాధాన్యత ఇవ్వటం.
- మార్కెట్లు, నర్సరీలకు దగ్గరగా ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వటం
- క్లస్టర్ ఆధారిత విధానాలను అనుసరించటం
- ఒక్కొక్క రైతుకి చేసే సహాయాన్ని ఐదు ఎకరాలకు పరిమితం చేయటం.
- ఒక లబ్ధిదారుడికి ఒక్కొక్క పండ్ల తోటకు మాత్రమే సహాయం చేయటం
- రైతులకు, క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి శిక్షణ ఇవ్వటం
- నిధులను ఆన్‌లైన్‌లో బదిలీ చేయటం
- నాణ్యమైన మొక్కలను, ఇతర పరికరాలను రైతులే స్వంతంగా సమకూర్చుకోవటానికి వీలుగా ఎంపికలో సహకరించటం
- మూడేళ్ల పాటు తోటల నిర్వహణ చేపట్టడం
- లోపాలు జరగకుండా థర్డ్‌పార్టీతో పరిశీలన, మదింపు చేపట్టటం, సామాజిక తనిఖీ విధానం అమలు చేయటం
- పండ్ల తోటలకు మొక్కలను నాటడం, ఇతర పరికరాల పంపిణీ, వాడుకల విషయంలో సీజన్‌లకు తగినట్లుగా చర్యలు చేపట్టడం
- మొదటి సంవత్సరం చివరినాటికి కనీసం 75 శాతం మొక్కలు బతికి ఉండేలా ప్లాంటేషన్‌ను చేపట్టి, నిర్వహించడం. 75 శాతం మొక్కలు బతికి ఉంటేనే రెండవ సంవత్సరం నిర్వహణకు అర్హత లభిస్తుంది.
- రెండవ సంవత్సరం చివరినాటికి కనీసం 90 శాతం మొక్కలు బతికి ఉండేలా చూడటం. రెండవ సంవత్సరం నాటికి 90 శాతం మొక్కలు బతికితేనే, మూడవ సంవత్సరంలో నిర్వహణకు అర్హత లభిస్తుంది.





SthanikaPalanaTel_January_2010_COLOUR.p6nd 12/30/2010, 1:06 PM

## విస్తీర్ణం

| | | | |
|---|---|---|---|
| బత్తాయి | - | 90,523 | ఎకరాలు |
| మామిడి | - | 2,10,890 | ఎకరాలు |
| సపోటా | - | 3,270 | ఎకరాలు |
| జీడిమామిడి | - | 8,500 | ఎకరాలు |
| నిమ్మ | - | 11,371 | ఎకరాలు |
| కొబ్బరి | - | 208 | ఎకరాలు |
| సీతాఫలం | - | 504 | ఎకరాలు |
| జామ | - | 746 | ఎకరాలు |
| ఆయిల్ పామ్ | - | 2,630 | ఎకరాలు |
| కాఫీ | - | 20,483 | ఎకరాలు |
| రబ్బర్ | - | 4,796 | ఎకరాలు |
| పల్ప్‌వుడ్ | - | 20,880 | ఎకరాలు |
| బయోడీజిల్ | - | 1,37,317 | ఎకరాలు |
| మొత్తం | - | 5,12,118 | ఎకరాలు |

## ఉత్తమ విధానాలకు ప్రోత్సాహం

### కాంపోస్టింగ్

ఇటీవలి వరకు అధిక ఉత్పత్తులు సాధించడానికి రసాయనిక ఎరువులను వాడటం రైతుల్లో సాధారణ అలవాటుగా ఉండేది. రసాయనిక ఎరువులను వరసగా వాడుతున్నట్లయితే నేల స్వభావం, సారం దెబ్బతింటాయని, శాస్త్రీయ పరిశోధనల్లో రుజువైంది.

ఈ విషయాన్ని గుర్తించిన గ్రామీణాభివృద్ధి శాఖ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఉద్యానవనాల సాగులో కాంపోస్టు ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించింది.







SthanikaPalanaTel_January_2010_COLOUR.pmd 37 12/30/2010, 1:06 PM




ఒక్కొక్క ఎకరానికి ఒక గుంత చొప్పున ప్రతి పాలానికి కాంపోస్టు ఎరువులను సరఫరా చేయాలనే నిబంధనను కూడా ప్రవేశ పెట్టడం జరిగింది. కాంపోస్టు ఎరువులను వాడటం వలన నేలకు నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం, పలు విధాలైన మైక్రో న్యూట్రియంట్లు అందుతాయి. ఇవన్నీ మొక్కలు బలంగా పెరిగి, బాగా ఎదగడానికి దోహదపడతాయి. ఆర్గానిక్ సేద్యానికి మారాలంటే, ముందు ఆ నేలకు కాంపోస్టు ఎరువులను అలవాటు చేయటం తప్పనిసరి అవసరం.

## మైక్రో ఇరిగేషన్ (డ్రిప్ ఇరిగేషన్)

అందుబాటులో ఉన్న నీటివనరులను జాగ్రత్తగా వాడటం, నీటిని పొదుపు చేయటం అనేది వ్యవసాయాధారిత రంగంలో కీలకపాత్ర వహిస్తోంది. అందువల్ల, వ్యవసాయానికి వినియోగించే నీటిని వీలయినంత తక్కువగా వాడుతూ, పొదుపు చేసేందుకు మైక్రో ఇరిగేషన్ విధానాలు అందుబాటులోకి వచ్చాయి.

అటువంటి మైక్రో ఇరిగేషన్ విధానాల్లో, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, తదితర విధానాలు బాగా విజయం సాధించాయి. వాటి ఉపయోగ్యత కూడ పలుసార్లు రుజువైంది. దాంతో ప్రభుత్వం నుంచి, ఇతర ఆర్థిక సంస్థలనుంచి డ్రిప్ ఇరిగేషన్ పరికరాలకు, స్ప్రింక్లర్ ఇరిగేషన్ పరికరాలకు రుణం కూడా తేలికగా లభిస్తోంది.

మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోటా వంటి పండ్ల తోటలకు డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని వాడుతున్నారు.

## డ్రిప్ ఇరిగేషన్ విధానాల ఉపయోగాలు

- 40 మంది 70 శాతం వరకు నీటిని పొదుపు చేస్తుంది.
- సాధారణ ఇరిగేషన్ కంటే 3 నుంచి 4 రెట్లు ఎక్కువ నేల విస్తీర్ణాన్ని తడుపుతుంది.
- ఎక్కువ నేలను తడపటం ద్వారా తక్కువ శ్రమతో అధిక ఫలితం సాధించగలుగుతుంది.
- భూమిని చదును చేయాల్సిన అవసరం లేదు.
- నీరు పారడానికి చాళ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు.
- నేలకు కోత పడదు, అందువలన, ఇసుక నేలకు బాగా అనువైనది.
- కలుపు మొక్కలు పెరగడాన్ని ఆపుతుంది.
- క్రిమికీటకాలు, ఇతర తెగుళ్ల బాధలను బాగా నివారిస్తుంది. ఎరువులను, మైక్రో న్యూటియంట్లను ఆదా చేస్తుంది.
- మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి దోహదపడి, అధిక పంట దిగుబడులను అందిస్తుంది.
- నీటి పొదుపు సామర్థ్యం 90 శాతం వరకు ఉంటుంది.
- నేలలో తేమను నిరంతరం కాపాడుతుంది. ప్రత్యేకించి మొక్కల వేర్ల భాగంలో తడి ఎప్పుడూ ఉంటుంది.

డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలంటే, ఉద్యానవన శాఖ 70 శాతం సబ్సిడీని అందిస్తోంది. ఎంఎంఐపి ప్రాజెక్టు కింద ఈ సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన 30 శాతం వ్యయాన్ని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అందజేయటం జరుగుతుంది. గత నాలుగేళ్లలో ఈ పథకం కింద 1.74 లక్షల ఎకరాల భూములతో డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని ఏర్పాటు చేయటంలో సహాయం చేయటం జరిగింది.

## పాట్ ఇరిగేషన్

వర్షాధారిత ఉద్యానవన పంటలను సాధారణంగా వేసే గిరిజన ప్రాంతాల్లో ఈ విధానాన్ని అవలంబించటం జరుగుతుంది. చిన్న చిన్న మొక్కలకు సమీపంలో ఒక కుండను ఉంచి, ఆ కుండ అడుగున



SthanikaPalanaTel_January_2010_COLOUR.p6nd 12/30/2010, 1:06 PM





ఒక రంధ్రం చేయటం ద్వారా పాట్ ఇరిగేషన్ విధానాన్ని అమలు చేస్తారు. ఈ విధానంలో మొక్కలకు ఒక్కొక్క చుక్క నీరు అందుతుంది.

ఈ కుండలను నేల ఉపరితలంపై ఉంచి, మొక్క వేరు భాగానికి నీరు అందేలా చేస్తారు . ఈ కుండను మొక్క చుట్టూ జరుపుతూ ఉండటం వల్ల వేర్ల వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుంది. ఇట్లా అభివృద్ధి చెందిన వేర్లు మొక్కలను గట్టిగా నేలతో కలిపి ఉంచుతాయి. పూర్తిగా పెరిగిన మొక్కలను ఎటువంటి నీటి పారుదల సౌకర్యాలు కల్పించడం జరగదు. వర్షం సహాయంతో, నేలలో లభించే తేమ సహాయంతో ఈ మొక్కలు బతుకుతాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన హార్టీకల్చర్ పథకంలో వర్షాధార ప్రాంతాలలో మొక్కలకు మూడేళ్ల వయస్సు వచ్చేవరకు ఇదే విధానాన్ని అమలు చేయటం జరుగుతుంది.

### బయోఫెర్టిలైజర్లు, బయో పెస్టిసైడ్ల సరఫరా

కాంపోస్టింగ్ విధానాన్ని ఎందుకోసం ప్రోత్సహించటం జరుగుతున్నదో, అదే కారణంతో బయో ఫెర్టిలైజర్లను, బయో పెస్టిసైడ్లను ఈ పథకం కింద ప్రోత్సహించటం జరుగుతుంది. అజారిడిక్టిన్, ట్రైకోడెర్మా విరిడీ వంటి వేప ఉత్పత్తులను బయో పెస్టిసైడ్లుగా, సూడోమొనాస్, అజోస్పిరిల్లమ్ మొదలైన వాటిని బయోఫెర్టిలైజర్లుగా ఈ పథకం కింద సిఫార్సు చేయటం జరుగుతుంది.

### సేకేచర్ ద్వారా ప్రూనింగ్

మొక్క ఆరోగ్యంగా పెరగటానికి, నాణ్యమైన పండ్లు ఇవ్వటానికి మొక్కని ప్రూనింగ్ చేయటం చాలా అవసరం. అందువల్ల, ఈ పథకం కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టటం జరుగుతుంది.

### శిక్షణ

ఉద్యానవన పంటలను వేసే అనేకమంది రైతులు ఇప్పటికీ సాంప్రదాయక సేద్యపు విధానాలనే అవలంబిస్తున్నారు. వీటి వల్ల దిగుబడులు బాగా తక్కువగా ఉంటున్నాయి.

అందువల్ల, మంచి నాణ్యమైన ఉత్పత్తులను అధికంగా పొందడానికి, అంటే వాసి, రాశి పరంగా మెరుగుపరచడానికి, ఆయా ప్రాంతాలకు అనుగుణమైన, ఆయా పంటలకు అనుగుణమైన నైపుణ్యాలు సంపాదించడం, మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటం అవసరం.

ఆయా పంటలకు అవసరమైన విధానాలను, సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయటం, మొక్కలు నాటడానికి ముందు, నాటిన తరువాత చేసే పనులపై అందరు ఉద్యానవన రైతులకు దశల వారీగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటం జరిగింది.

- **డాక్టర్ సిహెచ్ పద్మావతి,**
అసిస్టెంట్ డైరెక్టర్, హార్టీకల్చర్

- **వై. సూర్యనారయణ రావు,** అసిస్టెంట్ డైరెక్టర్, హార్టీ కల్చర్

**(అనువాదం : రాధాకృష్ణ)**







SthanikaPalanaTel_January_2010_COLOUR.p65nd 12/30/2010, 1:06 PM

# జీవధార...

కాళీపట్నం రామారావు

**పేదవాళ్లు కుక్కల్ని విశ్వాసం కోసం పెంచుతారు.**

**పెద్దవాళ్లు వాటిని ఉసిగొల్పడానికి పెంచుతారు.**

**తమ కార్లకు, బంగళాలకు, బ్యాంక్ లాకర్లకు, బీరువాలకు, ఎత్తయిన ప్రహరీ గోడలకూ, ఫలాలూ పుష్పాలూ పూసే తమ ఇంటి ఉద్యానవనాలకూ, షేర్లకూ, డబుల్‌కాట్ బెడ్‌లలో రహస్యంగా అమర్చుకున్న అరల్లో దాచుకున్న డబ్బులకూ, తమ సంతోషానికి, తమ స్వార్థానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే, కలిగిస్తారనుకుంటే, కలిగిస్తారేమోనన్న అనుమానం కలిగితే వెంటనే వాళ్లు తమ కుక్కలను సంకెళ్ల నుంచి విముక్తం చేస్తారు. వాటిని ఎదుటివాళ్లపై వదిలి ప్రాణభయంతో పరిగెత్తేలా చేస్తారు.**

ప్రస్తుతం ఆ బంగళా ముందు అలాంటి పరిస్థితే ఎదురై ఉంది.

దాని గేటు దగ్గర ముగ్గురు ఆడపిల్లలు నిలుచుని ఉన్నారు. చేతుల్లో ఖాళీ బిందెలు ఉన్నాయి. వాటిలోకి నీళ్లు కావాలి. ఆ నీళ్ల కోసం ఆ బంగళా ఎదుట నిలుచుని ఉన్నారు. దూరంగా వాళ్ల బస్తీ ఉంది. పాకలూ, పేలికల జీవితాలూ ఉండే ఆ బస్తీకి ప్రభుత్వం దయదలిచి ఒకటే కుళాయి వేసింది. దాని నీళ్లు గంట వస్తాయి. అవి ఏ మూల? చాలవు. మూడుపూట్ల తినక్కర్లేదు. తినలేరు. కాని, ఒక పూట తినడానికైనా ఎసట్లోకి నీళ్లు కావాలి కదా. దొరకవు. అవి అయిపోతే, కుళాయి దగ్గరే తిట్టుకొని కొట్టుకొని జుట్లూ జుట్లూ పట్టుకొని, మరి గతిలేక ఇదిగో ఈ బంగళా దగ్గరకు వస్తారు. ఈ బంగళాలో కూడా ఒక కుళాయి ఉంది. కాని అది వాళ్ల సొంతం. మునిసిపాలిటీ వాళ్లువదిలినంత సేపు వాళ్లు మోటారు పెట్టి ఆ నీళ్లను ట్యాంకుల్లో పట్టుకుంటారు. మూడు పూట్లా స్నానం చేస్తారు. తోటమాలి ఉంటాడు గనుక వాడు పైపు పెట్టి ఇంట్లో ఉన్న తోటను తడుపుతాడు. మిగిలిన నీళ్లు ఉంటే-వినోదానికి దాంతో ఆడుకుంటారు.



ఆ నీళ్లల్లో కొన్ని తమకు ఇవ్వొచ్చు కదా అని బస్తీ వాళ్ల ఆశ.

ఇవాళ మరీ వీలుగాక ముగ్గురు ఆడపిల్లలు మూడంటే మూడే బిందెలు తీసుకొని వాళ్ల గేటు ముందు నిలబడ్డారు. వాళ్ల వయస్సు ఇరవై లోపే. వారిలో ఒకమ్మాయి చంటిబిడ్డ తల్లి. బిడ్డకు పాలుతాపి, ఆ బిడ్డ అలా నిద్రకు కన్ను మూసిందోలేదో, తలుపు దగ్గరకు వేసి, బిందె అందుకుని పరుగు తీసింది. నీళ్లు దొరుకుతాయో లేదో... పాప లేస్తుందో ఏమిటో?

ఇదిగో... అమ్మాయ్... నీళ్లు లేవు... మీకు ఇవాళ ఇస్తే రేపు మరో పది మంది వస్తారు పోండి పోండి అంది బంగళా ఓనరు.

వాళ్లు కదల్లేదు.

ఒక్క బిందెంటే ఒక్క బిందె తల్లీ అన్నారు.

కుదర్దు.

గొంతు తడుపుకుంటాము అమ్మా, తాగడానికి గుక్కెడు కూడా లేవు అమ్మగారూ...

చెప్తే వినరా... పోతారా పోరా... కుక్కల్ని వదలమంటారా?

నీళ్లు ఎలాగూ ఇవ్వరని అర్థమైపోయింది. ఇక పోయేదేమీ లేదు. నష్టపోయేది అంత కన్నా లేదు. కాని ఇలా మూడుపూట్ల స్నానాలు చేసి, పొగడర్లు రాసుకొని, సెంట్లు కొట్టుకొని, పుష్టికరమైన తిండి తినడం మూలాన శరీరాలు నునుపు తేలి, కళకళగాఉన్న ఈ శ్రీమంతులను మనశ్శాంతితో ఎందుకు ఉంచాలి? వీళ్లను కెలికితే పోలే? కాసింత మాటలతో కారం పెడితే పోలే? వీళ్ల నిద్ర చెడగొట్టి, వీళ్ల పరిసరాలు చెడగొట్టి, వీళ్ల ప్రశాంతత చెడగొట్టి...

'అమ్మో... ఓలమ్మో... చూశారా ఈ దారుణం... నీళ్లడిగితే కుక్కల్ని ఉసిగొలుపుతారంటమ్మో'... ముగ్గురు ఆడపిల్లలూ గోలచేశారు. దూరంగా నీళ్లు లేక, అవస్థ పడుతూ, ఆలోచనల్లో ఉన్నవాళ్లంతా ఇదే సందని అక్కడకు చేరిపోయారు. డబ్బున్నవాళ్లు, డబ్బున్నవాళ్లు ఒకటే అయితే పేదవాళ్లు పేదవాళ్లూ ఒకటి. అందరికీ సంగతి అర్థమైంది. ఇదేం అన్యాయం అన్నారు. పిలవండి... పోలీసుల్ని పిలవండి... నీళ్లడిగామని మమ్మల్ని ఉరిబెట్టండి అన్నారు. డొమ్మీ కేసు పెట్టి మమ్మల్ని లోపలెయ్యండి అన్నారు. మాకేమన్నా భయమా అన్నారు. మరీ ఇంత జబర్దస్తీనా అని గోలగోలగా గేటు ముందు చేరి నానా రభసా సృష్టించారు.

బంగళావాళ్లు తగ్గారు. పేదవాళ్లతో పెట్టుకుంటే గోటితో పోదు. గొడ్డలిదాకా వస్తుంది. అందుకే జంకి, ఈ పది బిందెలు కాస్తా వందయ్యి వేలయ్యి ఆ తర్వాత లక్షయ్యి ఆ బంగళా మీద పడితే బంగళా ఉంటుందా? అందుకే భయపడిపోయి గేట్లు తెరిచారు. అందరూ బిలబిలమంటూ లోపలికి వెళ్లారు. ఇవాళ్టికి నీళ్లు దక్కాయి. రేపటికి? మళ్లీ ఇదే కథ. బంగళా గేటు ముందుకు రావలిసిందే!

నీళ్లయినా నిప్పయినా డబ్బయినా నగలైనా అన్నమైనా సున్నమైనా ఒకరి దగ్గర ఎక్కువ ఉంటే తక్కువ ఉన్నవాళ్లు ఆ ఎక్కువ ఉన్నవారిని ఇబ్బంది పెడుతూనే ఉంటారు. నేరుగానో, దొంగచాటుగానో, తగాదాగానో, తకరారుగానో, దిష్టిగానో, తిట్టుగానో, శాపనార్థంగానో వాళ్ల జీవితాల్లో జోక్యం చేసుకుంటూనే ఉంటారు. అందరికీ అన్నం దొరికేంతవరకూ ఈ గొడవ తప్పదు. అందరికీ నీళ్లు దొరికేంత వరకూ ఈ సమస్య తీరదు. అందరూ సమానమయ్యే దాకా ఈ పోరాటం ఆగదు. ☆



Sthanka_Jan.colo.indd 31 30/12/10 2:43 PM

**డా**క్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి సారథ్యంలో భారతదేశ ప్రజానీకానికి స్వాతంత్ర్య ఫలంగా అందించిన అమూల్యమైన కానుక 'భారత రాజ్యాంగం'.

**భారతదేశ సమాజంలో వున్న హెచ్చుతగ్గుల వ్యవస్థకు, ఆ వ్యవస్థలో తరాల తరబడి అణచివేతకు గురై అభివృద్ధి దరిచేరని సమూహాల సమాన హోదా, గౌరవాల కొరకు అనేక హక్కులను, ఆ దేశాలను, ఈ రాజ్యాంగాలలో పొందుపరచడం జరిగింది.**

మన రాజ్యాంగంలోని 14,15,16 ఆర్టికల్‌లలో చట్టంలో అందరినీ సమానంగా చూడాలని, కులమత ప్రాంత లింగ బేధ ఆధారంగా వివక్ష చూపకూడదని, ఉద్యోగాలలో సమావేశాలను కల్పించాలని నిర్దేశిస్తున్నాయి.

★ ఈ చట్టం క్రింద నమోదయ్యే కేసులను డిప్యూటీ సూపర్‌డెంట్ ఆఫ్ పోలీస్ (DSP) అధికారి స్థాయి తక్కువ కాని అధికారితో మాత్రమే విచారణ జరిపించాలి.

★ ఈ చట్టం పరిధి క్రిందకు వచ్చే నేరం జరిగినప్పుడు ఆ జిల్లా పోలీసు ఉన్నతాధికారి, జిల్లా కలెక్టరు సంఘటనా స్థలాన్ని వెంటనే సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలి. బాధితులకు తగిన రక్షణ, వసతి, రోజువారీ అవసరమైన భత్యం అందేటట్లు చర్యలు తీసుకోవాలి.

★ రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పర్యవేక్షణా కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి 3 నెలలకొకసారి సమావేశమై ఈ చట్టం క్రింద నమోదైన కేసులను, పరిస్థితిని, దళిత గిరిజనులపై జరుగుతున్న అత్యాచారాలు చేపట్టి, నివేదికలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలి.

# 1989 నాటి ఎస్.సి. ఎస్.టి.లపై అత్యాచారాల నిరోధక చట్టం ఏం చెప్తుంది?

అర్టికల్ 17 ద్వారా అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించడం జరిగింది. దీనిని ఏ రూపంలో ఆచరించినా, ఆచరించడానికి ప్రోత్సహించినా, ఈ నిషేధం ద్వారా వ్యక్తులకు సంక్రమించిన హక్కులకు ఏ విధమైన భంగం కలిగించినా అది నేరంగాను, చట్ట ప్రకారం శిక్షార్హంగాను నిర్దేశించింది. అంటరానితనం నిర్మూలనా చట్టం 1955 రెండు దశాబ్దాలు గడిచినా అంటరానితనాన్ని ఏ మాత్రం నిర్మూలించలేక పోయిన నేపథ్యంలో 1976లో దీనినే కొన్ని మార్పులతో 'పౌరహక్కుల పరిరక్షణ చట్టం' (1955)గా మార్పు చేయడం జరిగింది.

1989 సంవత్సరంలో అనగా అప్పటికి స్వాతంత్ర్యం వచ్చి 42 సంవత్సరాలు గడిచినప్పటికీ దళిత గిరిజనులపై జరుగుతున్న హక్కుల ఉల్లంఘన, హింసా దౌర్జన్యాల నేపథ్యం నుండి 'దళిత గిరిజన (అత్యాచార నిరోధక) చట్టం 1989' వచ్చింది.

అయితే ఈ చట్టం అమలుకు సంబంధించిన 'దళిత గిరిజనుల అత్యాచారాల నిరోధక నిబంధనలు 1995'. ఆ తరువాత 6 సంవత్సరాలకు రావడం జరిగింది.

## ఈ చట్టం ప్రత్యేకతలు

★ సమాజంలో దళిత, గిరిజనులపై కొన్ని శతాబ్దాలుగా జరుగుతున్న అత్యాచారాలను చట్టంలో గుర్తించడం.

★ అత్యాచారాలకు గురైన బాధితులకు తక్షణ సహాయం, రక్షణ కల్పించడం.

★ అత్యాచారాలకు గురైన బాధితులకు నష్టపరిహారం చెల్లించడం,

★ సత్వర విచారణ న్యాయం కోసం - ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసి ఈ చట్టం క్రింద నమోదయ్యే కేసుల న్నింటినీ ఈ ప్రత్యేక న్యాయస్థానాలలోనే విచారణ చేయడం.

★ ఈ చట్టం క్రింద కేసు నమోదైన నాటి నుండి 30 రోజుల లోపల విచారణ పూర్తిచేసి ఛార్జిషీటును దాఖలు చేయాలి.

★ ఈ చట్టం క్రింద ఏ అధికారియైన బాధ్యతలను సరిగా నిర్వహించ నట్లైతే ఈ చట్టం క్రింద ఆ అధికారి శిక్షార్హుడు.

★ రాష్ట్ర ప్రభుత్వం అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల ను, జరగడానికి అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ ప్రణాళికలు, వ్యూహాలను రూపొందించి అమలు చేయాలి.

★ రాష్ట్ర స్థాయిలో నోడల్, ప్రత్యేక అధికారులను నియమించి చట్టం సక్రమ అమలుకు తగిన చర్యలు చేపట్టాలి.

★ ప్రత్యేక కోర్టులలో ఈ కేసులను ప్రభుత్వం నుండి బాధితుల తరపున వాదించడానికి అనుభవం కలిగిన న్యాయవాదులతో జాబితా తయారు చేసి అందుబాటులో వుంచాలి.

★ ఒకవేళ బాధితులు కోరుకున్నట్లైతే వారు కోరుకొన్న న్యాయవాదిని ప్రభుత్వం అంగీకరించిన ఫీజు ప్రకారం నియమించవచ్చు.

★ అన్నింటికంటే ముఖ్యమైంది ఈ చట్టం క్రింద నిందితులు ముందస్తు బెయిలు పొందే అవకాశం లేకపోవడం. ఇలా అనేకమైన అంశాలతో ఈ చట్టం మాములు చట్టాలతో పోలిస్తే ఒక భిన్నమైన చట్టంగా రూపొందించబడింది.

## ఈ చట్టం క్రింద గుర్తించబడిన అత్యాచారాలు

ఈ చట్టంలోని సెక్షన్‌లో క్రింద సెక్షన్ 3(1), సెక్షన్ 3(2) అని రెండు ఉపసెక్షన్‌ల క్రింద శిక్షార్హమైన నేరాలు గుర్తించబడే అత్యాచారాలను వివరించడం జరిగింది.

ఉపసెక్షన్ 3(1) క్రింద పదిహేను రకాల అత్యాచారాలు, ఉపసెక్షన్ 3(2) క్రింద 7 అత్యాచారాలు గుర్తించబడ్డాయి.



Sthanka_JanBW.indd 25 30/12/10 3:03 PM

ఈ అత్యాచారాలన్నీ షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తులపై చేసినట్లైతే ఈ చట్టం వర్తిస్తుంది.

ఉపసెక్షన్ 3(1)లో క్లాజు (1) నుండి క్లాజు (3) అనగా సెక్షన్ 3(1)(1) నుండి సెక్షన్ 3(1)(3) ల క్రింద వ్యక్తి గౌరవానికి భంగం కలిగించే అత్యాచారాలను గుర్తించడం జరిగింది.

*3(1) (i) :* తినరాని అసహ్యకర పదార్థాలను బలవంతంగా తినిపించినా, త్రాగించినా.

*3(1) (ii)* : షెడ్యూలు కులాలు లేక షెడ్యూలు తెగల వ్యక్తులను కించపరచడానికి, గాయపరచడానికి, అవమాన పరచడానికి లేక ఇబ్బందికి గురి చేయడానికి వారిని నివాస లేక పరిసర ప్రాంతంలో మలాన్ని, కళేబరాలను, తన ఇతర అసహ్యకర పదార్థాలను పడవేసినా.

*3(1) (iii)* :షెడ్యూలు కులాలు లేక షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తి మానవ గౌరవాన్ని భంగపరచాలని వారి బలవంతంగా మొహానికి రంగు పూసి, వారి బట్టలను ఊడదీసి ఊరేగించడం, లేక ఇటువంటి ఏ ఇతర చర్యలకైనా పాల్పడటం.

సెక్షన్ 3(1)(iv), 3(1)(v) లు షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన సభ్యుల ఆస్తులకు సంబంధించి జరిగే ఆత్యాచారాలు.

*3(1) (vi) :* షెడ్యూలు కులాలు,షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తి సొంతభూమిని గాని, ప్రభుత్వభూమిని కేటాయించే అధికారం గల అధికారి కేటాయించిన భూమిని గాని లేక కేటాయించడానికి ప్రకటించిన భూమినిగాని అక్రమంగా ఆక్రమించుకొని సాగు చేసుకున్నపుడు, లేక తన పేరుపై మార్పు చేసుకున్నపుడు.

*3(1) (v) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తిని అతని భూమి నుండి లేక ఆవరణం నుండి అక్రమంగా తొలగించినా లేక ఆ వ్యక్తి అనుభవిస్తున్న భూమి లేక నివాసప్రాంగణం లేక నీరుపై గల హక్కులను భంగపరిచినా.

*3(1) (vi) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు ప్రభుత్వం తప్పనిసరైన ప్రజోపయోగ పనులకు తప్ప, ఇతరులు బలవంతంగా వెట్టిచాకిరి చేయించడంగాని, బలవంతంగా పని చేయించడం గాని ఈ చట్టం క్రిందనేరం.

*3(1) (vii) :* షెడ్యూలు కులాలు,షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తిని చట్టం ప్రకారం నిర్దేశించి ఓటు వేసే విధానంలో కాకుండా, ఇతర విధంగా ఓటు వేయమనడం, తాను చెప్పిన వ్యక్తికే ఓటు వేయమనడం, లేక వేయవద్దని బలవంతపెట్టడం.

*3(1) (viii) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తి తప్పు కేసులు, దురుద్దేశంతో గాని లేక పగ సాధించుకోవడానికి సివిల్, క్రిమినల్ కేసులలో ఇరికించడం.

*3(1) (ix) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు వ్యక్తిపై ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించి, ఆ వ్యక్తిని గాయపరచడానికి, ఏ విధంగానైనా సరే ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నం చేయడం.

*3(1) (x) :* బహిరంగ ప్రదేశంలో పలువురి ఎదుట షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తిని ఉద్దేశ్య పూర్వకంగా అవమాన పరచడం, వేదనకు గురిచేయడం.

*3(1) (xi) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన మహిళ గౌరవాన్ని భంగపరిచి ఆమెను అవమానం చేయాలనే తలంపుతో ఆమెపై బలప్రయోగం చేయడం.

*3(1) (xii) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన మహిళపై ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఆధిపత్యం చలాయించగల స్థానం, స్థాయిలో వుండి, ఆమెను లైంగికంగా ఉపయోగించుకొన్న ఎడల.

*3(1) (xiii) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు వ్యక్తులు సాధారణంగా వుపయోగించే కాలువలు, బావులు, చెరువులు, వాగులు, ఇతర ఏ వనరులనైనా వారి సాధారణ వుపయోగానికి పనికి రాకుండా పాడు చేయడం.

*3(1) (xiv) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వ్యక్తులు సాంప్రదాయకంగా ఉపయోగించుకొంటున్న దారులను మూసివేసినా, వెళ్ళకూడదని అడ్డగించినా, ఇదే విధంగా ఇతరులందరూ ఉపయోగించుకుంటున్న దారులను షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారిని ఉపయోగించుకోనీక అడ్డగించినా.

*3(1) (xv) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారిని వారి ఇళ్ళ నుండి లేక గ్రామం నుండి లేక వారు నివాసముంటున్న స్థలం నుండి వదిలి వెళ్ళి పోవడానికి బలవంతపెట్టినా లేక అందుకు కారణమైనా.

ఈ చట్టం క్రింద శిక్షార్హమైన నేరంపై కనబరచిన 3(1)(v) లేకా 3(1)(xv) వరకు చేసిన నేరాలకు 6 నెలలకు తక్కువ గాకుండా 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష, జరిమానా విధించబడును.

సెక్షన్ 3(2)(ii) లో క్లాజు (1) నుండి (7) వరకు ఏడు రకాలైన అత్యాచారాలను శిక్షార్హమైన నేరాలుగా గుర్తించడం జరిగింది.

*3(2) (ii) :* తన అబద్ధపు సాక్ష్యంతో షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, లేక మరణశిక్ష విధించే అవకాశముందని తెలిసీ ఒక అమాయకపు షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వ్యక్తికి మరణ శిక్ష పడేటట్లు సాక్ష్యం చెప్పిన వ్యక్తికి మరణశిక్ష విధించవచ్చు, లేక యావజ్జీవ కారగారశిక్ష, జరిమానా విధించవచ్చు.

సెక్షన్ 3(2)(ii) తన అబద్ధపు సాక్ష్యం ద్వారా ఒక షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలుకు చెందిన వ్యక్తికి ఏడేండ్ల జైలు శిక్ష పడుతుందని తెలిసీ తప్పుడు సాక్ష్యం చెప్పిన వ్యక్తి ఈ చట్టం క్రింద 6 నెలలకు తక్కువ కాకుండా 7 సంవత్సరాల వరకు కారాగార శిక్ష, జరిమానాతో శిక్షించబడతాడు.

*3(2) (iii) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వ్యక్తికి చెందిన ఆస్తులను నష్టపరచాలనే తలంపుతో కాని, లేక తన చర్యల వలన వారి ఆస్థినష్టం జరుగుతుందని తెలిసీ నష్టపెట్టడం లేక ప్రేలుడు పదార్థాలను వుపయోగించి పేల్చి వేయడం చేసిన వ్యక్తికి ఆరు నెలలకు తక్కువ కాకుండా 7 సంవత్సరాల వరకు జరిమానాతో కూడిన కారాగార శిక్ష విధించవచ్చు.

*3(2) (iv) :* షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తులు సాధారణంగా వుపయోగించుకొంటున్న ప్రార్థనా స్థలాలను, లేక నివాసముంటున్న ఇళ్ళను, లేక షెడ్యూలు కులాలు, షెడ్యూలు



Sthanka_JanBW.indd 26 30/12/10 3:03 PM

తెగలకు చెందిన వ్యక్తి తన ఆస్తి లేక వస్తువులను భద్రపరచుకొంటున్న గృహాన్ని గాని ధ్వంసం చేయాలనే తలంపులో, తన తన చర్యల వలన ధ్వంసమవుతాయని తెలిసీ తగుల బెట్టినా, లేక ప్రేలుడు పదార్థాలను ఉపయోగించి పేల్చి వేసినా ఆ వ్యక్తికి జరిమానాతో కూడిన యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చును.

*3(2) (v) :* భారతీయ శిక్షాస్మృతి (45 1860) ప్రకారం పది సంవత్సారాలు లేక అంతకుపైబడి శిక్షపడే నేరాన్ని ఒక షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తిపైగాని, అతని ఆస్తిపైగాని వేసిన యెడల ఆ నేరం చేసిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చు.

*3(2) (vi) :* ఈ చట్టం క్రింద కనబరచిన నేరాలను చేసిన నిందితున్ని కాపాడాలనే వుద్దేశ్యంలో ఆ నేరాలకు సంబంధించిన సాక్ష్యాలను నాశనం చేసినా, లేదా తప్పు సమాచారం ఇచ్చినా, ఆ నేరానికి విధించే శిక్షను ఈ వ్యక్తికి కూడా విధించవచ్చును.

*3(2) (vii) :* ఒక ప్రభుత్వ ఉద్యోగిగా వుంటూ ఈ చట్టం క్రింద ఏదైనా నేరం చేసినట్లైతే, ఒక సంవత్సరానికి తక్కువ గాకుండా కారాగార శిక్ష, ఈ చట్టం క్రింద ఆ నేరానికి నిర్దేశించబడిన శిక్ష ఎంత వుందో ఆ మేరకు శిక్షించవచ్చు.

## కొన్ని ముఖ్యమైన ఇతర సెక్షన్లు

**సెక్షన్ 4 :** ఈ చట్టం క్రింద విధి నిర్వహణా లోపానికి శిక్ష. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన ప్రభుత్వ అధికారి ఈ చట్టం క్రింద తాను నిర్వహించవలసిన కర్తవ్యాన్ని ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన ఎడల 6 నెలలు తక్కువ గాకుండా ఒక సంవత్సరం కారాగార శిక్ష విధించవచ్చు.

**సెక్షన్ 5 :** ఈ చట్టం క్రింద రెండవసారి నేరానికి శిక్షాకాలం పెంపు. ఈ చట్టం క్రింద పేర్కొన్న నేరాలను చేసి శిక్ష విధింపబడిన వ్యక్తి రెండవసారి నేరం చేస్తే, ఒక సంవత్సరం తక్కువ కాకుండా ఆ నేరానికి పొందు పరిచిన శిక్ష విధించవచ్చు.

**సెక్షన్ 6 :** భారతీయ శిక్షాస్మృతి (1860) లోని సెక్షన్ 34, అధ్యాయం, IV, V, VA, సెక్షన్ 149, అధ్యాయం 23 లలోని అంశాలను ఈ చట్టం కొరకు కూడా అదేవిధంగా ఉపయోగించవచ్చును.

**సెక్షన్ 7 :** నేరం చేసిన వ్యక్తుల ఆస్తులను జప్తు చేయటం గురించి తెలియచేస్తుంది.

*సెక్షన్ 7(1) :* నేరస్థుడు నేరానికి ఉపయోగించిన స్థిర చరాస్తుల ను ప్రభుత్వ పరం అయినట్లు కోర్టు లిఖిత పూర్వకంగా ప్రకటించడం.

*సెక్షన్ 7(2) :* విచారణ ముగిసే వరకు స్థిర చరాస్తులను కోర్టు ఆధీనంలో ఉంచుకోవడం.

**సెక్షన్ 10 :** నేరం చేస్తాడని భావించిన వ్యక్తిని ఆ ప్రాంతం నుండి బహిష్కరించటం గురించి..

**సెక్షన్ 14 :** జిల్లాకో ప్రత్యేక ఏర్పాటు గురించి.

**సెక్షన్ 15 :** ప్రతి ప్రత్యేక కోర్టుకు ఒక ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియమకం గురించి.

**సెక్షన్ 16 :** సామూహిక జరిమానా విధించటానికి రాష్ట్ర ప్రభుత్వానికి గల అధికారం గురించి.

**సెక్షన్ 17 :** శాంతి భద్రతల యంత్రాంగం చేపట్టవలసిన ముందస్థు నిరోధక చర్యల గురించి...

**సెక్షన్ 18 :** ఈ చట్టం క్రింద నేరస్థులకు ముందస్తు బెయిలు వర్తించకుండుట గురించి...

**సెక్షన్ 21 :** ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవలసిన తగిన చర్యలు గురించి.

(i) బాధితులకు న్యాయ సహాయం.

(ii) పరిశోధన, విచారణ సమయాల్లో ప్రయాణ, పోషణ ఖర్చు

(iii) ఆర్థిక, సాంఘిక, పునరావాస ఏర్పాట్లు

(iv) నేర విచారణ, పర్యవేక్షణ అధికారుల నియామకం.

(v) ఆయా స్థాయిలలో కమిటీల ఏర్పాటు.

(vi) తగు సలహాల కొరకు సర్వేతో నిర్వహించటం

(vii) అత్యాచార ప్రాంతాలను గుర్తించి, తగు చర్యలు చేపట్టడం.

పైన కనబరచిన అంశాలన్నీ ఈ చట్టంలో చెప్పబడిన అంశాలు కాగా ఈ చట్టం అమలు కోసం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు అత్యాచారాల నిరోధక నిబంధనలు 1995లో అనేక నిబంధనలను రూపొందించారు.

**రూల్ 3 :** ప్రభుత్వం చేపట్ట వలసిన ముందస్తు నిరోధక చర్యల గురించి.

**రూల్ 4 :** ప్రాసిక్యూషన్‌ను పర్యవేక్షించడం, నివేదికలు సమర్పించడం గురించి.

**రూల్ 5 :** పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జీగా వున్న పోలీస్ అధికారికి అత్యాచారం గురించిన సమాచారంతో బాధితులు వచ్చినపుడు ఆ అధికారి నిర్వర్తించవలసిన బాధ్యతల గురించి.

**రూల్ 6 :** తమ పరిధిలోని ప్రాంతంలో షెడ్యూలు కులాలు,షెడ్యూలు తెగల వ్యక్తులపై అత్యాచారం జరిగిందని తెలిసినప్పుడు జిల్లా, డివిజనల్ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి, నిర్వర్తించవలసిన బాధ్యతల గురించి.

**రూల్ 7 :** విచారణాధికారిని నియమించడం, సంఘటన జరిగిన 30 రోజుల్లో విచారణ పూర్తిచేసి ఎస్పీకి నివేదిక ఇవ్వడం, దీనిపై పురోగతికి ప్రతి 3 నెలలకొకసారి రాష్ట్ర స్థాయిలో అధికారులు సమీక్షించడం గురించి.

**రూల్ 8 :** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల పరిరక్షణ సెల్ ఏర్పాటు చేయడం గురించి.

**రూల్ 9 :** ఈ చట్టం క్రింద నిర్దేశిత బాధ్యతలను నిర్వహించవల సిన వివిధశాఖల అధికారుల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ ఎప్పటికప్పుడు సమీక్షించడానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించడం గురించి.

**రూల్ 10 :** స్పెషల్ ఆఫీసర్ల నియామకం గురించి బాధితులకు తగిన రక్షణ, సదుపాయాల ఏర్పాటు, అత్యాచారక నిరోధక చర్యలు, చట్టం,



Sthanka_JanBW.indd 27 30/12/10 3:03 PM

హక్కుల పట్ల వారిలో అవగాహన పెంచడం, బాధ్యతల నిర్వహణ గురించి.

**రూల్ 11** : అత్యాచార బాధితులకు, వారిపై ఆధారపడిన వ్యక్తులకు, సాక్షులకు ప్రయాణభత్యం రోజువారీ భత్యం, నిర్వహణ ఖర్చులు, ప్రయాణ సౌకర్యాల గురించి...

**రూల్ 12** : జిల్లా పరిపాలనా యంత్రాంగం తీసుకోవలసిన చర్యల గురించి.

**రూల్ 13** : అత్యాచారం జరిగిన ప్రాంతంలో నియమించబడే అధికారులు, ఇతర సిబ్బంది నియామకం, ఎంపిక చేసుకోవడం గురించి షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల సమస్యల పట్ల సరైన అవగాహన కలిగివుండే వారుగా, షెడ్యూలు కులాలు, షెడ్యూలుతెగల నుండి వచ్చిన వారు వుండేట్లు చూడడం గురించి...

**రూల్ 14** : రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత గురించి - బడ్జెట్ కేటాయింపు, అధికారుల నియమకాలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకాలు, సంవత్సరానికి రెండుసార్లు సమీక్షలు, నివేదికలు, ముందస్తు జాగ్రత్తలు పునరావాస చర్యలు - గురించి

**రూల్ 15** : రాష్ట్ర ప్రభుత్వం కంటింజెన్సీ ప్రణాళిక అధికార గెజిట్‌లో ప్రచురించడం, సహాయ కార్యక్రమాల ప్యాకేజీ అంశాలు, అధికారుల బాధ్యతల గురించి.

**రూల్ 16** : రాష్ట్ర స్థాయి విజిలెన్స్ (నిఘా), మానిటరింగ్ పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు.

**రూల్ 17** : జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటు గురించి - వారి బాధ్యతలు ప్రతి 3 నెలలకొకసారి సమావేశం- సమీక్ష గురించి.

**రూల్ 18** : రాష్ట్ర ప్రభుత్వం - ప్రతి సంవత్సరం మార్చి 31 ముందుగా చట్టం అమలు చేసేందుకు గత సంవత్సరంలో తీసుకొన్న చర్యలు, పథకాలు, ప్రణాళికలు, చర్యల గూర్చి ఒక వార్షిక నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం గురించి.

అనుబంధం 1, షెడ్యూలు (రూల్ 12(4) లో ధన సహాయం కొరకు పాటించవలసిన నియమాల గురించి తెలియపరచబడింది.

అయితే అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకోవడం వలన ఈ చట్టం బాధితులలో నమ్మకాన్ని పెంచకపోగా, వారిని నిరుత్సాహానికి, నిస్పృహకు గురిచేస్తున్నది.

బాధితులను బెదిరించి కేసు రాజీ చేసికోవడానికి నిందితులకు తగినంత సమయాన్ని చేకుర్చుతూవుంది.

ఇతర కులస్థుల నుండి సాక్షులు కడ వరకు నిలువక పోవడం షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల నుండి సాక్షులను పరిగణనలోకి తీసికోకపోవడం వలన కేసులు నీరుగారి పోతున్నాయి.




మరోవైపు ఈ చట్టం దుర్వినియోగమౌతుందని కొందరు గగ్గోలు చేస్తున్నారు. అతి కష్టం మీద కేసు నమోదైనా నిందితులు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసి- కేసు న్యాయ విచారణ, నిందితుల అరెస్టు తదితర ప్రకియలన్నింటిపై విచారణకు తాత్కాలిక (నిలుపుదల) ఉత్తర్వులు తీసుకొని రావడం వల్ల ఇక శాశ్వతంగా ఆ కేసును నిలుపుదల చేయడం వంటివి సర్వసాధారణంగా జరిగే ప్రక్రియలై, ఈ చట్టం వునికినే ప్రశ్నార్థకంగా తయారుచేస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో చట్టాన్ని విస్తృతంగా ప్రజలలోకి తీసికొని వెళ్ళవలసిన అవసరమెంతో వుంది. ఇందుకు ప్రభుత్వం అనేక చైతన్య కార్యక్రమాలను చేపట్టాలి. మహిళా సంఘాలలోనూ, గ్రామ పంచాయతీలలోను శ్రమశక్తి సంఘాలలోనూ, CDS సెంటర్ల ద్వారానూ ప్రజలలో ఈ చట్టం పట్ల అవగాహన కల్పించాలి.

- ★ కమిటీలన్నీ సక్రమంగా పని చేసేటట్లు చూడాలి.
- ★ బాధ్యతలను నిర్లక్ష్యం చేసిన అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.
- ★ కేసుల విచారణ, చార్జిషీటు తయారు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియమకం మొదలగు విషయాలలో లోటుపాట్లను పూరించి ఎక్కువ కేసులలో శిక్షలుపడే విధంగా చూడాలి.
- ★ చట్టాన్ని మరింత ప్రతిభావంతంగా అమలు చేయాడానికి చట్టంలో సవరణలు, సమూల మార్పులు తీసికొని రావాలి.

ఈ విధంగా జరిగితే దళిత, గిరిజనులలో చట్టం పట్ల విశ్వాసం పెరుగుతుందని ఆశించవచ్చు.

దళిత, గిరిజనల నుండి యువత, మేధావులు ముందుకు వచ్చి ఈ చట్టం సక్రమమైన అమలుకొరకు జిల్లా, డివిజన్ల స్థాయిలలో కమీటీలుగా ఏర్పడి అమలులో జరిగే లోటుపాట్లును ఎత్తి చూపుతూ, అందుకు బాధ్యులైన అధికారులలో ప్రజలలో ఈ చట్టం పట్ల అవగాహన కల్పించాలి.

*- నందగోపాల్*



# దోమలతో సమరం

**దోమ మనిషిని భయంకర శత్రువుగా వేటాడుతూ ఆరోగ్యానికి చేటు తెస్తోంది. స్వల్పవ్యవధిలో విశేష సంఖ్యలో విస్తరించే దోమలు క్రిమిసంహారక మందుల్ని సైతం క్రమంగా తట్టుకుని మనగలవు. అందుకే మలేరియాను పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. దోమలు ఎన్నో సమస్యల ను సృష్టిస్తున్నాయి. కార్మికుల శ్రమ ఉత్పాదకతను 30 శాతం మేర తగ్గించేస్తున్నాయంటే వీటి బెడద ఎంత తీవ్రంగా ఉందో ఊహించవచ్చు.**

మగదోమలు మనిషికి ఎటువంటి హాని చేయవు. అవి మొక్కల మకరందాన్ని పీల్చి బతుకుతూ ఉంటాయి. ఆడదోమలు ఉష్ణరక్త జంతువుల రక్తం పీల్చుతాయి. ఇవి ఒక మనిషిని గాని, కందిరీగను గాని 500 మీటర్ల దూరంలో ఉండగానే గుర్తిస్తాయి.

కొన్ని ప్రాంతాల్లో ఎలుగుబంట్లు తమ శరీరాలపై వాలిన దోమల ను చంపివేయడానికి అవి నేలపై పడి దొర్లుతాయి. ఈ పద్ధతి వల్ల దోమలు చావకపోతే అవి మంచుగడ్డ కట్టే చలి గల నీటిలో దిగుతాయి. యుకుటియాలోని కోతిమానది ఒడ్డున ఇటువంటి దృశ్యాలు కన్పిస్తాయి.

అదను చూసి మనిషి రక్తాన్ని నంజుకొంటూ ఒక్కో కాటుతో తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి దోమలు. కరచి వెళ్లడం కాదు, మనిషి శరీరంలోకి వ్యాధికారక సూక్ష్మజీవుల్ని ప్రవేశపెడతాయి.

దోమకాటుతో ఒక్క మలేరియా మాత్రమే కాదు, ఎల్లో ఫీవరు, డెంగ్యూ ఫీవరు, మెదడువాపు వ్యాధి వంటివి మనుషుల మీద విరుచుకుపడి ప్రాణాలు కూడా తీస్తున్నాయి.




## ఎనాఫిలిస్ దోమ

ఎనాఫిలిస్ అనే ఆడదోమకు 'ప్లాస్మోడియం పాల్సిఫారమ్' అనే మైక్రోబ్‌తో మంచిస్నేహం. జన్యుపరమైన ఏర్పాట్ల వల్ల ఈ మైక్రోబ్ ఎనాఫిలిస్ ఆడదోమ లాలాజల గ్రంధుల్లో తలదాచుకుంటుంది.

మనిషిని ఎనాఫిలిస్ దోమ కాటు వేయగానే దాని లాలాజలంలోని మైక్రోబ్ మనిషి రక్తనాళాల్లోకి ప్రవేశిస్తుంది. ఈ మైక్రోబ్ మనిషి రక్తంలోని ఎర్రకణాలపై వ్యూహాత్మకంగా దాడి చేస్తుంది. ఎర్రకణాలు విరిగిపోవడంతో వాటికి ప్రాణవాయువును సరఫరా చేసే శక్తి నశిస్తుంది. ఫలితంగా మూర్ఛరోగం, మూత్రపిండాలు దెబ్బతినడం వంటివి సంభవిస్తాయి. ఇవే ప్రాణం తీస్తాయి.

ఎనాఫిలిస్ ఆడదోమ నిశాచరి. పగలు నిద్ర, రాత్రి సంచారం. నిద్రిస్తున్న మనుషుల్ని కాటేస్తుంది. ఇది విపరీతంగా గుడ్లు పెడుతుంది. మానవ ఆవాసాల్లో స్థిరనివాసం ఏర్పరచుకుంటూ, ఎటువంటి వాతావరణాన్ని అయిన తట్టుకుని బతకగల సమర్థత దీనిది. ప్రతికూల పరిస్థితులను కూడా సానుకూలం చేసుకోగలడం జన్యుపరంగా దీనికి లభించిన వరం. ఇది సంచరించని ప్రాంతం మనదేశంలో లేదు.

జగత్ విజేతగా పేరు తెచ్చుకున్న అలెగ్జాండర్ క్రీ.పూ. 323లో మరణించడానికి కారణం దోమకాటుకు బలై మలేరియా వ్యాధి సోకడం అని చరిత్ర చెబుతోంది. చివరకు ఈ దోమలకు భయపడి చెంఘిజ్‌గాన్ పశ్చిమ ఐరోపాపై దండయాత్రను విరమించుకున్నాడని చెబుతారు.

## క్యూలెక్స్ దోమ

ఎనాఫిలిస్ దోమకు తోడుగా క్యూలెక్స్ దోమ కూడా బోలెడంత విధ్వంసం సృష్టిస్తోంది. క్యూలెక్స్ దోమ కాటు భరించలేని బాధను కల్గిస్తుంది. అయితే ఈ దోమల్లోని అన్ని తెగలు ప్రమాదకరమైనవి కావు. కొన్నిరకాలు కుడితే మాత్రం ప్రాణాల మీద ఆశ వదులుకోవలసిందే.

బాతుల్లోను, కొంగల్లోను, పందుల్లోను నివాసం ఏర్పరచుకునే వ్యాధికారక సూక్ష్మజీవులను మనిషి శరీరంలో ఈ క్యూలెక్స్ దోమలు ప్రవేశపెట్టగల్గుతున్నాయి. ఈ సూక్ష్మజీవులు మనిషి రక్తం ద్వారా మనిషి మెదడును చేరుకుంటాయి. మెదడు కణజాలాన్ని తీవ్రమైన వాపుకు గురిచేసి వాంతులు, జ్వరం వంటి లక్షణాలతో అపస్మారక స్థితిలోకి నెట్టివేస్తాయి. దీనినే మెదడు వాపు వ్యాధి అంటారు. వైద్య పరిభాషలో 'జపనీస్ ఎన్‌సెఫలైటీస్' అంటారు.

'ఏడెస్ ఎజిప్టి' అనే మరొక రకం దోమ కాలగమనంలో ఫ్లయింగ్ టైగర్‌గా పేరు తెచ్చుకుంది. మొదట్లో ఇది అడవుల్లో ఉండేది. క్రమంగా నగర ప్రవేశం చేసి చల్లదనం ఉండే ప్రాంతాలను నివాస ప్రాంతాలుగా చేసుకుని తన సంతానాన్ని అభివృద్ధి పరచుకుంది.



Sthanka_JanBW.indd 22 30/12/10 3:03 PM

దీని కాటువల్ల 'ఎల్లో ఫీవర్' వస్తుంది.

ఈ ఫ్లయింగ్ టైగర్ లాలాజలంలో 'చిక్‌గున్యా' అనే వైరస్ ఉంటుంది. ఈ వైరస్ దాని లాలాజల గ్రంథుల నుండి లాలాజలంలోకి చేరుతుంది. మనిషిని ఇది కాటువేయగానే ఈ వైరస్ మనిషి శరీరంలో ప్రవేశించి జీర్ణాశయానికి చేరుకుంటుంది. అచట రక్తస్రావం మొదలయి, జ్వరం వచ్చి పచ్చకామెర్లు మొదలవుతాయి. చివరకు మృత్యువు సమీపిస్తుంది.

దోమల్లో మొత్తం 2,500 తెగలు వున్నాయి. వీటిలో 100 తెగలు మాత్రమే హానికరమైనవి. ఎక్కువగా జంతు రక్తం మీద ఆధారపడినవి. మనిషి రక్తం మీద ఆధారపడినవి తక్కువే అయినా అవి సృష్టిస్తున్న బీభత్సం మనిషికి పెనుసవాలుగా మారింది.




### డెంగ్యూ జ్వరం

మనిషిని ఫ్లయింగ్ టైగర్ కాటు వేయగానే దాని లాలాజలంలోని వైరస్ మనిషి శరీరంలోకి ప్రవేశిస్తుంది. దీని ప్రభావం వల్ల రెండు, మూడు రోజులు మనిషికి బద్ధకంగాను, తలనొప్పిగానుఉంటుంది. ఆ తరువాత జ్వరం దాదాపు 102 డిగ్రీల ఫారన్ హీటు ఉంటుంది. తల నొప్పి, పళ్ళు నొప్పులు, కళ్లు ఎర్రబడడం, కళ్ల వెంట నీళ్లు కారడం, కీళ్లనొప్పులు మొదలవుతాయి.

కాళ్లు, చేతుల మీద ఎర్రటి పొంగు మొదలయి, పొట్ట మీదకు పాకుతుంది. ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు మొదలవుతాయి. ఈ డెంగ్యూ జ్వరం తీవ్రతరం అయ్యేసరికి కాళ్లు, చేతులు చల్లబడడం ముక్కు నుండి, నోటి నుండి రక్తం కారడం, నిద్రలేమి, ఊపిరి ఆడకపోవడం వంటి బాధలు మొదలవుతాయి.

ఈ జ్వరానికి ప్రత్యేకమైన మందులు ఏమీ లేవు. అవసరమైనపుడు రక్తం ఎక్కిస్తూ ఉంటారు. దోమల బారిన పడకుండా పద్ధతులు అవలంబించడం ఒక్కటే దీనికి నివారణ మార్గం.

### దోమల కథ

- మగదోమ 8 నుండి 10 రోజుల వరకు జీవిస్తుంది.
- ఆడదోమ ఒక నెల వరకు జీవిస్తుంది.
- దోమల రెక్కల వెనుక చిన్న చిన్న బ్యాలెన్సర్లు ఉంటాయి. దోమల ప్రయాణాన్ని ఇవి అదుపు చేస్తూ ఉంటాయి. అందుకే దోమలు ఎక్కడ దిగాలంటే అక్కడ దిగ్గల్గుతాయి.
- దోమలు 10 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించగలవు.
- ఆడదోమ ఎగిరేటప్పుడు దాని రెక్కలను సెకనుకు 250 నుండి 500 సార్లు కొట్టుకుంటుంది. ఇది గంటకు అయిదు కిలోమీటర్ల వేగంతో ఎగురగల్గుతుంది.
- రక్తం తాగిన ఆడదోమ ఒళ్లు బరువెక్కి ఎగరలేని స్థితికి వస్తుంది. నలభయి అయిదు నిముషాల తరువాత తాగిన రక్తం జీర్ణం అయిన తరువాత మళ్లీ చురుగ్గా ఎగిరి రక్తం కోసం అన్వేషిస్తుంది.
- దోమ తన బరువుకు రెండు మూడు రెట్లు బరువుగల్గిన రక్తాన్ని పీల్చుకుంటుంది.
- ఆడ-మగదోమలు సంసార సమయం ఒక నిముషం. అండాన్ని జీవితకాలం సాఫల్యం చేసుకునే శక్తి ఆడదోమకు ఉంటుంది. మగదోమ వీర్యకణాల్ని ఆడదోమ నిల్వ చేసుకోగలదు. అండం వెలువడే సమయంలో ఈ వీర్యకణాలను వినియోగించుకుని సంతానోత్పత్తిని కొనసాగిస్తుంది.

### దోమల నివారణ

దోమల నివారణకు ప్రస్తుతం మూడు రకాల పద్ధతులు అవలంభిస్తున్నారు.

- చుట్టలు లేదా క్వాయిల్స్ వెలిగించి దోమలను దూరంగా పారద్రోలుతున్నారు.
- టార్‌టాయిన్, రూస్టర్ వంటి చుట్టలు మార్కెట్లో మంచి గిరాకీగా వున్నాయి.
- దోమలు వాలకుండా శరీరానికి క్రీములు రాసుకోవడం రెండవ పద్ధతి. ఈ క్రీములు ద్రవరూపంలో గాని, పేస్టు రూపంలోగాని ఉంటాయి. ఓడోమాస్, ఫైలాల్ వంటివి ఉదాహరణలు.
- ఎలుకలకు ఉపయోగించే మందులు మూడవ పద్ధతి వీటిని పాడ్స్ లేదా మాట్స్ అని పిలుస్తారు. ఇంకా గుడ్‌నైట్, వేప్, లయన్, బానిష్, కాస్పర్ వంటివి కూడా మార్కెట్లో లభిస్తున్నాయి.

పై పద్ధతుల ద్వారా దోమలను మనిషి మీద వాలకుండా తరిమి వేయగల్గుతున్నాము.

వీటి వాడకం వల్ల దోమల నివారణ సంగతి ఎలా ఉన్నా వాటివల్ల మనిషికి హాని కల్గుతుందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. రోజుకి 8 నుండి 12 గంటల పాటు ఈ రసాయనాలు పీల్చుతున్న వారిలో కొందరు అనారోగ్య పీడితులవుతున్నారు.

గది తలుపులన్నీ మూసివేసి కిటికీలను బిగించి మస్కిటో మ్యాట్స్ వెలిగించడం ఆరోగ్యానికి మంచిది కాదని చెబుతున్నారు. వీటివల్ల ముక్కు దిబ్బడ, అలర్జీ, గొంతునొప్పి, డెర్మటైటిస్, దద్దుర్లు, దురద వచ్చే అవకాశం ఉంది.

దోమల నివారణకు వేపాకు పొగవేసి ఇంట్లో దోమలను తరిమి వేయడం ఉత్తమమని సలహా ఇస్తున్నారు. ఆరు



Sthanka_JanBW.indd 23 30/12/10 3:03 PM

బయట కాకుండా ఇంట్లో నిద్రించడం మంచిది. ఇంటికి సమీపంలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమలు ఇంట్లో పెరగకుండా ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

### దోమలతో యుద్ధం

దోమల నివారణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, కొత్త కొత్త క్రిమిసంహారక మందులు కనిపెడుతున్నా అనేక రోగాలు కలిగించే దోమల జాతుల్లో ఇంతవరకు ఒకటి కూడా అంతరించలేదు. దోమల రోగ నిరోధకశక్తి మానవుల రోగ నిరోధకశక్తి కన్నా ఎక్కువకావడమే ఇందుకు కారణం.

దోమ జాతులకు ఏ క్రిమిసంహార మందుల వల్ల కించిత్తు ఇబ్బంది కూడా కలగలేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఏటా పది కోట్లకు మించి మలేరియా వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా నమోదు అవుతున్నాయి. ఒక ఆఫ్రికా ఖండంలోనే ప్రతి ఏటా పది లక్షలకు మించి ప్రజలు మలేరియా వాతపడి మరణిస్తున్నారు.




దక్షిణ, ఆగ్నేయాసియాల్లోని వరి చేలల్లోను, పశ్చిమాసియాలోను, ఆఫ్రికా, లాటిన్, అమెరికాలలోని మహానదుల చుట్టు పక్కల దోమల బెడద చాలా ఎక్కువగా ఉంది. వర్థమాన దేశాల్లో కొత్తగా పుట్టుకు వస్తున్న పట్లణాల్లో దోమల వ్యాప్తి చాలా ఎక్కువగా ఉంది.

దోమల నివారణ కోసం చాలాకాలం నుంచి స్ప్రేయర్లు, క్రిమిసంహారిణులు ఉపయోగిస్తున్నా వాటికి దోమలు పెద్దగా లొంగలేదు. దోమలపై మొదటిసారిగా కొంత ప్రభావం చూపిన మందు డి.డి.టి. క్రమంగా ఈ మందు కూడా దోమలపై మొదట్లో చూపినంత ప్రభావం చూపలేకపోయింది.

డి.డి.టి. వాడి దోమలను నివారణ చేసిన కొలంబియా, మడగాస్కర్ ప్రాంతాల్లో ఇప్పుడు దోమలు మళ్లీ తామర తుంపరులుగా పుట్టుకొస్తున్నాయి. డి.డి.టిని చల్లినప్పుడు మొదట చాలా దోమలు నశించినా కొన్ని దోమలు మాత్రం డి.డి.టి.ని కూడా తట్టుకుని బతకగల గుడ్లు పెట్టడం ప్రారంభించాయి.

కొత్త కొత్త క్రిమిసంహారిణులు కనిపెట్టినా 5 నుండి 10 సంవత్సరాలు గడిచేసరికి వాటిని తట్టుకోగల సామర్థ్యాన్ని దోమలు సంపాదిస్తున్నాయి. ఈ క్రిమిసంహారిణుల వల్ల మనుషులకు హాని కల్గదా? అన్న ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పడం లేదు.

దోమల నివారణకు శాస్త్రవేత్తలు ఎంత కృషి చేసినా ప్రజల సహకారం లేనిదే కృషి ఫలించదని ప్రపంచ ఆరోగ్యసంస్థ చెబుతోంది. శానిటరీ ఇంజనీర్ల సంఖ్య తగ్గిపోవడం పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

### తీసుకోవలసిన జాగ్రత్తలు

దోమల సైన్యం అభివృద్ధి చెందకుండా ఎవరికి వారే జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వాటిని అరికట్టగల్గిన వారవుతారు.

❖ దోమ తెరలను వాడుకోవాలి

❖ కిటికీల గుండా దోమలు ప్రవేశించకుండా వాటికి తెరలు బిగించుకోవాలి. సాయంత్ర సమయంలో బయట నుండి దోమలు ఇంట్లో ప్రవేశించకుండా తలుపులు మూసివేసుకోవాలి.

❖ నీరు నిల్వ ఉండే పాత్రలపై మూతలు ఉంచుకోవాలి.

❖ ఇంటిపై నిర్మించుకున్న నీళ్ల ట్యాంకుకు విధిగా మూతపెట్టాలి. ఈ నీళ్ల ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి.

❖ నీళ్లు నింపని బకెట్లు, డ్రమ్ములు, డబ్బాలు వంటివి బోర్లించి ఉంచుకోవాలి.

❖ దోమగుడ్లు పెరగకుండా నిల్వ మురికి నీటిలో కిరసనాయిల్ స్ప్రే చేయాలి. మందుల్ని వెదజల్లాలి.

❖ ఇంటి అలంకరణ కోసం పెట్టుకున్న పూలకుండీలలోని నీటిని రోజు విడిచిరోజు మారుస్తూ ఉండాలి.

*- సి.వి. సర్వేశ్వరశర్మ*






Sthanka_JanBW.indd 24 30/12/10 3:03 PM

# వచ్చే శతాబ్దపు తెలుగు కవితా రీతులు

## అధికార భాషా లాలస

***అ**సలు సిసలు దేశాభిమానిగా, గాంధేయవాదిగా, ప్రతిపక్ష సభ్యునిగా ప్రజల మన్ననలు విశేషంగా పొందిన వావిలాల గోపాలకృష్ణయ్య గారికి అంకెలు, తేదీలు, అంచనాలు జిహ్వాగ్రాన వుంటాయి, తెలుగును అధికార భాషగా ప్రవేశపెట్టే ప్రణాళికలో వారి ప్రమేయం అమేయం. ఈ చిత్రంపై వారిచ్చే రివ్యూ (కాదంటే నివేదిక) ఎలా వుంటుందో అనే ఊహకు అక్షర రూపం.*




"**1977-78** సంవత్సరపు బడ్జెట్ సమావేశముల నిమిత్తం హాజరు అయిన సందర్భంగా రాష్ట్ర రాజధానిలో 'పిచ్చి ప్రేమ' అను చిత్రమును చూచియుంటిని. అప్పుడప్పుడే అనగా 1974 ఆర్థిక సంవత్సరము చివర నుంచి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆర్థిక పరిస్థితియున్నూ, ప్రజల స్థితిగతులున్నూ స్వల్పముగా మెరుగుపడినట్లు కనబడుచున్నది.

1975 సంవత్సరాంతమున రాష్ట్ర అర్థగణాంక శాఖ వారు విడుదల చేసిన చిత్తు అంచనాల నివేదికను బట్టి తలసరి ఆదాయం 3 నుండి 5 శాతం మేరకు పెరిగినట్లు తెలియుచున్నది. ఇట్టి దశలో భారీ వ్యయంతో టాకీలను నిర్మించుట వాంఛనీయము కాదు. బీదాసాదా వినోదం కొరకు వ్యయపరచుటవలన ఇవి దేశ ఆర్థిక రంగానికి గొడ్డలిపెట్టు కాగలవని మనవి చేయుచున్నాను. ఒక్క గుంటూరు జిల్లాలోనే రోజా మూడులక్షల నలభై రెండువేల పధ్నాలుగుమంది చలన చిత్రాలను చూచుచున్నారని ఒక అంచనా. వీరిలో అరవైశాతం స్త్రీలు కాగా పది శాతం పురుషులు. మిగతావారు బాలబాలికలు.

ప్రేక్షకుల ద్వారా రాష్ట్రం మొత్తం మీద లెక్కలు కట్టినట్లయితే రోజువారీ వసూళ్ళు ముప్పది లక్షల అరవై నాలుగు వేల అయిదు వందల నాలుగు రూపాయలదాకా వుంటుంది. ఈ మొత్తాలతో



లోగడ సూచించిన అత్యవసర పథకాలు అనగా (అ) పిడుగురాళ్ళ మురుగు కాల్వ త్రవ్వకం, (ఆ) సత్తెనపల్లి దిగువన బ్రిడ్జి నిర్మాణం (ఇ) వరదవాగు పూడికపథకం పూర్తియగుననిన్నీ సదరు సర్కారు వారికి తెలియజేయుచున్నాను.

ఈ చిత్రంలోని పాత్రలు తమ సంభాషణలలో ఆంగ్ల పదములను విరివిగా ఉపయోగించుట గమనార్హం. ఆంధ్రప్రదేశ్ గజెటు ప్రకటన ద్వారా తెలుగు భాషను ప్రభుత్వ కార్యకలాపాలకు కూడా విధిగా వాడవలెనని నిర్దిష్టపరచియున్నారు. తెలుగు భాషను తాలూకా స్థాయికి, ఫిర్కా మరియు గ్రామ స్థాయికి తీసుకు వెళ్ళడానికి ప్రభుత్వం, అధికార భాషా సంఘం కృషిచేయుచున్నవి. ఇట్టి దశలో మన చలన చిత్రాలలో ఆంగ్లభాష నుపయోగించుట శోచనీయం. సెన్సారు నిబంధనావళిని ఆ మేరకు సవరించాలని కూడా మనవి చేయుచున్నాను. రాజ్యాంగంలోని 8వ నిబంధనావళిని అనుసరించియు, 9-4-77న 931 జి.ఎ.డి. ప్రభుత్వ తాఖీదు ననుసరించియు ఈ క్రింది సందర్భాలలో తెలుగు భాషను వాడవలెనని స్పష్టమగుచున్నది.

..................... ......................... .......................

*(చిత్రం గురించి ఏమీ లేదంటున్నాం. అదే మరి చిత్రం!)* ☆

## ఎ-డిటో-రియల్

**ది**నపత్రికల సంపాదకీయాలకు ఒక ప్రత్యేకమైన బాణీ వుంటుంది. ఏ అంశాన్ని అయినా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆలోచించి, దేశ సమస్యలకు ముడి పెట్టి చివరకు ఒక చిన్న సూచనలాంటి సందేశం ఇచ్చి ముగించడం జరుగుతూ వుంటుంది. భాషాపరమైన శైలిని కాకుండా భావపరంగా మాత్రమే అనుకరించాలని ఈ ప్రయత్నం. ఒక్కొక్క పత్రికకు ఒక్కొక్క శైలి, కొన్ని పట్టుబడి పదాలు వుంటాయి. అయితే ఇక్కడ జనరలైజ్ చేసి మాత్రమే చూపిస్తున్నాను.



నేడు తెలుగు భాషలో విడుదల అవుతున్న చాలా చిత్రాలలో లోపాలు వుంటున్నట్టు అంగీకరించక తప్పదు. అయితే ఎంత కట్టుదిట్టంగా చిత్ర నిర్మాణ కార్యక్రమాన్ని రూపొందించినా, కొన్ని అవకతవకలు వుండకపోవు. అయినప్పటికీ తగు శ్రద్ధ వహించడం చిత్ర నిర్మాణానికి సంబంధించిన వ్యక్తుల కనీసధర్మం.



Sthanka_JanBW.indd 19 30/12/10 3:03 PM

ఇటీవల విడుదల అయిన 'పిచ్చిప్రేమ' సాంఘిక చిత్రం చూసినపుడు సాంకేతికపరంగా తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయి పెరిగిందని అనిపిస్తుంది. అయితే అందులోని అశ్లీల సన్నివేశాలు, అనభ్య పదజాలము ఎంతవరకు అవసరం?

ఒక వైపు అస్థవ్యస్థంగా వున్న దేశరాజకీయ పరిస్థితి, మరొక వైపు పెరిగిపోతున్న జనాభా, ఇంకోవైపు అదుపు తప్పిన శాంతి భద్రతలు -ఇన్ని సంక్షోభాలతో అయోమయంగా వున్న దశలో అశ్లీల సన్నివేశాలు గల చిత్రాలను విడుదల చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. నిన్న మొన్నటి వరకు స్కైలాబ్ ప్రపంచ పౌరుల నందరిని భయభ్రాంతుల ను చేసింది. ఇదే సమయంలో సాల్ట్-2 ఒడంబడికలపై అగ్రరాజ్యాల వారు సంతకాలు చేయడం వలన ఇటు కంబోడియాలో, నైఋతి ఆఫ్రికాలో కూడా అవాంఛనీయ పరిస్థితి నెలకొని వున్నది. పెట్రోలు, డీజెల్ వంటి ఇంధనాలకు పూర్తి కొరత ఏర్పడింది. అరబ్ దేశాల వైఖరిలో మార్పు వచ్చినట్టు తోచదు. ఇటువంటి పరిస్థితిలో 'పిచ్చిప్రేమ' లాంటి సాంఘిక చిత్రాన్ని విడుదల చేయడం గర్హనీయం.

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. రైతులు ఇంతవరకు వ్యవసాయ పనులు ప్రారంభించలేదని చాలా జిల్లాల నుంచి అప్పుడే మాకు వార్తలు అందుతున్నాయి. అంతర్జాతీయ జాతీయ రాష్ట్ర సమస్యల ను ప్రక్కకు నెట్టి ఒక మామూలు ప్రేమకథా చిత్రాన్ని వినోదం కోసం చూడడం దేశ శ్రేయస్సు దృష్ట్యా మంచిది కాదేమో!

*దేశ కాలమాన పరిస్థితులను కూడా జాగ్రత్తగా పరిశీలించి మాత్రమే సెన్సారు వారు చిత్రాల విడుదలకు అనుమతి ఇస్తే బాగుంటుంది.*

☆

## బాపుగారికి కవిసమ్రాట్ విశ్వనాథ అభినందన

**బాపు గారు రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు తీసుకుంటున్న సందర్భంగా**



**తమ ఆశీస్సులు పంపమని విశ్వనాథ సత్యనారాయణ గారిని కోరితే -వారు పంపే అభినందనలు లేదా అభిప్రాయం ఎలా వుంటుందో వూహిస్తే - ఆ ఊహకి అందిన వివరం యిది :**

కొందరు తామ్రపత్రములిచ్చి సన్మానించెదరు, ఒకడు సన్మాన పత్రముతో సరిపెట్టును. మరియొకడు శాలువా గప్పును. ఇది గుడ్డిలో మెల్ల. మరి కొందరు ధనమిచ్చి సత్కరించెదరు. ఇట్టి వారు యోగ్యులు, కనుక రాజాగారు యోగ్యులు. బిరుదములు, పొగడ్తలవలన బ్రాప్తించు బ్రయోజనమేమి? శూన్యము. అట్టివి యెన్నైనను బుక్కెడు కొఱ్ఱలు కాజాలవు, నాకు లౌక్యము తెలియదు, లోకసత్యము జెప్పుట నా మతము, ప్రతిభగలవారినిట్లు గౌరవించుట లోకశ్రేయ మగును.

ఇతన్ని బరామర్శింతము: ఇతడు యనగా బాపు. అది యతని కలము పేరు. ఇతడు చిత్రకారుడు కనుక కుంచె పేరు యనవలె. అతనికి అసలు పేరు యేమై వుండును. మనకు తెలియదు. కవి అక్షరములలో రచన సేయును. చిత్రకారుడనువాడు రేఖలతో, వర్ణములతో సేయును. ప్రయోజనము భావవ్యక్తీకరణ, రససిద్ధి. ఈతడు జిత్ర రచన యందేగాక చలనచిత్ర రంగమున దర్శకునిగా గూడ కొంత కీర్తి నార్జించినాడు. ఆ రంగమున కీర్తితోబాటు ధనము కూడా మిక్కిలిగా యార్జించవచ్చునని కొందరు జెప్పగా వినియుంటిని. సినిమాలోకము గురించి బొత్తిగా నాకు తెలియదు. గూడవల్లి రామబ్రహ్మము ఇట్టివాటితో లోగడ కొంత పేరు ప్రఖ్యాతులు బడసినాడు. మేమిద్దరమూ ఒక ఊరి వారమగుటచే నాకాపాటి తెలిసినది.

రమణయని వొకడున్నాడు, ముళ్ళపూడి వారు. ఇతని సహపాటి. వీరిద్దరూ మంచి స్నేహితులని నాకు తెలియును. స్నేహమనగానేమి? అదియొక అనుబంధము. అవగాహన దానికి ఆలంబన. రెండు జీవుల సమైక్య వేదన. జీవి యనగా ప్రాణి. అయినచో ప్రతి బ్రాణి స్నేహము చేయునా? చేయును. చేయదు -రాజేశ్వరరావని నాకు తెలిసి యొకడున్నాడు.

కలకత్తాలో జంతు శాస్త్ర మభ్యసించి బ్రస్తుతము సర్కారులో కార్యదర్శిగా నున్నాడు. జంతుశాస్త్రము జదివినవానికి కార్యదర్శి బదవి యిచ్చుట ఏమి? ఏమో -అతడందులకు అర్హుడని బైవారికి తోచివుండినది. అతనికి పక్షిశాస్త్రము గూడ కొంత తెలియును. పక్షులలో మైత్రి స్వభావము మెండుయని అతడొక పర్యాయము చెప్పినాడు - అతని భార్య రూపసి. పేరు కల్యాణి. కల్యాణియని యొక అశ్వజాతి గలదు. ఆ జాతి గుఱ్ఱము వేగమునకు బెట్టినది పేరు.

చూచితిరా ఈ వైచిత్రి? సంగీతజ్ఞుని భార్య యుగుచో మనకు కల్యాణిరాగము జ్ఞప్తికి వచ్చును. ఈతడు జంతుశాస్త్రవేత్త యగుటచే గుఱ్ఱము మనసున దోచినది. దీనిని స్ఫురణ అందుము. అదియొక మానసిక యవస్థ. అవస్థ యనగా స్థితి. అయినచో నిట్టి స్థితి.. (అదండీ పరిస్థితి)

☆

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక 3-12-82)*

## నారాయణ కల్పవృక్షమ్

విశ్వనాథ సత్యనారాయణగారు జీవించి వుండి అరుద్ర గారి



Sthanka_JanBW.indd 20 30/12/10 3:03 PM

**షష్టిపూర్తి ఉత్సవానికి సందేశం పంపివుంటే ఇట్లా వుండవచ్చు.**



భాగవతుల శంకరశాస్త్రి. ఇది కొందరికి తెలియును. కొందరికి తెలియదు. ఆరుద్ర. ఇది మిక్కిలి ప్రసిద్ధము. ఆరుద్ర యనునది యొక నక్షత్రము. పుష్య మాసములో వచ్చెడి ఆరుద్ర నక్షత్రము శైవులకు బర్వదినము. పరమేశ్వరుడు కైలాసము నుండి దిగి వచ్చునని వారి నమ్మిక. ఆ రోజు ద్వార దర్శనము చేయుదురు. కొందరు కొన్ని పేర్లు ధరించుటచే అవి ఖ్యాతి బడయును. కొందరు వాసికెక్కిన బేర్లు ధరించి ఖ్యాతి గడింతురు.

మా ప్రాంతములో విశ్వనాధ నాగభూషణమని యొకడున్నాడు. వాని తాత ముత్తాతలు మెట్ట సేద్యములో దిట్టలు. వీనికి అదికూడ అబ్బినది కాదు. జులాయిగా తిరుగుచుండెడివాడు. ఆయనను ఇంటిపేరుచే గొంత ప్రాచుర్యము పొందినాడు. ఫలానా నాగభూషణము మీ దాయాదియా అవి పులుపురు నన్ను పశ్నించుచుండెడివారు. అతడు మా శాఖవాడు కూడ కాదని నేను నిజము చెప్పెడివాడను. కొందరికి యిట్టి వరములు ఆయాచితముగా లభించును.

ఆరుద్ర అభ్యుదయవాదినిని చెప్పుకొనును. కాదనుటకు నా వద్ద నిదర్శనములు లేవు. అయినచో అయివుండవచ్చును. కాకపోయినచో మాత్రము ప్రమాదమేమి? ఇతను గడ్డము పెంచును. ఆనాడు జుల పాలు పెంచుటను భావకవులు అచారము జేసిరి. నేను ఏ వాదమునకూ జెందను. నా వాదము నాది. నచ్చినవారికి యది వేదము. లేని వారికి లేదు. వారికి జుత్తు బెంచుట అవశ్యకమని తోచినది. కవియైనవాడు మేధను బెంచుకొనుట ముఖ్యమని నాకు దోచును. ఏది ముఖ్యమో ప్రాజ్ఞులు గ్రహింతురు గాక!

త్వమేవాహమ్,... అని యొకటి వ్రాసినాడు. సినీవాలి యని మరియొకటి వ్రాసినాడు. ఇవి సంస్కృత కావ్యములు గావు. పచ్చి ఆధునిక వచన కవితల కూర్పు. పచ్చియనిన జ్ఞాపకము వచ్చును. ఆరుద్ర పైలాపచ్చీసు యని కూడా ఒకటి రచించినాడు. ఈతడు రైలు బండిని మానవ జీవితమునకు ముడిపెట్టి ఒక కవిత అల్లినాడు. అందు జీవుని వేదన కొంత స్ఫురించును. భావకతయునూ వున్నది. ఓ కూనలమ్మ యను మకుటములో బద్యములు గిలికినాడు. అవి మిక్కిలి చమత్కారముగా నుండును.

అసలు చమత్కారమే యితని మతమని తోచును. ఒక చోట నేనతనికి గురుతుల్యుడనని బేర్కొన్నాడు. నా రచనలు గొన్నింటిని చదివి యెట్లు వ్రాయకూడదో తెలిసికొంటినని చమత్కరించినాడు. ఏమైననేమి? ఆ 'ఎఱుక' యేదో నా వల్లనే కలిగినది కదా?

అజ్ఞానము తొలగించిన వాడు గురువు. సముద్రమున అణి ముత్తెములు ఉండును. నత్తగవ్వలును ఉండును. వారి వారి బ్రాప్తము ననుసరించియు, వారి వారి పూర్వజన్మ సుకృతమును బట్టియు అవియవి వారి వారికి లభించును. అతని 'ఊహ' యుట్లున్నది. అతని కదియే ప్రాప్తమని భావింతును.

ఆరుద్ర పరిశోధకుడు, అని కొందరు చెప్పగా వినియుంటిని. నాలుగు దశాబ్దములుగా చెన్నపట్టణములో నివాసము యుంటూ తెనుగు సాహిత్యము, తెనుగు జీవనము ఇత్యాది అంశాములుపై నితడు మిక్కిలిగా వ్యాసములు వెలువరించినాడు. జైనము గురించి ఇతనికి గొంత తెలియును.

ప్రస్తుతాంశము షష్ట్యబ్దిపూర్తి. అరువది సంవత్సరములు నిండుట యీ వేడుక అయినచో ఆరుద్రకు ఆరువది నిండినవా? లేదు.. భాగవతుల శంకరశాస్త్రికి అరువది నిండియుండవచ్చును. ఆరుద్ర పుట్టినది తరువాత గదా! మరి ఆరుద్రకు అరువది యెక్కడివి? కనుక యీ షష్ట్యబ్ది పూర్తి భాగవతుల శంకరశాస్త్రికే గాని ఆరుద్రకు కాదు. ఔను. ఇది యొక చమత్కారము.

*(ఆరుద్ర షష్టిపూర్తి సందర్భంగా ఇది ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాసినది. తర్వాత ఉత్సవ నిర్వాహకులు అభినందన సంచిక వేస్తుంటే శ్రీరమణ పేరడీ వుండితీరాలి అని ఆరుద్ర గారే చెప్పారట. ఈ సావనీర్‌కి శ్రీ బి.ఎస్.ఆర్. కృష్ణ, బెజవాడ గోపాలరెడ్డి గారలు సంపాదకత్వం వహించారు.)* ☆

## పల్లె

పచ్చ పచ్చని పైరు
చక్క చక్కని జోరు
కమ్మ కమ్మని హోరు
తియ్య తియ్యని పేరు
పల్లెకే అంకితం
పల్లెకే సొంతం *॥పచ్చ పచ్చని॥*

పల్లెరా ప్రగతికి మెట్టురా
పల్లెరా జగతికి దారిరా
సృష్టికి సర్వం
లోకానికి ఆధారం పల్లెరా
ఊహల కందని అందం
మాటల కందని భావం పల్లె సొంతంరా
*॥పచ్చ పచ్చని॥*

సూర్యుడే కోరుకునేది
చంద్రుడే కావాలనుకునేది పల్లె రా
మందార పువ్వు ముచ్చట పడేది
మల్లె పువ్వ సంభరపడేది పల్లె కోసమే రా
పల్లెలో లభించే స్వచ్ఛమైన గాలి కోసమే రా *॥పచ్చ పచ్చని॥*

***– గంటా రామకృష్ణ***



Sthanka_JanBW.indd 21 30/12/10 3:03 PM



# క్రీడా రంగంలో ఉరకలు వేస్తూ నూతన సంవత్సరంలోకి భారత్

**మ**నం 2011 సంవత్సరంలోకి అడుగుపెడుతూ, గడిచిన ఏడాదిని ఒక్కసారి అవలోకిస్తే, ఓ మాదిరి సంతృప్తే కలుగుతుంది. ఆ సంతృప్తి నేపథ్యంలో, ఒకింత నమ్మకంతో, ఒకింత ఆశతో కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పవచ్చు.

ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో భారత బృందం మంచి విజయాలనే సాధించిందని చెప్పాలి. చైనాలోని గ్వాంగ్‌జోలో జరిగిన ఆసియా క్రీడల్లో కూడా భారత క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ రెండు ఈ వెంట్లలో కూడా అంతకు ముందటి ఈ వెంట్లకంటే తమ విజయాలను భారత క్రీడాకారులు మెరుగుపరుచుకున్నారు.

ఇక క్రికెట్ విషయానికి వస్తే, టీమిండియా వరుసగా విజయాలను సాధిస్తూ, తన స్థానాన్ని అత్యున్నత స్థాయి లీగ్‌కు చేర్చుకుంది. ఇటీవల న్యూజీలాండ్‌పై సాధించిన విజయాలు గమనిస్తే, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రావిడ్, వివిఎస్ లక్ష్మణ్ వంటి అగ్రశ్రేణి క్రీడాకారులు విరామం తీసుకున్నప్పుడు, యువ బృందం ముందుకొచ్చి విజయాల బాధ్యతను భుజస్కందాలకు ఎత్తుకుంటుందని రుజువైంది.




వ్యక్తిగత స్థాయిలో చూస్తే, సైనా నెహ్వాల్ మహిళా బ్యాడ్మింటన్‌లో ప్రపంచంలోనే రెండవ స్థానానికి చేరుకుంది. ఇక సానియా మీర్జా విషయానికి వస్తే, కామన్‌వెల్త్ క్రీడల్లో, ఆసియా క్రీడల్లో ఫామ్‌లోకి వచ్చి, కొన్ని పతకాలు సాధించింది.

బాక్సింగ్‌లో మేరీకామ్, రెజ్లింగ్‌లో సుశీల్‌కుమార్, షూటింగ్‌లో గగన్ నారంగ్, అభినవ్ బింద్రా, తేజస్విని సావంత్, బిలియార్డ్స్‌లో పంకజ్ అద్వాని వంటి ప్రపంచ ఛాంపియన్లను భారతదేశం తయారు చేసింది. అయితే, క్రికెట్ వార్తల కవరేజీకే అధిక ప్రాధాన్యం ఇచ్చే మీడియా వీరి విజయాలను పెద్దగా పట్టించుకోలేదు.

పిజిఎ టూర్‌లో విజయం సాధించిన ఏకైక భారత గోల్ఫర్‌గా అర్జున్ అత్వాల్ ఆవిర్భవించాడు. విశ్వనాథన్ ఆనంద్ ప్రపంచ చెస్ టైటిల్‌ను








SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p7nd 12/30/2010, 4:09 PM



నిలబెట్టుకున్నాడు. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే.

గ్వాంగ్‌జో ఆసియా క్రీడల్లో ప్రశంస నీయమైన పనితీరు కనబరన్నా, భారతదేశం 2010 సంవత్సరానికి వీడ్కోలు పలికింది. 14 బంగారు పతకాలతో సహా, 64 పతకాలను భారతదేశం సాధించింది. ఆసియాక్రీడల్లో భారతదేశానికి ఇదే అత్యుత్తమ పనితీరు.

అంతకు సరిగ్గా ఒక నెల క్రితం న్యూఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లోనూ భారతదేవం ఇదే విధమైన విజయాలు సాధించింది. కామన్‌వెల్త్ క్రీడల్లో భారతదేశం నాలుగవ స్థానం నుంచి రెండవ స్థానానికి ఎగబాకగా, ఆసియా క్రీడల్లో ఆరవస్థానంలో నిలిచింది. ఇటీవలి కామన్‌వెల్త్ క్రీడల్లోనే భారతదేశం అత్యుత్తమ విజయాలు సాధించింది.

ఆసియా క్రీడల్లో అయితే, ఢిల్లీలో 1982లో జరిగిన క్రీడలే భారత అత్యుత్తమ ప్రదర్శనకు వేదికయ్యాయి. ఇందులో మొత్తం 57 పతకాలను భారతదేశం గెలుచుకుంది. వీటిల్లో 13 బంగారు పతకాలు, 19 వెండి పతకాలు, 25 కాంస్యపతకాలను భారతదేశం గెలుచుకుంది. 2006లో దోహాలో జరిగిన ఆసియా క్రీడల్లో భారతదేశం 10వ స్థానంలో నిలిచింది. 10 బంగారు పతకాలను, 17 వెండి పతకాలను, 26 కాంస్య పతకాలను ఆ క్రీడల్లో భారతదేశం గెలుచుకుంది.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, చైనాలోని గ్వాంగ్‌జోలో జరిగిన ఆసియా క్రీడల్లో దేశానికి కీర్తి ప్రతిష్టలను, పతకాలను తెచ్చిన క్రీడాకారుల్లో ఎక్కువమంది ద్వితీయ శ్రేణి క్రీడాకారులే. కామన్‌వెల్త్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల కంటే వీరే ఎక్కువ పతకాలను ఆసియా క్రీడల్లో గెలుచుకున్నారు.

దీన్ని బట్టి మనకు అర్థమవుతున్న విషయం ఏమిటంటే, క్రికెట్ మాదిరిగానే, అథ్లెటిక్స్, ఇతర క్రీడల్లో కూడా సీనియర్ల స్థానంలోకి దూకడానికి కావలసినంత ప్రతిభ మన యువ క్రీడాకారుల్లో ఉందని. కామన్ వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడల్లో మన దేశ రికార్డులు గొప్పగా ఉన్నా, అగ్రస్థానానికి చేరుకోవడానికి మనం ఇంకా చాలా దూరం ప్రయాణించ వలసి ఉన్నదనే విషయాన్ని మనం విస్మరించ కూడదు.

అతిథ్య దేశమైన చైనా గ్యాంగ్‌జో క్రీడల్లో 199 బంగారు పతకాలు సాధించింది! ఈ సంఖ్యతో పోలిస్తే, మన దేశం సాధించిన 14 బంగారు పతకాలు ఏ పాటివి? ఈ 14 బంగారు పతకాల్లో నాలుగు పతకాలు ఆఖరి రోజునే వచ్చాయి.



కామన్‌వెల్త్ క్రీడల్లో భారతదేశం రెండవ స్థానంలో నిలిచి ఉండవచ్చు. కాని, మొదటి స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా 74 బంగారు పతకాలతో మనకు సుదూరంలో ఉంది. ఆతిథ్య దేశమైన భారతదేశం కేవలం 38 బంగారు పతకాలతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది.

ఒలింపిక్స్ తరువాత బహుళ క్రీడలు జరిగే రెండవ అతిపెద్ద ఈవెంట్ అయిన ఆసియా క్రీడలను ఒకసారి పరికిద్దాం. గ్యాంగ్‌జో క్రీడల్లో జరిగిన ప్రారంభ, ముగింపు వేడుకలు బ్రహ్మాండంగా జరిగాయి. న్యూఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లోని ప్రారంభ, ముగింపు వేడుకలు కూడా గొప్పగానే ఉన్నాయి. అయితే, చైనీయులు ఈ వేడుకలను వినూత్న తరహాలో నిర్వర్తించారు. హైక్సిన్షా ద్వీపంలోని పెర్ల్ (ముత్యాలు) నదిపై ఈ వేడుకలను నిర్వహించారు. మామూలుగా ఈ వేడుకలు స్టేడియంలో నిర్వహించటం అలవాటుగా వస్తున్న విషయం. నదిపై నిర్వహించటం ద్వారా చైనీయులు తమ విలక్షణతను చాటారు.

కబడ్డీ ఆటకు భారతదేశం పుట్టినిల్లు. ఆంధ్రప్రదేశ్‌లో దీన్ని చెడుగుడుగా వ్యవహరిస్తారు. ఫైనల్ మ్యాచ్‌లలో గెలవటం ద్వారా మన పురుషుల జట్టు, మహిళల జట్టు ఈ విషయాన్ని మరింత చాటాయి. ఫైనల్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు ఇరాన్‌తో తలపడగా, మహిళల జట్టు థాయిలాండ్‌తో ఆడింది. గమ్మత్తేమిటంటే, 1990లో బీజింగ్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో భారతదేశం సాధించిన ఏకైక బంగారు పతకం కబడ్డీలోనే వచ్చింది. బిలియార్డ్స్‌లో బంగారు







SthanikaPalanaTel_January_2010_B&W_CrF.pmd 52 12/30/2010, 4:09 PM





పతకాన్ని నిలుపుకోవటం ద్వారా పంకజ్ అద్వాని దేశానికి 'బోణి' చేశాడు.

మన దేశంలో సరికొత్త టెన్నిస్ సంచలనం సోమదేవ్ వర్మన్. కామన్‌వెల్త్ క్రీడల్లో విజయం సాధించిన ఇతను గ్యాంగ్‌జోలో కూడా సింగిల్స్‌లోనూ, డబుల్స్‌లోనూ ఛాంపియన్‌గా నిలిచాడు.

400 మీ. హర్డిల్స్‌లో, రిలే బృందంలో సభ్యురాలిగా ఎ.సి.అశ్విని రెండు బంగారు పతకాలను సాధించి కీర్తి సంపాదించింది. గత ఏడాదంతా అంతంత మాత్రంగా ఆడిన సానియామీర్జా తన ఆట తీరును మెరుగుపరచుకుని కామన్‌వెల్త్ క్రీడల్లో, ఆసియా క్రీడల్లో మంచి ప్రతిభ కనబరించి. మిక్స్‌డ్ డబుల్స్‌లో విష్ణువర్ధన్‌తో కలిసి ఆడి వెండిపతకాన్ని, సింగిల్స్‌లో ఆడి కాంస్య పతకాన్ని సానియామీర్జా గెలుచుకుంది. ఇటీవలి కాలంలో ఆమె అంతగా ఫామ్‌లో లేకపోవడాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లయితే, ఈ విజయాలు సంతృప్తి కలిగించేవేనని చెప్పవచ్చు.

ఆఫ్రో - ఏషియన్, ఏషియన్, కామన్‌వెల్త్ క్రీడాపోటీల్లో సానియా మొత్తం 12 పతకాలు సాధించి, అధిక పతకాలు సాధించిన భారత మహిళా క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పిందని చెప్పవచ్చు. ఏషియాడ్‌లో నాలుగు బంగారు పతకాలను, మూడు వెండి పతకాలను సాధించిన పి.టి.ఉష కీర్తిని కూడా సానియామీర్జా మసక బారేటట్లు చేసింది.

ఐదు బంగారు పతకాలను, రెండు వెండిపతకాలను నాలుగు కాంస్య పతకాలను సాధించటం ద్వారా మన అథ్లెట్లు నెలకొల్పిన రికార్డు కూడా ప్రశంసనీయమైనదే. 5000 మీటర్ల పరుగు పందెంలో ప్రీజా శ్రీధరన్ వెండిపతకాన్ని పొందగా, 4×400 మీటర్ల హర్డిల్స్ పోటీలో ఎసి అశ్విని బంగారు పతకాన్ని గెలుపొందారు. బంగారు పతకాన్ని సాధించిన రిలే బృందంలో కూడా ఆమె భాగస్వామి.

పిటిఉష నుంచి శిక్షణ పొందిన టింటు లూకా కొద్ది నెలల క్రితమే అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించగలిగినప్పటికీ, 800 మీటర్ల పరుగు పందెంలో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు.

మనదేశ బాక్సర్లు తొమ్మిది పతకాలు సాధించటం ద్వారా మంచి క్రీడా ప్రతిభ కనబరిచారు. అందగాడు కూడా అయిన విజేందర్ సింగ్ ప్రపంచస్థాయి, ఒలింపిక్ స్థాయి మెడలిస్ట్. ఉజ్‌బెకిస్థాన్‌కి చెందిన అబ్బాస్ అటోయెవ్‌ను అధిగమించడం ద్వారా బంగారు పతకాన్ని సాధించారు. అటోయెవ్ తన విజేతకు ఒక్క పంచ్‌కూడా ఇవ్వలేకపోవటంతో, విజేందర్ సింగ్ అవలీలగా విజయం సాధించటానికి దోహదపడింది.

కొంతమంది క్రీడాకారులు మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టాలని తహతహలాడినప్పటికీ, విజేందర్ మాత్రం తన బాక్సింగ్ క్రీడకే అంకితమైపోయాడు.

విజేందర్‌కి 18 సంవత్సరాల అభిమాని అయిన వికాస్‌కృష్ణన్ కూడా బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. ఐదుసార్లు ప్రపంచ మహిళాబాక్సింగ్ ఛాంపియన్‌గా నిలచిన మేరీకామ్ మాత్రం కేవలం కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. భారతదేశానికి సైనానెహ్వాల్ రూపంలో పెద్ద అసంతృప్తి మిగిలింది. బ్యాడ్మింటన్‌లో సైనాకు బంగారు పతకం ఖాయమని అందరూ అనుకున్నప్పటికీ, హంగ్‌కాంగ్‌కు చెందిన యిన్ పుయ్ ఇప్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఓడి పోయింది.



మనదేశ షూటర్లు వారిపై గల అంచనాలకు తగినట్లుగా రాణించలేకపోయారు. వీరు కేవలం ఒక బంగారు పతకాన్ని, మూడు వెండి పతకాలను, నాలుగు






SthanikaPalanaTel_January_2010_B&W_CrF.pmd 12/30/2010, 4:09 PM

కాంస్య పతకాలను గెలుపొందారు, రంజన్ సోధి మాత్రం డబుల్ ట్రాప్ ఈవెంట్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు.

రంజన్‌సోధి మహిళా రిలేటీమ్ కామన్‌వెల్త్ క్రీడల అనంతరం జరిగే సన్మాన కార్యక్రమాలకు దూరంగా ఉండి, ఏషియాడ్ మీద దృష్టి కేంద్రీకరించి, ప్రాక్టీస్ చేశారు. దాని ఫలితం పోటీల్లో కనపడింది. పదవ పందెంలో భారతదేశానికి మొదటి బంగారు పతకాన్ని భజరంగ్ లాల్ టక్కర్ సాధించి పెట్టారు. మొదటి నుంచి చివరివరకు ఆయన తన




ప్రత్యర్థులకంటే ముందే నిలిచారు.

మొట్టమొదటిసారిగా ఈ ఏషియాడ్‌లో క్రికెట్ (ట్వంటీ 20) మ్యాచ్‌లను ప్రవేశపెట్టారు. ఎవరు బంగారు పతకాన్ని గెలిచారో ఊహించండి. బంగ్లాదేశ్ జట్టు గెలుచుకుంది. భారత్ ఆటగాళ్ల తమ అదివరకటి వాగ్దానాలను కట్టుబడి, అందులోనే మునిగిపోయారు.

## ఆంధ్రప్రదేశ్ విజయాలు

గ్యాంగ్‌జో క్రీడావేదికలో దేశం సాధించిన విజయాలలో మన రాష్ట్రానికి కూడా వంతు ఉంది. పడవ పందాల్లో ఛాంపియన్‌గా నిలిచిన భజరంగ్ లాల్ టక్కర్ (రోయర్) భారతదేశానికి ఈ క్రీడలో తొలి బంగారు పతకాన్ని అందించారు.

రాజ్‌పుతాన్ రైఫిల్స్‌కి చెందిన టక్కర్ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివశిస్తున్నాడు. హుసేన్‌సాగర్‌లో ఆయన శిక్షణ పొందుతుంటాడు. లండన్‌లో 2012లో జరిగే ఒలింపిక్స్ ఆయన తదుపరి లక్ష్యం.



మరో ఇద్దరు యువ రోయర్లు (పడవ నడపటం) అయిన ప్రమీల, ప్రతిమ ఒరిస్సాకు చెందిన వారయినప్పటికీ, రెండేళ్లుగా హైదరాబాద్‌ను తమ నివాసస్థలంగా చేసుకున్నారు. మహిళల జంట ఈవెంట్‌లో వీరు కాంస్యపతకాన్ని గెలుచుకున్నారు.

బంగారు పతకాన్ని గెలుచుకున్న కబడ్డీ జట్టుకి ఆంధ్రప్రదేశ్‌కి చెందిన తేజస్విని బాయి నాయకత్వం వహించింది. ఈ జట్టులో రాష్ట్రానికి చెందిన మరో ఇద్దరు మారెళ్ల కల్యాణి, మమత కూడా ఉన్నారు.

ఏషియాడ్‌లో మహిళా కబడ్డీని ప్రవేశపెట్టిన సంవత్సరమే తాము పాల్గొన్న జట్టు బంగారుపతకాన్ని గెలుచుకోవటంతో ఈ బాలికలిద్దరూ సంతోషంగా ఉన్నారు. వీరు సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉద్యోగాలు చేస్తున్నారు.

ఒలింపిక్స్‌లో కూడా కబడ్డీని ప్రవేశపెట్టడానికి ఒక వైపు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దాదాపు 30 దేశాలు ఈ ప్రతిపాదనను బలపరుస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి మరొక ముఖ్యమైన విజయం ఏమిటంటే, పురుషుల ఫ్రీ స్టైల్ స్కేటింగ్‌లోను, జంట స్కేటింగ్ ఈవెంట్‌లోనూ హైదరాబాద్‌కి చెందిన అనూప్‌కుమార్ ఒక్కొక్కటి చొప్పున రెండు కాంస్య పతకాలు సాధించాడు. జంట స్కేటింగ్ ఈవెంట్‌లో విశాఖపట్నానికి చెందిన అవనీపంబాల్‌తో కలిసి అనూప్ కుమార్ ఆడాడు. ఇందిరా పార్క్‌లోని స్కేటింగ్ రింక్‌లో అనూప్ సాధన చేస్తుంటాడు. అయితే, ఈ విజయం మీడియాలో పెద్దగా ప్రాచుర్యం పొందలేదు.

హైదరాబాద్‌తో సానియామీర్జా అనుబంధం తెలియనిది కాదు. మిక్స్‌డ్ డబుల్స్‌లో విష్ణువర్ధన్‌తో కలిసి ఆమె పాల్గొన్న విషయం తెలిసిందే. విష్ణువర్ధన్ కూడా హైదరాబాద్‌కి చెందినవాడే. హర్యానాలోని హిస్సార్‌లో పుట్టిన సైనా హైదరాబాద్‌లోనే పెరిగింది.

**- దాసు కేశవరావు**

(అనువాదం : వై.సరోజ)






SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p100d 12/30/2010, 4:09 PM

# ఉపాధిహామీ పథకాన్ని ఉత్తమోత్తమం చేసే గ్రామసభలు

"గ్రామాలే దేశానికి వెన్నెముక" అన్న మహాత్మాగాంధీ స్ఫూర్తితో పంచాయతీరాజ్ ద్వారా గ్రామీణాభివృద్ధి అనే లక్ష్యంతో మన భారత ప్రభుత్వం ఈ 2010వ సంవత్సరాన్ని "గ్రామసభ సంవత్సరంగా" ప్రకటించిన విషయం మనకు తెలిసినదే. దేశానికి గ్రామాలు వెన్నెముకలైతే గ్రామాలకు వెన్నెముక "మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం". అటువంటి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు కోసం నవంబర్ 18 నుండి డిసెంబర్ 8 వరకు సాయంత్రం 4గంటలకు మా సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించబడ్డాయి.

## సర్పంచ్ అధ్యక్షతన జరిగే గ్రామసభ పాత్ర:

- ఆ ప్రాంత అభివృద్ధి, పనుల గుర్తింపు ప్రారంభించాల్సిన పనులు, ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయించటం కోసం ప్రణాళిక రూపకల్పన
- అభివృద్ధి పథకాల అమలు, సేవలందజేయటంలో పర్యవేక్షణ
- గ్రామ పంచాయతీ కార్యాచరణ, యన్.ఆర్.ఇ.జి.యన్. మరియు ఇతర పథకాల సామాజిక తనిఖీలో పారదర్శికత, జవాబు దారీగా వుండేందుకు హామీ.

"ప్రజా స్వామ్యంలో వ్యక్తులకు గానీ, వ్యవస్థలకు గానీ దాపరికం అనేది మేలు చేయదు" అని బల్ల గుద్ది ప్రకటించారు బెంజిమన్ ఫ్రాంక్లెన్. మన ప్రజా స్వామ్య భారతంలో ప్రత్యేకించి గ్రామీణ భారతంలో ప్రభుత్వ పథకాల గురించి, ఎంపిక గురించి "గ్రామసభ"లో పారదర్శకంగా చర్చిస్తేనే ఘనమైన ఫలితాలొస్తాయి. అందుకనే ముద్దనూరు మండలంలో గ్రామ సభలను నిరాటంకంగా జరుపుతున్నాము. మే 2010లో 'సామాజిక తనిఖీ' కోసం గ్రామ సభలు నిర్వహించాము. తాజాగా "అంతర్గత సామాజిక తనిఖీ" కోసం కూడా గ్రామ సభలను క్రమంతప్పక నిర్వహించాము.

'ఒకరి గుణగుణాలు పరీక్షించి చూడాలను కుంటే వారికి ఒకసారి అధికారం ఇచ్చి చూస్తే చాలు'' అన్నారు అష్టకష్టాలకోర్చి అమెరికాధ్యక్షులైన అబ్రహం లింకన్. సర్పంచ్‌లుగా, ఎంపిటీసీలుగా, వార్డు సభ్యులుగా, ఉద్యోగులుగా, ఉపాధి సిబ్బందిగా మనకు ప్రజలు అధికారం ఇచ్చారు. ప్రజాసేవ చేయగలిగే ఈ అధికారంతో పల్లెల్లో పదికాలాల పాటు పనికి వచ్చే పనులు చేపట్టడానికి మహోన్నతమైన మహాస్త్రమే "మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం"

"అందరకు అక్కరకు రాని ప్రణాళిక అంత మంచిది కాదు" అని హెచ్చరించారు మన భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. అందరికీ పనికి వచ్చే, అందరికి పని కల్పించే, అందరినీ పనికి రప్పించే, ఊరికంతా ఉపయోగపడే, ఊరంతా ఉప్పొంగి పోయే ఉపాధి పథకానికి ప్రణాళికను తయారు చేయడానికి తగిన వేదికయే "గ్రామసభ".

"ఎవరి కష్ట ఫలితం వారికి అందేటట్లు చూడడమే మంచి ప్రభుతం బాధ్యత" అని మన బాధ్యతలను గుర్తు చేసిన అబ్రహం లింకన్ మనకు ఆదర్శనీయమే.

"ప్రణాళిక లేని కార్యక్రమం ప్రయోజన శూన్యమైనది. కార్యనిర్వహణ లేని ప్రణాళిక ఉత్పత్తి శూన్యమైనదని" స్వామి చిన్మయానంద సెలవిచ్చారు. మనం పటిష్టమైన ప్రణాళిక ప్రకారం, పకడ్బందీగా, కర్తవ్యనిష్ఠతో, కార్యనిర్వహణను చేపట్టి ఉపాధి పథకం ద్వారా కడుపు కాలుతున్న పేదవారి కడుపులు నింపాలి. పేదల జీవితాలలో ఉపాధి సంక్రాంతులు ఉదయింపజేయాలి.

"మనం పరుల కోసం చేసేదే శాశ్వతంగా నిలిచిపోతుంది. మన కోసం మనం చేసుకునేది మనతోనే అంతమవుతుందన్న" బాపూజీ సూక్తిని స్ఫూర్తిగా తీస్కొని, ప్రజల కోసం, అందునా అన్నార్తుల కోసం ప్రత్యక్షంగా ఉపయోగపడే ఉపాధి పథకానికి మన చేతనైనంత ఊపిరులు అందించి నిరుపేదల చిరు హృదయాలలో శాశ్వతంగా స్థిరపడిపోయేలా, మన గ్రామాల్లో సుస్థిరమైన, ఉపయుక్తమైన, బహుళ ప్రయోజనాలున్న, భవిష్యత్తరాలకు మేలు చేకూర్చే ఉపాధి హామీ పథకాన్ని అమలు చేద్దాం.

## కార్యాచరణ

సర్పంచ్ జరిగే గ్రామ సభల ఏర్పాట్లు పంచాయతీ కార్యదర్శి చేపట్టాలి. గ్రామ సభకు మూడు రోజుల ముందుగా గ్రామసభ నోటీసు పంచాయతీ కార్యాలయంలోనూ ముఖ్య కూడళ్ళలోనూ అతికించాలి. దండోరా వేయించాలి. శ్రమ శక్తి సంఘాలు, స్వయం సహాయక సంఘాలు , వార్డు సభ్యులు తప్పకుండా పాల్గొనేటట్లు పంచాయతీ, స్వయం సహాక్షేత్ర సహాయకులు, గ్రామైఖ్య సంఘ నాయకులు చర్యలు తీస్కోవాలి.

సర్పంచ్‌లను, ఎంపిటీసీ సభ్యులను, వార్డు సభ్యులను తప్పనిసరిగా హాజరుగునట్లుగానూ, గ్రామ సభ ఏర్పాట్లు, నిర్వహణ సజావుగా జరుగునట్లుగానూ, అందరినీ సమన్వయం చేయునట్లుగానూ విస్తరణాధికారి (పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ) విస్పష్ట చర్యలు చేపట్టాలి. గౌ.పంచాయతీరాజ్ కమీషనర్. గౌ. గ్రామీణాభివృద్ధి కమీషనర్ మరియు గౌ. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాలను యథాతథంగా అమలగునట్లుగా విస్తరణాధికారి (పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ), అదనపు కార్యక్రమ అధికారి, ఇ.సి., టెక్నికల్ అసిస్టెంట్స్ చర్యలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఈ గ్రామ సభలను జయప్రదం చేయాలి. ఉపాధి హామీ పథక పతాకాన్ని ఉత్సాహంగా ఎగురవేయాలి.

గమ్యమూ, గమనమూ రెండు ఉత్తమంగా ఉండాలి అన్న మహాత్మాగాందీ సందేశం ఆదేశంగా "మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం" గమ్యాన్ని, గమనాన్ని ఉత్తమోత్తంగా తీర్చిదిద్ది, పథకాన్ని విజయవంతం చేద్దాం. పథకంతో పల్లెల్లో పసిడి పువ్వులు పూయిద్దాం.

- ***మొగిలి చెందు సురేష్,*** మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
ముద్దనూరు, వై.యస్.ఆర్.జిల్లా



SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p1nd 12/30/2010, 4:09 PM

# పంచాయితీరాజ్ సంస్థలలో మోడల్ ఎకౌంటింగ్ పద్ధతి

(ప్రియా సాఫ్ట్‌వేర్‌పై ఒక పరిచయం)

పంచాయితీ రాజ్ సంస్థల ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత తద్వారా సంస్థలలో జవాబుదారీతనం పెంపొందించటానికి గాను భారత ప్రభుత్వ కంప్ట్రోలర్ మరియు ఆడిట్ జనరల్ సూచనల మేరకు నూతన అకౌంటింగ్ విధానాన్ని పంచాయితీ రాజ్ సంస్థలలో ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ నూతన అకౌంటింగ్ విధానాన్ని రాష్ట్రంలోని అన్ని పంచాయితీ రాజ్ సంస్థలలోను అమలులోకి తీసుకొని రావటానికి గత 3 సంవత్సరాల నుండి ప్రయత్నం చేస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం పంచాయితీ రాజ్ సంస్థలలో ప్రవేశ పెట్టిన నూతన అకౌంటింగ్ విధానాన్ని మరింత సులభతరం చేస్తూ మోడల్ అకౌంటింగ్ సిస్టమ్‌ను ప్రవేశ పెట్టింది. గతంలో సూచించిన 16 రిజిష్టర్ల స్థానంలో 8 రిజిష్టర్లను సూచిస్తూ కొన్ని సవరణలు తీసుకొని వచ్చింది. ఈ మోడల్ అకౌంటింగ్ సిస్టమ్‌ను క్షేత్ర స్థాయిలో సులభమైన రీతిలో నిర్వహించేందుకు గాను నేషనల్ ఇన్ఫర్‌మాటిక్స్ సెంటర్ వారి సహకారంతో ప్రియా - పంచాయితీ రాజ్ అకౌంటింగ్ ఇన్ఫర్మేషన్ సాఫ్ట్‌వేర్‌ను భారత ప్రభుత్వం వారు రూపొందించారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను వినియోగంలోకి తీసుకొని వచ్చే నిమిత్తం ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ శాఖ జి.ఓ.ఎం.ఎస్. నెం. 324/ తేది 9/9/2010 ద్వారా పలు సూచనలు చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ మోడల్ ఎకౌంటింగ్ పద్ధతి 1/4/2010 నుండి పంచాయితీ రాజ్ సంస్థలు అమలు పరచుకొనాలి. పంచాయితీ రాజ్ సంస్థలలో 29 అంశాలకు సంబందించి జమలు, ఖర్చులు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ అనగా మోడల్ ఎకౌంట్ పద్ధతిని ఉపయోగించి సాఫ్ట్‌వేర్ ద్వారా(పి.ఆర్.ఐ.ఎ - పంచాయితీ రాజ్ ఇన్స్‌టిట్యూషన్స్ ఎకౌంటింగ్ సాఫ్ట్‌వేర్) నిర్వహించుకొనడానికి పై జి.ఓ ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- సంస్థలలో డబ్బు లావా దేవీలకు సంబంధించి ఎకౌంట్స్ - హెడ్ ఆఫ్ ఎకౌంట్స్ ద్వారా నిర్వహించుకొనడం జరుగుతుంది.
- ఏప్రిల్ 1 నుండి మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తారు.
- ప్రతి రోజూ జరిగిన లావాదేవీలు అనగా జమలు ఖర్చుల వివరాలను కేష్‌బుక్‌నందు రికార్డు చేయాలి.
- జమలు-జమలు పేజీలో, ఖర్చు-ఖర్చు పేజీలో వ్రాసి, ప్రతి రోజూ క్యాష్‌బుక్‌ను క్లోజ్ చేసి ఆ రోజు నిల్వ మరుసటి రోజు ఓపెనింగ్ బ్యాలన్స్‌గా చూపిస్తారు.
- నెల చివరిలో బ్యాంక్ రికన్సలియేషన్, ట్రెజరీ రీకన్సిలియేషన్ చేసుకుని, క్యాష్‌బుక్, బ్యాంకు, ట్రెజరీ నందలి బ్యాలన్స్‌కు సరిచూసుకొనాలి.

  ఏమైనా రెక్టిఫికేషన్స్ ఉంటే చేసుకొనాలి. దీని ద్వారా ప్రతి హెడ్ ఆఫ్ ఎకౌంట్ నుండి ఎంత జమ అయినదీ, ఎంత ఖర్చు అయినదీ అనే వివరాలు ఎకౌంటింగ్ పద్ధతి ద్వారా రికార్డు చేయబడతాయి. ఎక్కడెక్కడైతే "ఆన్ లైన్ ద్వారా" లావాదేవీలు సంస్థలు, బ్యాంకుల మధ్య జరుగుతాయో అక్కడ "ఆన్‌లైన్ రీకన్సిలియేషన్" చేసుకొనవచ్చును.
- నెల చివరన నెల మొత్తం జమలు, ఖర్చులు ఆ నెల వారీ జమలు, ఖర్చుల ఎకౌంట్ నందు పొందుపరచాలి.
- ముందు నెల వివరాలతో ఈ నెల వివరాలతో కలసి అనగా అలా నెలవారీ, సాంవత్సరిక కన్సాలిడేషన్ జమ, ఖర్చుల ఆబ్‌స్ట్రాక్ట్ తయారు చేసుకొనవచ్చును.
- మార్చి ఎకౌంట్స్ క్లోజ్ చేసుకున్న తర్వాత జమ, ఖర్చుల రికన్సిలియేషన్ అన్ని శాఖలతో చేసుకొని ఏమైనా తప్పు క్లాసిఫికేషన్స్ లేదా క్లాసిఫై చేయని లావాదేవీలను అనగా సస్పెన్స్ ఎకౌంట్‌లో ఉన్న లావాదేవీలను మరియు అన్ని ట్రాన్స్‌ఫర్ ఎంట్రీలు చేసిన లావాదేవీలను జాగ్రత్తగా గుర్తించాలి. ప్రతి హెడ్ వారీగా మార్చి వరకు వార్షిక తదితర లెఖ్ఖలు సరి చూసుకోవాలి. దీనితో వార్షిక లెఖ్ఖల పద్ధతి ముగుస్తుంది
- కన్సాలిడేటెడ్ ఆబ్‌స్ట్రాక్ట్ ఆధారంగా వార్షిక జమలు, ఖర్చుల తుది లెక్కలు తయారవుతాయి.
- హెడ్‌వారీ క్లాసిఫికేషన్- జమలు, ఖర్చులు/విధుల నిర్వహణకు కోడ్‌ల లిస్టు/పథకాలు/కార్యక్రమాలు ఆధారంగా పంచాయితీ రాజ్ సంస్థలు బడ్జెట్‌ను తయారు చేసుకొవాలి.
- రెవెన్యూ రిఫండు/ఖర్చుల నుండి వెనుకకు తిరిగి కట్టబడిన డబ్బును ఆయా జమలు, ఖర్చుల నుండి తగ్గించుకొనాలి.
- బ్యాంకు/ట్రెజరీ రికన్సిలియేషన్ స్టేట్‌మెంట్స్, రిజిష్టరు ఆఫ్ రిసీవబుల్స్ మరియు పేయబుల్స్(అనగా జమ కాబోయేవి, ఖర్చు జరిగేవి) స్థిరాస్థుల రిజిష్టరు, ఇన్వెంటరు ఈ రిజిష్టరు, డిమాండు, కలెక్షన్, బ్యాలన్సు రిజిష్టరు వార్షిక లెఖ్ఖలలో భాగంగా ఉంటాయి.

## ట్రాన్స్‌ఫర్ ఎంట్రీలు

1. ఎకౌంట్స్ లావాదేవీలలో క్లాసిఫికేషన్ తప్పుగా వేసిన ఎడల సరైన హెడ్ ఆఫ్ ఎకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు ట్రాన్స్‌ఫర్ ఎంట్రీ ద్వారా సరిచేసుకొనవచ్చును.
2. తక్కువ లావాదేవీలు ఉన్న పంచాయితీల్లో దీని అవసరం అంతగా ఉండదు.

మేజర్ హెడ్ : 29 అంశాలను 23 మేజరు హెడ్‌లుగా లిస్టు చేయబడినవి. నాలుగు డిజిట్లతో సూచించ బడుతుంది. ఉదా:2515 - పంచాయితీరాజ్ కార్యక్రమాలు

మైనర్ హెడ్ : మూడు డిజిట్లలో సూచించబడుతుంది. ఉదా: 101 - జిల్లా పరిషత్ కార్యక్రమాలు

ఆబ్జెక్ట్ హెడ్ : రెండు డిజిట్లతో సూచించబడతాయి. ఉదా: జీతాలు - 01

***- కె. రాజశేఖర్‌రావు,*** చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసరు, పంచాయితీ రాజ్ , కమీషనరేట్

***- సుమమాలిని,*** ఫ్యాకల్టీ అపార్డు



SthanikaPalanaTel_January_2010_B&W_CrF.p4nd 12/30/2010, 4:09 PM

# సంక్రాంతి వేళ... ఆనందహేల



**ప్రతి జాతి జీవనానికీ పండుగలు ఎంతో విశిష్టమైనవి. సంస్కృతిలో భాగంగా సంప్రదాయాలకు భూమికగా 'పండుగ' అలరారుతూ ఉంటుంది. వ్యక్తుల మధ్య, సంస్కృతుల మధ్య, మతాల మధ్య వైవిధ్యం ఉండవచ్చు. కానీ కొన్ని కొన్ని కాలాలలో పర్వదినాలను జరుపుకోవటం అందరిలోనూ కన్పిస్తుంది. ఇవన్నీ మానవ వికాసం కోసమే. వ్యక్తిత్వాన్ని, జీవనాన్ని సుఖప్రదం, శాంతిమయం చేసుకోవడానికే. అటువంటి సుఖశాంతులనూ, సంపదలనూ కలిగించేదీ, ఆధ్యాత్మిక విశేషాలు, ప్రకృతి రహస్యాలు కల విశిష్టమైన పండుగ సంక్రాంతి. ఒక్క తెలుగు దేశంలోనే కాదు వివిధ ప్రాంతాలలో విశిష్టంగా జరుపుకొనే పండుగే సంక్రాంతి.**

ఈ పర్వదినం నాడు తెలుగునాట ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ప్రతి ఒక్కరి ముంగిటా సిరిసంపదలు నాట్యమాడే వేళ వెల్లివిరుస్తుంది ఆనందహేల.

మనకి 12 తెలుగు నెలలు ఉన్నాయి. వాటిలో పుష్యమాసం ఒకటి. ఈ మాసంలోనే సంక్రాంతి వస్తుంది. ఇది డిసెంబరు మధ్యలో వచ్చి జనవరి మధ్యలో పుష్యమాసం వెళ్ళిపోతుంది. ఈ నెలరోజులూ మహిళలు ముఖ్యంగా ఇళ్ళముందు రథం, ముత్యాలముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. ఆడపిల్లలు ఈ ముగ్గుల చుట్టూ కోలాటం చేస్తారు.

## మకర సంక్రమణం

సూర్య ప్రయాణానికి సంబంధించిన పండుగే సంక్రాంతి. సూర్యుడు ధనూరాశిని విడిచి మకరరాశిలోనికి ప్రవేశించి ఉత్తరాభిముఖుడైన రోజున ఉత్తరాయణం వస్తుంది. ఈ కాలం ప్రాకృతికంగా నూతన శోభతో అలరారుతూ ఉంటుంది. లోకబాంధవుడైన సూర్యభగవానుడు రాశిని మార్చుకొని అదే విధంగా జనజీవన స్థితిగతుల్ని కూడా మార్చే శుభకాలం ఇది. ఇలా మారడాన్నే సంక్రమణం అంటారు. మొత్తం 12 రాశులలోనికీ 12 సార్లు సూర్యుడు ప్రవేశించినప్పుడు మనకి 12 సంక్రాంతులు వస్తాయి. సంవత్సరాన్ని రెండుగా విభజించి 1. ఉత్తరాయణం 2. దక్షిణాయనంగా చెప్తారు.

ఉత్తరాయణ పుణ్యకాలం సంక్రాంతితో ప్రారంభమవుతుంది. అందుకే మకర సంక్రాంతి ఎంతో విశిష్టమయినది. పంట చేతికి అందిన ఆనందంతో 'మకర సంక్రాంతి'ని అందరూ జరుపుకొంటూ ఉంటే, దేశవిదేశాలలో అన్నిచోట్లా ఇదే సందర్భంలో ఉత్సవం చేసుకొంటూ ఉంటారు. ఉత్తర భారతదేశంలో భోగిని 'టొడి' అని పిలుస్తారు. తమిళంలో పోగు, పొంగు అనే పదాలతో భోగి, పొంగల్ పండుగలుగా పిలుస్తారు. ఈ అర్థంలోనే పొంగల్, పొంగళ్ అనే పదాలు బాగా వ్యాప్తిలోనికి వచ్చాయి. ధనుర్మాసం మొదటి రోజున ప్రధాన దేవాలయాలలో 'నెలగంట' పెడతారు. ప్రతిరోజూ పూజలు చేస్తారు. గృహాలన్నింటినీ శుభ్రంగా కడిగి, రంగులు వేస్తారు.



## ఆధ్యాత్మిక సంక్రాంతి

సూర్యుడు విష్ణువే. అందుకే సూర్యనారాయణుడంటాం. సూర్యుడే త్రిమూర్త్యాత్మకుడు. వైదిక లైకిక వాఙ్మయాలూ సూర్య ప్రాధాన్యాన్ని వివరించాయి. ఋగ్వేదం సూర్యమండలమనీ, అందులోని జ్వాలలే సామవేదమనీ ఛాందోగ్యోపనిషత్తు పేర్కొంది. మానవ లోకానికి జీవశక్తి ప్రదాత సూర్యుడే. అందుకే అత్యంత ప్రాచీన సంస్కృతులలోనూ (ఈజిప్టు, మెసపటోమియా, మెక్సికో, జపాన్, పెరూ) సూర్యారాధన ఉంది. రాజులలో సూర్యవంశ రాజులకు ఎంతో విలువ, గౌరవం ఉంది. సూర్యుడు తన ప్రయాణాన్ని సప్తాశ్వాలతో, 360 ఆకులున్న ఒకే ఒక్క చక్రంతో, 24 అంచులు, 12 కాడిపోలులు ఆరుముఖాలు (పర్వాలు, రాశులు, ఋతువులు) కలిగి సాగిస్తాడని వేదప్రమాణం. ప్రకృతి శక్తుల్ని



చక్కగా ఉపయోగించుకొన్న నాడే మానవజాతి సౌభాగ్యమని సంక్రాంతి సందేశం. ఈ పండుగ 4 రోజులు జరుగుతుంది.

## భోగి

మొదటిరోజున భోగి. గోదాదేవి నెలరోజులు ప్రార్థిస్తే రంగనాథుడు స్వయంగా వచ్చి ఎన్నో భోగాలు ఇచ్చాడట. ఈ రోజు 'భోగిమంట' వేస్తారు. మంచువల్ల ఏర్పడే క్రిమికీటకాదులన్నీ ఈ మంటల్లో పడి మాడిపోతాయి. ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. పాత వస్తువుల్ని మంటల్లో వేస్తారు. ఇది సంస్కార చిహ్నం. భోగి రోజున తలస్నానం చేసి కొత్తబట్టలు ధరిస్తారు. గొబ్బిగౌరివ్రతం చేస్తారు. ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి ముంగిళ్ళను అలంకరిస్తారు. భోగిపళ్ళు పోయటం, బొమ్మల కొలువులు పెట్టటం భోగి ప్రత్యేకత.

## సంక్రాంతి

ఇది మొక్కుల పండుగ. పంట చేతికందే కాలంలో పితృదేవతలను స్మరించటం, వారికి 'బలిప్రదానం' చేయటం సంప్రదాయం. కొత్త బియ్యంతో పొంగళ్ళు, పులగాలు వండుతారు. సంక్రాంతి నుండి సూర్యకిరణాలలో వేడి పెరుగుతుంది. కాబట్టి ఈ రోజు తెలగపిండి ఒంటికి పట్టించి స్నానం చేస్తారు. జ్యోతిషం ప్రకారం మకరరాశికి అధిపతి శనీశ్వరుడు. శని సూర్యపుత్రుడు. వాతాన్ని కలిగించే గ్రహం. అందువల్ల ఈ వాతాన్ని పోగొట్టడానికి నువ్వుల నూనెనూ వంటికి పట్టించి స్నానం చేయటం, గుమ్మడి మొదలగు కూరలను వాడటం ఆచారంగా పెట్టారు. అందరూ తమకు పుణ్యలోకాలు ప్రాప్తించాలని దానధర్మాలు చేస్తారు.

## కనుము

ఇది మూడో రోజు పండుగ. ఇది పూర్తిగా రైతుల పండుగ. తమ కష్టంలో పాలుపంచుకొన్న పశువులను గౌరవించి పూజిస్తారు. పశువుల శాలలో వేకువనే పొంగళ్ళు వండుతారు. ఈ సమయంలో 'పాల పొంగలి', 'పశువుల్‌పొంగలి' అని అరుస్తారు. దీనిని దేవతలకు నైవేద్యం పెట్టి, ఆ మెతుకులను పొలాల్లో చల్లుతారు. ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని నమ్మిక.



## సంక్రాంతి శోభ



**ఒ**కప్పటి జ్ఞాపకంలా
మధురంగా..
హృదయాలలో కదలాడే మకరసంక్రాంతి శోభ
సంస్కృతికి కేతనమై నిలుస్తుంది
పల్లెలన్నీ
పౌష్యలక్ష్మి ఒడిలో సేదదీరేవేళ
చెప్పలేని అనుభూతి విచ్చుకొంటుంది
పెద్దలు తీర్చుకొనే మొక్కుబళ్ళు..
స్వేదం పంచుకొని బతుకు పండించిన పశువులతో
కలిసి కలివిడిగా చేసుకొనే సంబరాలు..
అరవిరిసిన గొబ్బెమ్మలు..
రథాలను వీథివీథీ తిప్పే ముగ్గులూ..
హరిదాసుల సందళ్ళూ
డూడూబసవన్నల హడావిళ్ళూ
పెద్దలపండుగను పెద్ద పండుగ చేశాయి
జానపదుల గళాల్లో విచ్చుకున్న పాటలపిట్టలు వలసపోయి
ఎన్ని తీరాలలో వాలాయోకదా..
ప్రపంచం మొత్తం ఒక్కటిగా ముకుళించుకొన్న
వర్తమానంలో కూడా
సంక్రాంతి శోభ
నిత్యమూ నూతనంగా ఆలరారుతూనే ఉంటుంది
మనిషి సాంకేతికంగా ఎంత ఎదిగినా
మూలాల్ని విడిచి ఎక్కడికీ పోలేదన్న సత్యాన్ని
చరిత్ర నిరూపిస్తూనే ఉంటుంది

*- యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి, తెలుగు అకాడమి*

## ముక్కనుము

ఇది నాలుగో రోజు పండుగ. ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకొనే పండుగ ఇది. ఊరి దేవతలను విశేషంగా పూజిస్తారు. కోడిపందాలు, ఎడ్లపందాలు జరుగుతాయి. ఈ రోజు అయిన తరువాతే ప్రయాణాలు మొదలవుతాయి. పశువుల్ని శుభ్రంగా అలంకరించటం, ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టటం ఈ పండుగ ప్రత్యేకత.

గంగిరెద్దులాటలు, బుడబుక్కల వేషాలు, జంగం దేవరలు, పగటి వేషగాళ్ళు సంక్రాంతి రోజులలో మన ముంగిళ్ళకు వచ్చి సంక్రాంతి శోభను ఊరంతా వెదజల్లుతారు. చేతికి పంట అందిరావటంతో ఈ పండుగ రోజుల్లో భోగభోగ్యాలతో ఇళ్ళన్నీ కళకళలాడతాయి.

*- డా॥ అద్దంకి శ్రీనివాస్*

**చా**లా కాలం క్రితం ఒక పెద్ద చెట్టు వుండేది. దానికి పెద్ద పెద్ద కొమ్మలు, రెమ్మలు వుండేవి. వందలాది పక్షులు గూళ్ళుకట్టుకొని చెట్టులో కాపురముండేవి. ఆ చెట్టు పూత వేసినపుడు, వేలాది తేనెటీగలు, సీతాకోక చిలుకలు చెట్టును ముద్దు పెట్టుకొనేవి. దాని నీడలో బాటసారులు కూర్చొని సేద తీర్చుకొనేవారు. గోపాల బాలురు చెట్టు నీడలో కూర్చుని పిల్లన గ్రోవిని వాయించేవారు. వందలాది ఏళ్ళు ఇలా గడిచాయి.

ఒకరోజు చిన్నబాలుడొకడు ఆడుకోడానికి చెట్టువద్దకు వచ్చాడు. చెట్టుకు అతనిపట్ల అనురాగం పెరిగింది. ఆ బాలుని చిన్ని చేతులకు అందేటట్లు రెమ్మలను కిందికి వంచేది. పూలగుత్తులు కురిపించేది. వాడి సంబరాన్ని చూచి ఆనందించేది. వాడు పెరుగుతూ చెట్టు ఎక్కి రెమ్మల పై ఊయలలూగే వాడు. వాడి స్పర్శతో చెట్టు పులకించేది. వాడు పెరిగి నట్లలా రావటం తగ్గించాడు. వాడు రానందుకు చెట్టు బాధపడేది. వాడు చదువు సంధ్యలలో మునిగి రావటం తగ్గించాడనుకొన్నది.

ఒక రోజు వాడు ఆ దారిలో వెళుతున్నాడు. వాడిని, గమనించిన చెట్టు, "రా, బాబూ నేను నీరాక కోసం వేచి చూశాను" అన్నది.

"నీలో ఏముందని రావాలి? డబ్బుంటే చెప్పు. వుంటే వస్తా" అన్నాడు.

"తియ్యని పళ్ళున్నాయి. వాటిని తీసుకువెళ్ళి అమ్ముకో, డబ్బులు వస్తాయి" అన్నదా చెట్టు.

# చెట్టు- మనిషి

"సరే"అంటూ దోరగాయలు, పళ్ళు కావలసినంతగా క్రూరంగా పీకాడు. తిరిగి చూడక వెళ్ళిపోయాడు. మరలా వచ్చాడు. పళ్ళన్నీ అయిపోయాయి. వాడు అటువైపు రానేలేదు. కొన్ని నెలల తర్వాత వాడు అటు వైపురాగా చెట్టు ఆప్యాయంగా పిలిచింది.

"ఛీ, ఇదేం పీడ, ఏదో అనురాగంతో నన్ను కట్టి వేయాలని చూస్తుంది. ఇంతకూ ఇపుడు నీలో ఏముంది? చెప్పు. నేను ఇల్లుకడుతున్నాను, నన్ను విసిగించకు" అన్నాడు.

"అయితే నీకు కావాల్సిన కొమ్మలు కొట్టుకో" అన్నది.

సరేనంటూ మరుసటి రోజు గొడ్డలి, రంపంతో, మరొకనితోపాటు వచ్చాడు. ముందు, వెనక చూడక కొమ్మలను, రెమ్మలను నరికాడు. చెవిటికి శంఖం ఊదినట్లు, ఆ చెట్టు బాధ వినలేదు. కొట్టిన కొమ్మల ను బండిలో వేసుకొని తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడా కృతఘ్నుడు.

కొన్నేళ్ళ తర్వాత వాడు మళ్ళా వచ్చాడు, అప్పటికి వాడు ముసలి వాడైనాడు, కాని వాడిలోని అహంకారం మాత్రం తరగలేదు.

"నాకో పెద్ద తెప్ప కావాలి. నీ బోదెతో మంచి తెప్ప తయారవుతుంది. మరి ఇపుడేమంటావు" అని అడిగాడు.

చెట్టు నిట్టూర్పు వదలుతూ "చేతులు, కాళ్ళు లేని మనిషివలె నేను బ్రతుకుతున్నాను. నీవు ఆనాడు కత్తిరించిన రెమ్మలు, నరికిన కొమ్మలు మరలా పెరగలేదు. గాయాల బాధ ఇంకా తీరలేదు, నీ పట్ల నాకు ప్రేమాభిమానాలున్నాయి. ఇదిగో నా శరీరం. దాన్ని కూడా తీసుకెళ్ళు" అంది.

వాడు బోదెను కూడా తీసుకెళ్ళాడు. అటు రావటంలేదు. పూలు, పళ్ళు లేవు. నీడా లేదు. కాని తన వద్దకు వచ్చిన వారిని ఇలా ప్రశ్నిస్తుంది'. "నా బాబును చూశారా? వాడెందుకో మరలా రాలేదు, తెప్పపై వెళ్ళిన వాడు మునిగిపోయాడేమో అని బెంగ పట్టుకున్నది. నా రోజులు దగ్గరి కొచ్చాయి. కన్ను మూసే ముందు ఒకసారి వాడిని చూడాలని వుంది. ఒక వేళ వస్తే, ఇవ్వడానికి ఏమీ లేదు, అందుకేనేమో వాడు రాలేదు, మీకెపుడైనా కనిపిస్తే, వాడికి నాకోరిక తెల్పండి" అంటూ వుండేది.

ఈ కథ చదివిన తర్వాత, మరేమీ చదవటానికి మనస్కరించదు. చెప్పవల్సింది, వినవలసిందంతా చిన్న కథలో వుంది.

మనిషిలోని కృతఘ్నత, దురాశ, ఈ భూమిని చిత్తడిగా చేస్తున్నది. వాడి ఆశ ఆకాశం దాకా పెరిగింది. వాడు ఆ దురాశను మానుకొంటే ఈ భువిని స్వర్గంగా మార్చవచ్చు. అందుకు ఒక మార్పు కావాలి. ఈ నేలతల్లిని ప్రేమించడం నేర్చుకోవాలి.

మన పూర్వీకులు వేకువనే లేచి నేలతల్లిని ఇలా ప్రార్థించేవారు.

*'సముద్రవసనే దేవి, పర్వత స్తనమండలే,*
*విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే'*

(సముద్రమే వస్త్రంగా (వాసస్థలంగా) పర్వతాలే స్తన మండలంగా వున్న భూమాతా నీకు నమస్కారం. నీపై పాదం మోపుతున్నందుకు క్షమించు)

ఆదిమానవుడి నుంచి నేటి మానవుని దాకా చెట్టు ఆహారానికి, ఆశ్రయానికి, ఆరోగ్యానికి పట్టుకొమ్మగా తన సర్వస్వాన్ని మనకు సమర్పిస్తుంది. కాని మానవుడు,చెట్టు తనకు చేస్తున్న మేలును మరచి, వాటిని నాశనం చేస్తూ పల్లెలను, పట్టణాళ్ళను స్మశానంగా మారుస్తున్నాడు, క్రమంగా నీటి కరువు ఏర్పడుతూవుంది, ఒకప్పుడు 80 శాతం వున్న అడవులు, 22 శాతానికి పడిపోయినట్లు శాస్త్రవేత్తలంటున్నారు.

మన ఆరోగ్యం కోసం, రానున్న తరాల వారి కోసం మనం చెట్లుపెంచాలి.

*'పది బావులు ఒక చెరువుతో సమానం*
*పది చెరువులు ఒక సరస్సుతో సమానం*
*పది సరస్సులు ఒక పుత్రునితో సమానం*
*పది మంది పుత్రులు ఒక చెట్టుతో సమానం'*

అన్నది మత్స్యపురాణం.

చెట్లు స్వార్థత్యాగానికి ప్రతీకలు. జీవకోటికి ప్రాణాధారమైన, ప్రాణవాయువును అడవులు ప్రతి సంవత్సరం 40 వేల టన్నులు ఉత్పత్తి చేసి గాలిలోకి వదలుతున్నాయంటున్నారు శాస్త్రవేత్తలు. ఒక చెట్టు రోజుకు 40 గ్యాలన్ల నీటిని ఆవిరి రూపంలో వదులుతుంది. భూగర్భ జలాలను పీల్చి వానలు కురిసేలా చేస్తున్నాయి. 50 సంవత్సరాల చెట్టు వల్ల రూ. 17,70,000 ఆదాయం వుండగలదంటున్నారు శాస్త్రవేత్తలు. అందుకే పెద్దలు 'వృక్షోరక్షతి రక్షితః' - చెట్లను మనం కాపాడితే అవి మనలను కాపాడుతాయి అంటున్నారు. *- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*



Sthanka_Jan.colo.indd 29 30/12/10 2:43 PM

నిర్దిష్టమైన భూ భౌగోళిక వాతావరణ సమాచారాన్ని కాగితంపై/వస్త్రంపై, మాధ్యమంపై రంగులు, గుర్తులతో దృశ్యరూపంగా అర్థమయ్యేలా సూచించే సాధనాన్ని 'మ్యాప్' అంటారు. ఉదా: గ్రామ పటాలు (కెడస్ట్రల్)

### మ్యాప్‌లను ఎలా అర్థంచేసుకోవాలి

మ్యాప్‌లోని లక్షణాలను సరైన గుర్తులు, వర్ణాలతో సూచించవచ్చు. స్కేలు ద్వారా భూమిని ఖచ్చితంగా అంచనా వేయవచ్చును.

### మ్యాప్‌లు ఎందుకు కావాలి?

- ☆ ఒక ప్రదేశం సమాచారాన్ని మ్యాప్‌ల ద్వారా త్వరితంగా, సులువుగా అర్థం చేసుకోవచ్చు.
- ☆ మ్యాప్‌లు ఊహాత్మకంగా, దృశ్యరూపంగా సమాచారాన్ని గ్రహించేందుకు సహాయపడతాయి.
- ☆ మ్యాప్‌లు వనరుల అంచనాకు ఉపయోగపడతాయి.
- ☆ మ్యాప్‌లు సమర్థవంతమైన ప్రణాళికకు, పర్యవేక్షణకు ముందస్తు చర్యలకు ఉపయోగపడతాయి.




వివిధ స్కేలులో ఆకృతులు

# మ్యాప్‌లు, వాటి వృత్తాంతం

### మ్యాప్ స్కేలు

స్కేలు ద్వారా ఒక ప్రదేశం, మ్యాప్ పరిమాణం తెలుసుకోవచ్చు. భూ ఉపరితలంపై రెండు బిందువుల మధ్య దూరం మ్యాప్‌లోని రెండు బిందువులకు గల ముఖ్యదూరం పరస్పర నిష్పత్తిని స్కేలు సూచిస్తుంది.

*మ్యాప్‌లలో స్కేలును మూడు విధాలుగా సూచించవచ్చు:*

1. రిప్రజెంటేటివ్ ఫ్రాక్షన్ = మ్యాప్‌పై దూరం/భూమిపై దూరం= 1/25,000
2. వరీవల్ స్కేలు =1 కి.మీ =50 కి.మీతో సమానం.
3. గ్రాఫికల్ స్కేలు 0 10 20 30

ఉదా: 1:5000 స్కేలు అనగా మ్యాప్‌లో
1 సెం. లైన భూమిపై 500 మీ. తో సమానం.

*మ్యాప్ స్కేలులో రకాలు*

1. **పెద్ద స్కేలు(లార్జ్‌స్కేలు)** : ఇది తక్కువ ప్రాంతాన్ని సూచించి ఎక్కువ వివరాలను తెలియ జేస్తుంది.
   ఉదా: 1:1000,1:5000,1:10000 (కెడస్ట్రల్ మ్యాప్)
2. **చిన్న స్కేలు(స్మాల్ స్కేలు)** : ఇది ఎక్కువ ప్రాంతాన్ని సూచించి తక్కువ వివరాలను తెలియజేస్తుంది.
   ఉదా: 1:1,25,000,1:2,50,000 (అట్లాస్ మ్యాప్‌లో)

*మ్యాప్‌లలో రకాలు*

- ☆ టోపో గ్రాఫిక్ మ్యాప్‌లు
- ☆ కెడస్ట్రల్ మ్యాప్‌లు
- ☆ అట్లాస్/వాల్‌మ్యాప్‌లు
- ☆ పర్యాటక మ్యాప్‌లు
- ☆ థీమాటిక్ మ్యాప్‌లు

*టోపోగ్రాఫిక్ మ్యాప్‌లు*

భూమి ఉపరితలంపై టోపో గ్రాఫిక్ లక్షణాలతో, అడవులు, నీటి కాలువలు, ఎత్తుపల్లాలు, నదులు, చెరువులు, కృత్రిమంగా ఏర్పడ్డ గృహాలు, రోడ్లు, రైల్వే లైన్లు మొదలైనవి సూచించబడతాయి. టోపోగ్రాఫిక్ మ్యాప్‌లను టోపోషీట్లు అంటారు. టోపోషీట్ల సాధారణ స్కేలు 1:25,000,1:50,000 1:1,00,000, 1:2,50,000




టోపోషీట్



Sthanka_Jan.colo.indd 19 30/12/10 2:43 PM

*కెడస్ట్రల్ మ్యాప్‌లు*

గ్రామంలోని భూమి సరిహద్దులు, భూమి యజమాని సర్వే నెంబరులను సూచిస్తాయి. వీటిని భూములపై పన్నులు విధించడానికి అధికారులు వాడతారు.



కెడస్ట్రల్

*అట్లాస్, వాల్ మ్యాప్‌లు*

అట్లాస్ అనగా చిన్న స్కేలు మ్యాప్. వీటి ద్వారా ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్రదేశాలను క్లుప్తంగా సూచించవచ్చు.

వాల్ మ్యాప్‌లు పెద్ద స్కేలు మ్యాప్‌లు.పెద్ద షీట్లపై గీయబడతాయి. ఉదాహరణకు ప్రపంచపటం/ఆంధ్రప్రదేశ్ పటం వీటిని గోడలపై ప్రదర్శించి బోధిస్తారు.



ఒక ప్రదేశానికి చెందిన ఒక అంశాన్ని లేదా ఒక లక్షణాన్ని సూచిస్తూ తయారు చేస్తారు. ఉదా: భూమి వినియోగ మ్యాప్, రోమ్యాప్, వృత్తికా మ్యాప్

*మ్యాప్‌లు లభ్యమయ్యే ప్రదేశాలు*

టోపోషీట్లు సర్వే ఆఫ్ ఇండియా, ఉప్పల్, హైదరాబాదు వద్ద లభ్యమవుతాయి.కెడస్ట్రల్ మ్యాప్‌లను సెంట్రల్ సర్వే కార్యాలయం, నారాయణగూడా, హైదరాబాదు వారు రూపొందించి ముద్రిస్తారు. థీమాటిక్ మ్యాప్‌లను, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాదువారు రూపొందించి ముద్రిస్తారు.

*టోపోషీట్లు, వాటి లక్షణాలు*

టోపోషీట్లు చిన్న స్కేలు మధ్యస్థంగా ఉండి భౌగోళిక లక్షణాలు అయిన అడవులు, నదులు, వాగులు, రోడ్లు, రైల్వే లైను, గ్రామాలు సూచించబడతాయి. వీటి సాధారణ స్కేలు 1:25,000, 1:50,000, 1:2,50,00.




టోపోషీట్లలో అక్షాంశాలు మరియు రేఖాంశాలు ఉంటాయి

*అక్షాంశాలు మరియు రేఖాంశాల వృత్తాంతం*

గోళాకారంలో వుండే భూమి అక్షం పైభాగంలో ఉత్తర ధృవంగాను క్రింది భాగాన్ని దక్షిణ ధృవంగాను పరిగణించి భూగోళాన్ని గళ్లుగా విభజించారు. గడిలో అడ్డరేఖలను అక్షాంశాలుగా, నిలువు రేఖలను రేఖాంశాలుగా పేర్కొన్నారు. అక్షాంశాలు ఉత్తరం నుండి దక్షిణ దిశగాను ప్రయాణిస్తాయి. అక్షాంశాలు, రేఖాంశాలు కలిసే ప్రదేశాలను ఒక ప్రాంతం స్థానాన్ని గుర్తించడానికి ఉపయోగిస్తారు. అక్షాంశాలు, రేఖాంశాలను డిగ్రీలలో సూచిస్తారు. ప్రతి డిగ్రీ 60 నిమిషాలు. ప్రతి నిమిషము 60 సెకన్లుగాను విభజిస్తారు.




అక్షాంశాల, రేఖాంశాలతో భూమి



Sthanka_Jan.colo.indd 20 30/12/10 2:43 PM

### *టోపోషీటు సూచింపు*

ప్రతి షీటు 16 సమభాగాలుగా విభజింపబడి 15 రేఖాంశం, 15' అక్షాంశాలు

ఉదా: డిగ్రీ షీటు 45బి, టోపో షీటు సంఖ్య 45ఎమ్/1, 45ఎమ్/2, 45ఎమ్/3, 45ఎమ్/4 మొదలగు వాటుని కలిగి ఉంటుంది. అటువంటి ప్రి షీటు 1:50,000 స్కేలుతో అంటే ఒక సెంటీ మీటరు భూమిపై 0.5 కి.మీ గా ఉంటుంది.




వివిధ స్థాయి స్కేలులో టోపోషేటు సూచిక







సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన టోపో గ్రాఫిక్ షీట్ల సూచించే గడి, జిల్లా వారిగా టోపో షీట్ల నెంబర్లు.




*- డా॥ జి. శ్రీనివాసరావు, ఎస్. శాంతకుమార్*

*జి.ఐ.ఎస్., కన్సల్టెంట్, అపార్డు*









Sthanka_Jan.colo.indd 21 30/12/10 2:43 PM

# మొలక ధాన్యాలు- పోషక విలువలు

**మొలకెత్తించే విధానం అతి ప్రాచీనమైనది. అందరికి తెలిసినదే. ఎంచుకున్న ధాన్యాన్ని 1 రోజుపాటు నీటిలో నానబెట్టాలి, తరువాత నీటిని పారబోసి తడి బట్టలో మరొక రెండు మూడు రోజులు ఉంచినట్లయితే, 2-3 సెంటీమీటర్ల పొడవు మొలకలు వస్తాయి.**

విటమిన్ సి లేదా ఎస్కార్బిక్ యాసిడ్ గాయాలు నయం చేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. అంతేకాదు ఇది ఒక మంచి యాంటీ ఆక్సిడెంట్. క్రమం తప్పకుండా విటమిన్ సి తీసుకోవడం ద్వారా ఎన్నో రకాల కేన్సర్లు, గుండెజబ్బుల నుంచి రక్షణ పొందవచ్చు. విటమిన్ సి అధికంగా గల కూరగాయలు, పళ్ళను తరిగిన లేదా కోసిన తరువాత ఎక్కువ సమయం గాలిలో ఉంచడం వలన లేదా సరైన విధంగా నిల్వచేయకపోవడం వలన విటమిన్ సి చాలా వరకు నశించిపోతుంది. తాజాపళ్ళు, ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలు, పుల్లటి పళ్ళు ముఖ్యంగా కమల, నిమ్మ మొదలైన వాటిలో ఎక్కువ మోతాదులో విటమిన్ సి ని కలిగి వుంటాయి. ఉసిరి, జామకాయలలో అయితే మరింత ఎక్కువగా విటమిన్ సి ఉంటుంది.

అయితే విటమిన్ సి ని సమృద్ధిగా పొందే ఒక సులభ ఉపాయం ఉంది. మనం రోజూ తీసుకునే ధాన్యాలలో విటమిన్ సి అసలు ఉండదు. కాని వీటిని మొలకెత్తించినట్లయితే ధాన్యంలో 85 శాతం, మొలకలలో 15 శాతం విటమిన్ సి ఆవిర్భవిస్తుంది.



మన శరీరానికి 24 రకాల ఖనిజ లవణాలు అవసరం. శరీర పెరుగుదలకు, రక్షణకు, వివిధ శరీర భాగాలు సరిగా పని చేయడానికి ఈ ఖనిజ లవణాలు ఉపయోగపడతాయి. గింజ ధాన్యాలు, చిరు ధాన్యాలు, పప్పుదినుసులు తీసుకోవడం ద్వారా మనకు ఈ లవణాలన్నీ దాదాపుగా లభిస్తాయి.

రిఫైన్ లేదా శుద్ధి కావించబడని గింజ, తృణ ధాన్యాలలో ఫైటేట్‌లు, పీచు పదార్థాలు అత్యధికంగా ఉంటాయి. ఈ ఫైటేట్లు ఇనుము, జింకు, కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలను బంధించి ఉంచుతాయి. కాల్షియం, మెగ్నీషియం సమక్షంలో ఫైటేట్లు, ఇనుములో కూడా కరగని మిశ్రమాలను ఏర్పరచి తద్వారా ఇనుము ధాతువును శరీరానికి అందకుండా చేస్తాయి.

రాగులు, సజ్జలు లాంటి తృణ ధాన్యాలను అంకురింప చేయడం వల్ల, మాల్టింగ్ ప్రక్రియ ద్వారా ఇనుము, జింక్ లభ్యత శరీరానికి అసాధారణంగా పెరుగుతుంది. ఎందుకంటే మొలకెత్తిన గింజధాన్యాల పిండిలో ఆల్ఫాఅమైలేజ్ అనే ఎంజైమ్ ఎక్కువగా ఉంటుంది. వీటిని అమైలేజ్ రిచ్ ఫుడ్స్ అంటారు. ఈ రకమైన ఆహార పదార్థాలు గింజ ధాన్యాలను ఆధారంగా చేసుకొని తయారుచేయబడ్డవి. ఈ విధానం ద్వారా తయారు చేయబడ్డ ఆహారం తక్కువ నీటిని తీసుకుంటుంది. కాబట్టి ఇవి ఎక్కువ శక్తిని అందచేస్తాయి. అందుకే అమైలేజ్ రిచ్ ఫుడ్స్‌ను చిన్న పిల్లలకు మొదటగా ఇచ్చే తొలి ఘనాహారంగా వాడతారు. తక్కువ ఖర్చుతో తయారైన అదనపు ఆహారంలో తల్లులు అమైలేజ్ రిచ్ ఫుడ్స్‌ను కూడా చేర్చడం మంచిది. ఎందుకంటే శిశువులకు ఈ ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఎక్కువ శక్తి జనకాలను అందచేస్తుంది.

అందరికీ అందుబాటులో ఉండే ఆహార పదార్థాలలో ఈ ప్రక్రియకు అనువైనవి. చిరు ధాన్యాలలో రాగులు, పప్పు ధాన్యాలలో పెసలు - ఈ రెంటి కలయికతో ఏర్పడిన ఘనాహారం అత్యుత్తమైనది, సంపూర్ణమైనవిగా పరిగణించవచ్చు.

ఇప్పుడు మాల్టింగ్ చేసే విధానం ద్వారా ఈ ఘనాహారాన్ని తయారు చేసే పద్ధతిని గురించి తెలుసుకుందాం. ఒక కిలో శుద్ధి చేసిన రాగులని 5 నుంచి 15 గంటలు నీటిలో నానపెట్టాలి. తరువాత నీటిని పారబోసి తడిగుడ్డతో వదులుగా 1 నుండి 3 రోజులపాటు మూట కట్టి ఉంచాలి. ఈ మూటను అప్పుడప్పుడు నీటితో తడపడం మంచిది. అప్పుడు వీటికి మొలకలొస్తాయి. తరువాత వీటిని తీసి నీడలో అంటే సూర్యరశ్మి నేరుగా తగలకుండా ఎండబెట్టి, ఒక మోస్తరుగా, పొయ్యిపై సన్నని సెగలో వేయించి, తరువాత మొలకలను తొలగించి పిండి చేసుకోవాలి. ఆ పిండిని జల్లించి, మూత ఉన్న డబ్బాలో భద్రపరుచుకోవాలి.

ఇదే పద్ధతిలో పెసలు కూడా మాల్ట్ చేసుకోవాలి. అంటే అర కిలో సుద్ధి చేసిన పెసలని 10 నుంచి 15 గంటలు నానబెట్టాలి. తరువాత నీటిని పారబోసి, తడిగుడ్డలో వదులుగా మూటకట్టి ఒకరోజు అంటే 24 గంటలు ఉంచితే చాలు మొలకలొస్తాయి.

మొలకలొచ్చిన పెసలని ఎండబెట్టాలి. అయితే వీటిని రాగుల కంటే ఎక్కువ సేపు అంటే సుమారు 6 నుండి 8 గంటల పాటు ఎండబెట్టాలి. అంతేకాదు వాటిని ఒకేసారి పూర్తిగా ఎండబెట్టడం మంచిది. ఒకవేళ రెండు తడవులుగా ఎండబెడితే దాని రుచి చేదుగా మారుతుంది.

తరువాత పొట్టు, మొలకలు తొలగించి వేయించాలి. ఈ ప్రక్రియ, పెసలకి మంచి సువాసన. గోధుమ రంగు వచ్చే వరకూ సాగాలి. తరువాత వాటిని చల్లార్చి, పిండి చేసుకొని, జల్లెడ బట్టి జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి.

రెండు భాగాల రాగిమాల్ట్‌కి, ఒక భాగం పెసల మాల్ట్ కలిపిన 'బేబి ఫుడ్' అత్యుత్తమైనదిగా శాస్త్రజ్ఞులు గుర్తించారు.

కాబట్టి మొలకెత్తిన ధాన్యాలు ప్రతి రోజు ఆహారంలో పొందు పర్చుకోవడం వలన పిల్లలకు పెద్దలకు కూడా ఆరోగ్యకరం, రుచికరం కూడా.

*- డా॥ ఎ.సాయిబాబా, ఐ.ఐ.హెచ్.ఎఫ్. డబ్ల్యు*



Sthanka_Jan.colo.indd 18 30/12/10 2:43 PM

# ఉరి

తుమ్మేటి రఘోత్తమ రెడ్డి



**మనుషుల్లో అధమంగా బతికే మనుషులు ఉంటారు. బీదా బిక్కీ మనుషులు, స్లమ్స్‌లో బతికే మనుషులు, పూటకు గతిలేని మనుషులు, పదిహేనువందల జీతం కోసం ఉదయం ఎనిమిదికి వెళ్లి రాత్రి పన్నెండుకు తిరిగి వచ్చే మనుషులు... వీరు ఎంత కష్టపడినా ఎంత అధమంగా బతికినా అదృష్టవశాత్తు వీరంతా భూమ్మీదే బతుకుతారు. బాధ కలిగినప్పుడు కిటికీలోంచి కాస్తంత బయటకు తొంగి చూసి గాలి పీల్చుకుంటారు. ఒక పచ్చటి చెట్టు అలా వయ్యారంగా తల ఊపితే చాలు సేద తీరుతారు.**

కాని, ఈ అవకాశం కూడా లేకపోతే, వెలుతురనేదే లేకపోతే, జీవితంలో ప్రతి రోజూ భూమి కింద, భూమి అడుగున, భూమి పొరల్లో, భూమి చీకట్లో, బొగ్గులా, బొగ్గు తట్టలా, బొగ్గు పారలా, బొగ్గు బతుకులా బతకవలసి వస్తే? అలాంటి జీవితం ఎలా ఉంటుంది? బొగ్గు కార్మికుల బతుకు ఎలా ఉంటుంది?

అంతకు కొన్నాళ్ల ముందే ఆ ప్రాంతంలోని బొగ్గుగని కార్మికుల్లో హటాత్తుగా పుకార్లు లేచాయి. బొగ్గు గనుల్లోకి సంస్థ మరిన్ని మెషీన్లను దింపనుందట. మరింతగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించనుందట. కార్మికులకు పని పోతుందట. అన్నింటి కంటే ముఖ్యం-ఇంతవరకూ ఒక కార్మికుడు పని నుంచి రిటైరైతే ఆ కార్మికుని కుమారుడికే ఉద్యోగం ఇచ్చే ఆనవాయితీ ఇక మీదట ఉండదట.

ఈ పుకార్లు చాలా ఇళ్లల్లో కలవరం రేపాయి. రామచెంద్రం, నారాయణ ఇళ్లల్లో కూడా. ఇద్దరూ స్నేహితులు. ఒకే ర్యాంకు కార్మికులు. ఒకే ఈడువాళ్లు. సాయంత్రమైతే ఏ చాయ్ అంగడి దగ్గర్లో చేరి కష్టం సుఖం మాట్లాడుకుంటే తప్ప తెరిపి లేనివాళ్లు. కాని ఎన్ని మాట్లాడుకున్నా ఏం లాభం? సమస్యల నుంచి విముక్తి ఉంటే కదా.

రామచెంద్రం భార్య చాన్నాళ్ల క్రితమే చనిపోయింది. ఆమె ద్వారా అతనికి ఇద్దరు అబ్బాయిలు. మళ్లీ పెళ్లి చేసుకుంటే మరో ఇద్దరు కొడుకులు. ఇప్పుడు ఆ నలుగురు కొడుకులూ ఉద్యోగానికి వచ్చి, తండ్రి ఉద్యోగం మీద కన్నేసి, దానిని ఎగరేసుకుపోవడం ఎలా అని ఎదురు చూస్తున్నారు. 'తండ్రి రిటైరైతే కొడుక్కు ఉద్యోగం ఇవ్వని రూలు' రేపో మాపో వచ్చేలోపల అర్జెంటుగా తండ్రిని రిటైరు చేయించి ఆ ఉద్యోగం పొందాలని ఆశ పొందుతున్నారు.

కాని, ఉద్యోగం ఎవరికి ఇవ్వాలి? మొదటి భార్య కొడుకులకు వద్దని రెండో భార్య కొడుకులు గొడవ చేస్తున్నారు. రెండో భార్య సరేసరి. ఆ తండ్రి ఏం చేయాలి? రోజూ ఇంట్లో గొడవ ఏడుపులు, పెడబొబ్బలు. రామచెంద్రానికి మనశ్శాంతి లేదు. ఏమనుకున్నాడో ఏమో ఒకరోజు రాత్రి గుట్టుచప్పుడు కాకుండా ఉరి పెట్టుకున్నాడు.

ఉదయాన్నే నిద్రలేచిన నారాయణ ఆ వార్త విని సగం కృశించాడు. అప్పటికే అతడి ఇంట్లో పరిస్థితి కూడా బాగలేదు. అతడికి ఒక్కడే కొడుకు. ప్రయివేటు టీచరుగా పని చేస్తున్నాడు. చిల్లర డబ్బులు సంపాదిస్తున్నాడు. కాని ఇలా ఎంతకాలం అని తండ్రిని రిటైర్ అవమని అడుగుతున్నాడు. నారాయణకు యింకా నాలుగేళ్ల సర్వీసు ఉంది. ఒకవేళ వదిలేసి, కొడుక్కి ఉద్యోగం ఇచ్చినా, ఊళ్లో జరుగుతున్నది చూస్తున్నాడు. ఎంతమంది కొడుకులు తల్లిదండ్రులను గాలికి వదిలేయ లేదు గనుక? తన కొడుకు మాత్రం తనను చూస్తాడా? ఇది తేల్చుకోకుండా ఎలా ఉద్యోగం వదులుకోవడం? కొడుకు వినడు. ఇప్పటికే అలిగి మూడురోజులుగా ఇంటికి రావడం లేదు. ఎటు పోయాడో తెలియదు. వెతికి వెతికి కొడుకు గురించి బెంగలో ఉండగా ఇప్పుడు స్నేహితుడి చావు వార్త ఒకటి.

రామచెంద్రం అంత్యక్రియలు ముగిశాయి. నూరేళ్లూ బతకడానికి తామేమైనా భూమ్మీద టై కట్టుకొని తిరిగే ఉద్యోగులా? భూమి కింద పని చేసే కార్మికులు. చీకట్లో ఉండి చీకట్లోనే పోతారు. అది తెలుసు కనుకనే సాటి కార్మికులు నిర్లిప్తంగా ఉన్నారు. తట్టుకోలేని వాళ్లు సారాయి తాగి దుఃఖం లేనట్టుగా నటిస్తున్నారు. నారాయణ వాళ్లతో పాటే ఉండి బొందలగడ్డ నుంచి ఇంటికి తిరిగి వస్తుంటే దారిలో జలాల్ కనిపించాడు. ఫుల్లుగా తాగేసి ఉన్నాడు. అతడూ రామచెంద్రం స్నేహితుడే. సాటి కార్మికుడు. నారాయణను చూసి ఊగుతూ ఊగుతూ పక్కకొచ్చి, చెవిలో నెమ్మదిగా, ఏడుస్తున్నట్టుగా, భరించలేనట్టుగా చెప్పాడు - 'మన రామచెంద్రం వారి బెట్టుకోలేదు. చంపేశారు. నిన్న రాత్రి రెండో భార్య కొడుకులకూ, ఆయనకూ మాటామాటా పెరిగిందట. ఉద్యోగం ఇవ్వాల్సి వస్తే మొదటి భార్య పిల్లలకే ఇస్తానన్నాడట. అది విని, రెండో భార్య కొడుకు ఒక్క తాపు తంతే అక్కకడిక్కడే చనిపోయాడట. తర్వాత ఉరి వేశారట'..

నారాయణకు ఏమీ వినిపించడం లేదు. కాళ్ల కింద నేల కదిలి తూలి పడబోయాడు.

ఇంతకాలం - గనుల్లో గోడలు కూలి కార్మికులు చనిపోతుండేవాళ్లు. ఇవాళ- కుటుంబ సంబంధాలు కూలి కార్మికులు చనిపోయే రోజులు వచ్చాయి. దీనికి అంతం ఎప్పుడు? ☆

Printed & Published by: Dr. Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Chief Editor : Dr. Phani Kumar

Sthanka_Jan.colo.indd 30 30/12/10 2:43 PM


బాలికలను కాపాడుదాం!
జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం



పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖా మంత్రిగా

శ్రీ కె. జానారెడ్డి ప్రమాణస్వీకారం